www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రాష్ట్రాలకు రూ. 10 వేల కోట్లు!

రైతులు, పారిశ్రామిక ప్రగతికి సంస్కరణలు అమలు చేస్తే ఆర్థిక సాయం

భూ దస్త్రాల్లో సంస్కరణలు తీసుకొచ్చిన రాష్ట్రాలకు ఒకేసారి నిధుల విడుదల

2024-25లోనే అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు, పారిశ్రామిక పురోగతికి అనుగుణంగా సంస్కరణలు చేపట్టే రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం కింద రూ.10 వేల కోట్లు ఇవ్వనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ దస్త్రాలను పరిష్కరించడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి, గ్రామాల పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టే

మిగతా 14వ పేజీలో...

మంగళవారం | 20-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 143

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 8.33 తదుపరి విదియ; నక్షత్రం: శతభిషం తె. 3.10 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ.12.10-1.36; దుర్ముహూర్తం: ఉ.8.33-9.23, రా.10.19-11.03; అమృతఘడియలు: రా.8.44-10.10; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.33

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ. 31 వేల కోట్లు

మాఫీ చేస్తాం

స్పష్టంగా ఉన్న ఖాతాలకు మాఫీ పూర్తయింది

పరిశీలన అనంతరం ఇతర అకౌంట్లకూ అమలు

2 లక్షల పైన ఉంటే.. పైమొత్తం చెల్లిస్తే వెంటనే మాఫీ

దురుద్దేశంతో విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు

రైతుల కోసం బీజేపీ ఏమీ చేయలేదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు అన్ని వివరాలు సరిగా ఉన్న 22,37,848 ఖాతాలకు రూ.2 లక్షల దాకా రుణమాఫీ చేశామని తెలిపారు. ఇంకా.. ఆధార్ వివరాలు సరిగా లేని 1.65 లక్షల ఖాతాలు, తప్పులు ఉన్న 1.50 లక్షల ఖాతాలు, రేషన్‌కార్డు లేని 4.83 లక్షల ఖాతాలు, రూ.2 లక్షల పైన రుణాలు కలిగిన 8 లక్షల ఖాతాలకే రుణ మాఫీ ఆగిందని పేర్కొన్నారు. ఈ ఖాతాలకు వెరిఫికేషన్ అనంతరం రుణమాఫీ

మిగతా 12వ పేజీలో...

ఆ 'పైచిలుకు' మాటేంటి?

2 లక్షల పైమొత్తం ఎప్పుడు కట్టాలి? 12

స్పష్టమైన మార్గదర్శకాలివ్వని ప్రభుత్వం

రైతులు ముందుకొస్తున్నా బ్యాంకర్ల అడ్డు

కేబినెట్‌లో చర్చించాకే సర్కారు నిర్ణయం!

మాఫీ కాలేదంటూ జిల్లాల్లో నిరసనలు



సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న ప్రభుత్వ ఆర్థిక సాయంతో శస్త్ర చికిత్సలు చేయించుకున్న పిల్లలు

టార్గెట్ ఒలింపిక్స్

అన్ని క్రీడల శిక్షణ ఒకే గొడుగు కింద.. ఫోర్త్ సిటీలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ

క్రీడా విభాగాలు, శిక్షణా సంస్థలు దీని పరిధిలోకే

ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో క్రీడా పాఠశాల

తెలంగాణ యంగ్ ఇండియా బ్రాండ్‌గా మారాలి

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ముచ్చర్లలోని ఫోర్త్ సిటీలోనే ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొత్త వర్సిటీ గురించి శనివారమే ప్రకటించిన ముఖ్యమంత్రి సోమవారం దీనిపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్సిటీ ఎలా ఉండాలన్న దానిపై పలు సూచనలు చేశారు. దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకూ ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు

మిగతా 13వ పేజీలో...

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

చిన్నారి దుర్గకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా

సాయమందించాలని నిర్మల్ కలెక్టర్‌కు ఆదేశాలు

ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష: కోమటిరెడ్డి

ప్రతినిధి ద్వారా రూ.50వేలు పంపించిన సీతక్క

బాలికను ఆదుకుంటామన్న కేంద్ర మంత్రి బండి

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ప్రభుత్వం



సింఘ్వీ నామినేషన్

రాజ్యసభ ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి బరిలోకి 12

హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం, మంత్రులు

టీచర్ల నియామకాల్లో

'వర్గీకరణ' లేనట్టే!

న్యాయ, సాంకేతిక సమస్యలు తప్పవు

నియామక ప్రక్రియే జాప్యమయ్యే ముప్పు!

ప్రస్తుతానికి ఎస్సీ వర్గీకరణ లేకుండానే భర్తీ!

డీఎస్సీ ఫలితాల వెల్లడికి అధికారుల కసరత్తు



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే అవకాశం కనిపించడం లేదు. వర్గీకరణ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే న్యాయపరమైన ఇబ్బందులేగాక, సాంకేతిక సమస్యలూ ఉత్పన్నమై మొత్తం నియామక ప్రక్రియే నిలిచిపోయే ప్రమాదం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ప్రస్తుతానికి వర్గీకరణను పక్కన పెట్టి నియామకాలను చేపట్టాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. గత నెల 18 నుంచి ఈ నెల 5 వరకు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల ప్రాథమిక కీని కూడా విడుదల చేశారు. సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాలను వెల్లడించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే సీఎం

మిగతా 13వ పేజీలో...

రూ.5 వేల కోట్లతో..

సమీకృత గురుకులాలు

30 ప్రాంతాల్లో 120 భవనాలు

8 నెలల్లోపు పూర్తి చేయాలి

ప్రతి హాస్టల్ విద్యార్థికీ మంచం

29లోగా నివేదికలు ఇవ్వాలి

గురుకులాలపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి 13

సిద్దుకు తాత్కాలిక ఊరట



ఈ నెల 29 వరకు చర్యలు వద్దన్న హైకోర్టు

కర్ణాటక సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్

విధానసౌధలో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా

గవర్నర్ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ నిరసనలు

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కార్యకర్త మృతి 2



కాంగ్రెస్‌తో కేసీఆర్ ముచ్చట

మంచి ముహూర్తాన బీఆర్ఎస్ విలీనం

అందుకే అవినీతి కేసులన్నీ అటకెక్కించారు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి

రాష్ట్ర విద్యా కమిషన్‌లో నక్సల్ భావజాలం

ఉన్న వ్యక్తులు ఉన్నారంటూ వ్యాఖ్య 12

ఆమె డైరీలో చిరిగిన పేజీ

దాన్ని ఫొటో తీశా.. ఏం ఉందో సీబీఐ చెప్పొద్దన్నది

ముఖ్యమంత్రి మమత మీద నమ్మకం పోయింది

కోల్‌కతా ఆర్జీ కర్ ఘటనపై హతురాలి తండ్రి 2

యువతి మరణానికి ముందే 25 చోట్ల గాయాలు

నిందితుడు సంజయ్ రాయ్‌కి నేడు లై డిటెక్టర్ టెస్ట్!

సచివాలయం ముందు

రాజీవ్ విగ్రహమా?

తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని గతంలోనే నిర్ణయం

ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఆందోళనలు తప్పవు

మేమొచ్చాక రాజీవ్ విగ్రహాన్ని మరో చోటకు మారుస్తాం 12

రాఖీ నాడు కవిత లేకపోవడం బాధాకరం: కేటీఆర్

వాన.. వరదై

హైదరాబాద్‌లో 2 గంటలపాటు కుండపోత

మునిగిన కార్లు.. కొట్టుకెళ్లిన బైక్‌లు

గంటలకొద్దీ ట్రాఫిక్ జాం.. ప్రజల తిప్పలు

విమానాశ్రయం టెర్మినల్‌లోకి నీరు

రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షం

నిజామాబాద్‌లో వరదలో ఆర్టీసీ బస్సు

భీంగల్‌లో 10.6 సెం.మీ వర్షపాతం

వేర్వేరు చోట్ల పిడుగుపడి ఇద్దరి మృతి

మరో రెండు రోజుల పాటు వర్షాలే!



నిజామాబాద్‌లో రైల్వే కమాన్ వద్ద వరదలో చిక్కుకున్న బస్సు 3



14

కిటికీలోంచే రాఖీ

గురుకులంలో అక్క.. అనుమతివ్వని అధికారులు

తండ్రి భుజాలపైకి ఎక్కి కట్టించుకున్న తమ్ముడు

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఘటన

రక్తశుద్ధిపై చిత్తశుద్ధి

రాష్ట్రంలో నాలుగు ప్రాంతీయ వాస్క్యులర్ కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, పాలమూరుకు అవకాశం

రూ. 32.7 కోట్లతో త్వరలో రోగులకు అందుబాటులోకి

16 ప్రాంతాల్లో కొత్తగా డయాలసిస్ కేంద్రాలు

17 ఆస్పత్రులకు 74 అదనపు రక్తశుద్ధి యంత్రాల సరఫరా

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల వైఫల్య బాధితులకు ఊరట కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రం నలువైపులా నాలుగు ప్రాంతీయ వాస్క్యులర్ యాక్సెస్ కేంద్రాలు, కొత్తగా 16 చోట్ల డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు.. 17 ఆస్పత్రుల్లో అదనంగా 74 రక్తశుద్ధి యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు

మిగతా 14వ పేజీలో...





హైడ్రాను ఆపేదెలా?

గండిపేటలో కూల్చివేతతో ప్రముఖుల్లో గుబులు

దూకుడును ఆపేందుకు ఉన్నతస్థాయి చర్చలు!

మంత్రులు, అధికారుల వద్దకు అక్రమార్కులు

సీఎస్‌తో కమిషనర్ ఏవీ రంగనాథ్ భేటీ

జలాశయాల్లో కూల్చివేత వివరాల సమర్పణ

ఒకట్రెండు రోజుల్లో రెండో విడత ఆపరేషన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపట్టిన ఆపరేషన్‌తో ప్రముఖుల గుండెల్లో గుబులు మొదలైంది. ముచ్చటపడి కట్టుకున్న ఫామ్‌హౌస్‌లు, పచ్చటి ప్రకృతి అందాల

మిగతా 3వ పేజీలో...

మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు



ప్రధాని మోదీకి రాఖీ కడుతున్న బడి పిల్లలు


న్యూఢిల్లీ, ఆగస్టు 19: ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలు చేసుకున్నారు. సోమవారం ఉదయం కొందరు విద్యార్థులు ఢిల్లీలోని ప్రధాని నివాసానికి వెళ్లి ఆయన చేతికి రాఖీలు కట్టారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోలో విద్యార్థులు కుర్చీలో కూర్చున్న ప్రధాని మోదీకి రాఖీ కడుతుండగా ఆయన వారితో నవ్వుతూ ముచ్చటిస్తూ కనిపించారు. తర్వాత వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ప్రధాని మోదీ దేశ ప్రజలకు 'ఎక్స్'లో శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజలకు సుఖ సంతోషాలు, సౌభాగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

రాహుల్‌కు ప్రియాంక రాఖీ..

రక్షా బంధన్ సందర్భంగా కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తన సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో వారి చిన్ననాటి ఫొటోలు కూడా ఉన్నాయి. 'సోదర సోదరీమణుల మధ్య సంబంధం పూలతోట వంటిది. ప్రేమ, గౌరవం, పరస్పర అవగాహన, వివిధ జ్ఞాపకాలు, ఐక్యత, స్నేహం వంటివి దీనిలో వర్ధిల్లుతాయి' అని ప్రియాంక 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు' చెబుతూ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే కూడా రక్షా బంధన్ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య కళాశాలల్లో 'పొగాకు విరమణ కేంద్రాలు'

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు తమ బోధనాస్పత్రుల్లో పొగాకు విరమణ కేంద్రాలు (టీసీసీ) ఏర్పాటు చేయాలని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ఆదేశించింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు పంపింది. పొగాకు బారి నుంచి బయటపడాలనుకునే వారికి ఈ కేంద్రాల ద్వారా అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు, సదుపాయాలు అందుతాయని, పొగాకు ఆధారిత జబ్బులను తగ్గించడమే లక్ష్యంగా టీసీసీ కేంద్రాలు పనిజేస్తాయని ఎన్ఎంసీ తెలిపింది. ఈ కేంద్రాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరింది.



ఫేక్ ఎన్‌సీసీ శిబిరంలో విద్యార్థినిపై అత్యాచారం

16 మంది బాలికలకు లైంగిక వేధింపులు

కోచ్, ప్రిన్సిపాల్ సహా 11 మంది అరెస్టు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ పేరిట ఫేక్ శిబిరం నిర్వహించి ఓ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరో 16 మంది బాలికలను లైంగికంగా వేధించారు. ఈ ఘటనలో ఎన్‌సీసీ కోచ్, పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు మొత్తం 11 మందిని పోక్సో చట్టం కింద పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా బర్గూరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బర్గూరులోని ఒక పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9 వరకు ఎన్‌సీసీ శిబిరం నిర్వహించారు. ఇందులో మొత్తం 41 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 17 మంది విద్యార్థినులున్నారు. వీరికి పాఠశాల ప్రాంగణంలోనే వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో కావేరీపట్టణంకు చెందిన కోచ్ శివరామన్ (30) తనపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ శిబిరంలో పాల్గొన్న 8వ తరగతి విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శిబిరంలో పాల్గొన్న బాలికలందరిపైనా నిర్వాహకులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పేర్కొంది. అయినా ప్రిన్సిపాల్ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. బాధిత విద్యార్థిని ఈ నెల 16న అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు ఆమెను కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమెపై అత్యాచారం జరిగినట్లు ధ్రువీకరించారు. విద్యార్థిని ఫిర్యాదుతో బర్గూరు పోలీసులు విచారణ జరిపి కోచ్ శివరామన్, ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్ సహా మొత్తం 11 మందిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. కోచ్ శివరామన్ నామ్ తమిళర్ పార్టీకి చెందిన నేతగా విచారణలో తేలింది. కాగా ఎన్‌సీసీ శిబిరంలో అత్యాచారం జరిగిందంటూ వార్తలు వెలువడడంతో రక్షణశాఖ స్పందించింది. తాము ఎలాంటి ఎన్‌సీసీ శిబిరం నిర్వహించలేదని పేర్కొంది.

23న ఉక్రెయిన్‌కు మోదీ

- ఆ దేశాన్ని సందర్శించనున్న తొలి భారత ప్రధాని
- అంతకుముందు రెండు రోజుల పాటు పోలాండ్‌లో
- అక్కడి నుంచి రైలులో కీవ్‌కు ప్రయాణం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: యుద్ధభూమిగా మారిన ఉక్రెయిన్‌లో ప్రధాని మోదీ ఈ నెల 23న పర్యటించనున్నారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం మొదలయిన తరువాత భారత ప్రధాని ఆ దేశ పర్యటనకు వెళ్లనుండడం ఇదే తొలిసారి. ఈ పర్యటనకు మరో ప్రాధాన్యం ఉంది. భారత్-ఉక్రెయిన్‌ల మధ్య 30 ఏళ్ల క్రితం ద్వైపాక్షిక సంబంధాలు ప్రారంభం కాగా, ఆ దేశ సందర్శనకు వెళ్తున్న తొలి భారత ప్రధాని కూడా మోదీయే కావడం విశేషం. అంతకుముందు ఈ నెల 21, 22 తేదీల్లో పోలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన కూడా మరో విశేషాన్ని సంపాదించుకొంది. 45 ఏళ్ల అనంతరం భారత ప్రధాని పోలాండ్ సందర్శనకు వెళ్తున్నట్టయింది. పోలాండ్ నుంచి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు ప్రధాని మోదీ రైలులో వెళ్లనున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి(పశ్చిమ) తన్మయ లాల్ మాట్లాడుతూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు ప్రధాని ఆ దేశ పర్యటనకు వెళ్తున్నారని తెలిపారు. ఇటీవల ఆ ఇద్దరు నాయకులు చర్చలు జరిపారని, దానికి కొనసాగింపుగానే ఈ పర్యటన జరుగుతోందని చెప్పారు. చర్చల ద్వారానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్నది భారత విధానమని తెలిపారు. ప్రధాని మోదీ అధికారిక పర్యటనకు రానున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు కూడా ప్రకటన జారీ చేశారు. ద్వైపాక్షిక అంశాలు, బహుళ పక్ష సహకారంపై చర్చలు జరగడంతో పాటు, పలు ఒప్పందాలపై సంతకాలు కూడా ఉంటాయని వివరించారు.

'ట్రిపుల్ తలాక్' వివాహ వ్యవస్థకే ముప్పు

- దీంతో ముస్లిం మహిళల పరిస్థితి దయనీయం
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ట్రిపుల్ తలాక్ విధానం వివాహ వ్యవస్థకే పెనుముప్పు అని, దీనివల్ల ముస్లిం మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. 2017లో సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసినప్పటికీ.. ఆ విధానానికి అడ్డుకట్ట పడలేదని కేంద్రం అఫిడవిట్‌లో తెలిపింది. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో దాన్ని ఇంకా నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని, ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ చట్టం 2019 రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రముఖ సున్నీ పండితుల సంఘంగా అభివర్ణించుకున్న 'సమస్త కేరళ జమైతుల్ ఉలేమా' పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఈ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు కిందకు వస్తుందని పిటిషనర్లు వాదించగా.. దాన్ని కేంద్రం వ్యతిరేకించింది. ట్రిపుల్ తలాక్ విధానమే ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లని, రాజ్యాంగం మహిళలకు కల్పించిన సమానత్వపు హక్కును కాలరాసినట్లు అవుతోందని తెలిపింది. ముస్లిం మహిళల హక్కులను కాపాడేందుకే చట్టాన్ని చేసినట్లు వివరించింది.

ఇద్దరికి నేషనల్ జియో సైన్స్ అవార్డు

- ఐఐటీహెచ్ ప్రొఫెసర్ నరసింహ.. ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్‌లకు..
- నేడు ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ముర్ము



నరసింహ



ప్రసన్నకుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మక నేషనల్ జియో సైన్స్ అవార్డుకు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి(కెమికల్ ఇంజనీరింగ్ విభాగం), ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బంటు ప్రసన్న కుమార్ ఎంపికయ్యారు. వీరికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ము మంగళవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. కేంద్ర గనుల శాఖ 2023 ఏడాదిగానూ మొత్తం మూడు విభాగాల్లో 12 మందికి నేషనల్ జియో సైన్స్ అవార్డులను సోమవారం ప్రకటించింది. జియో సైన్స్‌లో అసాధారణ విజయాలు, అత్యుత్తమ సహకారం అందించిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బంటు ప్రసన్నకుమార్‌కు నేషనల్ జియో సైన్స్ అవార్డులు దక్కాయి. మినరల్ బెనిఫిషియేషన్, సుస్థిర ఖనిజ అభివృద్ధి రంగంలో ప్రొఫెసర్ నరసింహ విశేష కృషి చేశారని, జియోఫిజికల్ ఎక్స్‌ప్లొరేషన్, జియోఫిజికల్ మెథడ్‌ల అప్లికేషన్, జియో-మాగ్నెటిజం, జియోఫిజికల్ సర్వే టెక్నిక్‌లు, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో కొత్త సాంకేతికతను తేవడానికి ప్రసన్నకుమార్ కృషి చేశారని కేంద్రం తెలిపింది.

ఏచూరికి అస్వస్థత.. ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స



న్యూఢిల్లీ, ఆగస్టు 19: రాజ్యసభ మాజీ సభ్యుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబసభ్యులు హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. అత్యవసర విభాగంలో ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం సీతారాం ఏచూరి ఐసొలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

'నేరుగా నియామకాల'తో బహుజనుల హక్కులకు నష్టం: ఖర్గే

న్యూఢిల్లీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నేరుగా నియామకాల (లేటరల్ ఎంట్రీ) విధానం ద్వారా వివిధ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో నిపుణులను నియమించడానికి మోదీ ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకురావట్లేదని, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల హక్కులను హరించడానికి చేస్తున్న ప్రయత్నమని 'ఎక్స్' ద్వారా ట్వీట్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి బదులుగా గత దశాబ్ద కాలంలో ఆ సంస్థలలోని వాటాలను మోదీ ప్రభుత్వం అమ్మడం వల్ల 5.1 లక్షల ఉద్యోగాలు గల్లంతయ్యాయని విమర్శించారు. బీజేపీ పాలనలో తాత్కాలిక, ఒప్పంద నియామకాలు 91 శాతం పెరిగాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కేటాయించిన ఈ ఉద్యోగాలను ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వారికే ఇస్తున్నారని విమర్శించారు. ఇది రిజర్వేషన్లను బలహీనపరిచేందుకు, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ వేసిన ఎత్తుగడ అని ఖర్గే ఆరోపించారు.

లేటరల్ ఎంట్రీపై జేడీయూ, ఎల్‌జేపీ వ్యతిరేకత

న్యూఢిల్లీ, ఆగస్టు 19: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ఎన్డీయేలో విభేదాలు తలెత్తాయి. ఈ విధానాన్ని బీజేపీ మిత్ర పక్షాలైన జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ-రాం విలాస్) వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తప్పనిసరి అని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఎల్‌జేపీ నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిగా దీనిని తగిన వేదికపై ప్రస్తావిస్తానని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ఆందోళన కలిగించే విషయమని జేడీయూ జాతీయ అధికార ప్రతినిధి కేసీ త్యాగి పేర్కొన్నారు.

సిద్దరామయ్యకు ఊరట

29 వరకు చర్యలు వద్దన్న హైకోర్టు.. కర్ణాటక సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్



కర్ణాటక విధానసౌధ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ధర్నా

బెంగళూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట 14 ప్లాట్ల కేటాయింపుపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు మూడు ఫిర్యాదులు అందడంతో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతించిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా సిద్దరామయ్య తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కర్ణాటక హైకోర్టులో సోమవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మంత్రివర్గ నిర్ణయాన్ని తిరస్కరించి, గవర్నర్ ఆదేశాలు ఇవ్వడం సరికాదని మనుసింఘ్వీ వాదించారు. ఇప్పటికే విచారణ పూర్తయిన 12 అంశాలు గవర్నర్ ముందున్నా వాటి ప్రాసిక్యూషన్‌కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గవర్నర్ బీఎన్ఎస్ చట్టాన్ని ఉల్లంఘించారని, హడావుడిగా షోకాజ్ నోటీసు ఇచ్చారని వాదించారు. సీఎంపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహాంకు గతంలో సుప్రీంకోర్టు జరిమానా విధించిందని గుర్తు చేశారు. సిద్దరామయ్య భార్యకి ఆమె సోదరుడు దానంగా ఇచ్చిన భూమిని 2014లో స్వాధీనం చేసుకున్నారని, ఇందుకు పరిహారంగా 50:50 నిష్పత్తిన ఇంటిస్థలాలు కేటాయించారని తెలిపారు. గవర్నర్ తరఫున తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ గవర్నర్ మంత్రివర్గ సలహా తీసుకోవాల్సిన అవసరంలేదని, మధ్యప్రదేశ్ వివాదంలోనూ ధర్మాసనం ఆవిషయాన్ని ప్రస్తావించిందని తెలిపారు. సీఎం సలహా మేరకే మంత్రుల నియామకం ఉంటుంది గనుక మంత్రివర్గం నిర్ణయం ఆయనకు అనుకూలంగానే ఉంటుందన్నారు. కాగా, ఈనెల 29వరకు గడువుకావాలని సీఎం తరఫు న్యాయవాది కోరగా హైకోర్టు అంగీకరించింది. ప్రజాప్రతినిధుల కోర్టు కూడా ఈనెల 29వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రత్యేక ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదుదారులు ప్రదీప్‌కుమార్ తరఫున ప్రభులింగ నావదగి, స్నేహమయి కృష్ణ తరఫున లక్ష్మీఅయ్యంగార్, అబ్రహాం తరఫున రంగనాథరెడ్డి వాదనలు వినిపించారు.

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

గవర్నర్ నిర్ణయాన్ని ఖండిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు నిర్వహించింది. సీఎం సొంతనగరం మైసూరులో నిర్వహించిన ఆందోళనలో వేలాది మంది పాల్గొన్నారు. ప్రతిచోటా గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ నేతలు యడియూరప్ప, విజయేంద్ర, జేడీఎస్‌నేత కుమారస్వామి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మరోవైపు సీఎం సిద్దరామయ్య రాజీనామాకు డిమాండ్ చేస్తూ విధానసౌధలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. కాగా, గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌పార్టీ బీసీ, ఎస్సీ, మైనారిటీ సామాజికవర్గాల కార్యకర్తలు సోమవారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ కార్యకర్త రవిచంద్రన్(61) మాట్లాడుతూనే గుండెపోటుకు గురై కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. రవిచంద్రన్ మృతి పట్ల సీఎం సిద్దరామయ్య ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

రాజకీయ, న్యాయ పోరాటాలు చేస్తా: సిద్దూ

గవర్నర్ నిర్ణయంపై రాజకీయంగానూ, న్యాయపరంగానూ పోరాటం చేస్తామని సిద్దరామయ్య ప్రకటించారు. సోమవారం బెంగళూరులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఒక్క మచ్చ కూడా లేదన్నారు. రాజకీయంగా తనను అంతమొందిస్తే.. కాంగ్రెస్ కూడా అంతమవుతుందని బీజేపీ భావిస్తోందని, అయితే బీజేపీ కుట్రలు సాకారం కాబోవన్నారు.

ఎంపాక్స్ వైరస్.. విమానాశ్రయాలు, సరిహద్దుల్లో అలెర్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఎంపాక్స్ వైరస్ ప్రపంచ దేశాల్లో వేగంగా విస్తరిస్తుండడం.. ఫిలిప్పైన్స్‌లో తొలి కేసు నమోదు కావడంతో భారత్ అప్రమత్తమైంది. విమానాశ్రయాలు, భారత్-బంగ్లాదేశ్, భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణికుల్లో ఎంపాక్స్ లక్షణాలను గుర్తించాలని సూచించింది. దీంతో విమానాశ్రయాల్లో హైఅలెర్ట్ నెలకొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే ఎంపాక్స్‌ను ప్రజా ఆరోగ్య అత్యయిక స్థితిగా ప్రకటించిన విషయం తెలిసిందే..! గతంలోనే ఈ వైరస్ ఆఫ్రికా దేశాల్లో వెలుగు చూసినా.. ఇప్పుడు విస్తరిస్తున్నది కొత్త వేరియంట్ అని పేర్కొంది. 2022 నుంచి ఈ వేరియంట్ 116 దేశాల్లో 99,176 మందికి సోకిందని, వారిలో 208 మంది చనిపోయారని వివరించింది. ఒక్క కాంగోలోనే 15,600 కేసులు నమోదైనట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో.. ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి పీకే మిశ్రా నేతృత్వంలో ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, రాష్ట్రాల సన్నద్ధతపై అంచనాలు వేసింది. ఒకవేళ ఎంపాక్స్ దేశంలోకి ప్రవేశిస్తే తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందించింది. ఆ వివరాలు..

- ఎంపాక్స్ లక్షణాలున్నవారు, వ్యాధి నిర్ధారణ అయిన వారిని క్వారంటైన్ చేయడానికి ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా, సఫ్దర్‌జంగ్, లేడీ హార్డింగే ఆస్పత్రులను ఎంపిక చేసింది.
- రాష్ట్రాలు కూడా సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఎంపాక్స్ చికిత్స కోసం ప్రత్యేక ఆస్పత్రులను ప్రకటించాలని సూచించింది.
- ఇప్పటి వరకు దేశంలో కొత్త వేరియంట్ ఎంపాక్స్ కేసులు వెలుగుచూడలేదని, ఒకవేళ ఆ వైరస్ దేశంలోకి వచ్చినా.. చికిత్సలకు సన్నద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఈ వైరస్ వ్యాప్తి తీవ్రత తక్కువగా ఉంటుందని వివరించింది. 2022 నుంచి 30 దాకా కేసులు భారత్‌లో నమోదైనట్లు వివరించింది. ఈ ఏడాది మార్చిలో చివరిసారి ఎంపాక్స్ కేసు వెలుగు చూసినట్లు తెలిపింది.
- రాష్ట్రాలు తగినంతగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. కేంద్రం ఆధ్వర్యంలో 32 టెస్టింగ్ ల్యాబ్(వేరియంట్లను గుర్తించేవి)లు పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది.

ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తాం

- మ్యానిఫెస్టోలో ఒమర్ అబ్దుల్లా హామీ

శ్రీనగర్, ఆగస్టు 19: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని, తిరిగి రాష్ట్ర హోదా కల్పిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం 12 అంశాలతో కూడిన మ్యానిఫెస్టోను మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా విడుదల చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తొలి తీర్మానం చేస్తామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ఆమె డైరీలో ఓ చిరిగిన పేజీ!

ఆ పేజీని ఫొటో తీసి దగ్గర పెట్టుకున్నా.. ఏం రాసి ఉందనేది సీబీఐ చెప్పొద్దంది

- ఆర్జీ కర్ ఘటనపై హతురాలి తండ్రి




అత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతాలో ర్యాలీ నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

కోల్‌కతా, ఆగస్టు 19: కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెకు డైరీ రాసే అలవాటు ఉందని, హత్యాచార ఘటన తర్వాత ఆ డైరీలో ఓ పేజీ చిరిగి ఉందని హతురాలి తండ్రి మీడియాకు వెల్లడించారు. ఆ చిరిగిన పేజీ తాలూకు ఫొటో తన వద్ద ఉందని చెప్పిన ఆయన, అందులో ఏం రాసి ఉందనే విషయాన్ని మాత్రం వెల్లడించేందుకు నిరాకరించారు. సీబీఐ అధికారుల సూచన మేరకే తాను బహిరంగపర్చడం లేదని చెప్పారు. హత్యాచార ఘటనపై ప్రజల ఆందోళనలను అణచివేసేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఫలితంగా తమకు సీఎం మమతపై నమ్మకం పోయిందని హతురాలి తండ్రి వ్యాఖ్యానించారు. 'న్యాయం చేయాల్సిన స్థానంలో ఉన్న మమత, తానే న్యాయం కావాలి అంటూ డిమాండ్ చేయడంలో ఔచిత్యం ఏమిటి? బాధిత కుటుంబానికి న్యాయం కోసం ఆమె ఏమీ చేయడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా హతురాలికి తల, పెదవులు, చెంపలు, ముక్కు, కుడి దవడ, గదమ, ఎడమ భుజం, ఎడమ మోకాలు, చీలమండతో పాటు అంతర్గత అవయవాల్లో గాయాలైనట్లు.. ఊపిరితిత్తుల్లో రక్తస్రావమైనట్లు, శరీరంలో కొన్నిచోట్ల బ్లడ్ క్లాట్స్‌ను కనుగొన్నట్లు పోస్టుమార్టం రిపోర్టు తేల్చింది. మొత్తంగా హతురాలి శరీరంపై 16 చోట్ల.. అంతర్గతంగా తొమ్మిదిచోట్ల తీవ్ర గాయాలయ్యాయని, అన్ని గాయాలు కూడా ఆమె మరణానికి ముందే సంభవించినవేనని.. గొంతు నులమడంతోనే ఆమె మృతిచెందినట్లు నివేదిక తేల్చింది. మరోవైపు.. హత్యాచార ఘటనలో నిందితుడైన సంజయ్ రాయ్‌కి సీబీఐ మంగళవారం లై డిటెక్టర్ టెస్టు(పాలీగ్రాఫ్) నిర్వహించే అవకాశం ఉంది. హత్యాచార ఘటకు సంబంధించి ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సంజయ్ ఘోష్‌ను సీబీఐ అధికారులు వరుసగా నాలుగో రోజూ విచారణ చేశారు. ఘటనకు ముందు, తర్వాత ఆయన ఎవరెవరికి ఫోన్ చేశారు? అనేది తెలుసుకున్నారు. వాట్సాప్‌లో చాట్ లిస్ట్‌నూ పరిశీలించారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతా, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో వైద్య విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. ఆందోళనలో భాగంగా కోల్‌కతాలో సోమవారం ఎక్కడికక్కడ వైద్యులు మానవ హారంగా ఏర్పడి రహదారులను దిగ్బంధనం చేశారు పోలీసులకు మహిళా వైద్యులు రాఖీలు కట్టారు. హత్యాచార ఘటనలో దోషులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కలకత్తా హైకోర్టు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలోని నిర్మాణ్ భవన్ ఎదుట వైద్యులు.. నిరసనల్లో భాగంగా రోడ్డు మీదే ఓపీ సర్వీసులు నిర్వహించారు. మరోవైపు.. హత్యాచార ఘటనకు సంబంధించి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను సీబీఐ విచారణ చేయాలంటూ బహిరంగంగా డిమాండ్ చేసిన టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ రేకు పోలీసులు సమన్లు జారీచేశారు. హతురాలికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేశారనే ఆరోపణలతో బీజేపీకి చెందిన మాజీ ఎంపీ లాకెట్ చటర్జీకి, మరో ఇద్దరు వైద్యులకు కూడా పోలీసులు సమన్లు జారీ చేశారు. మరోవైపు.. తనకు పోలీసులు సమన్లు జారీ చేయడాన్ని సుఖేందు శేఖర్ హైకోర్టులో సవాలు చేశారు. హతురాలి ఫొటోను సోషల్ మీడియా ద్వారా బహిర్గతం చేస్తూ సీఎం మమతను హెచ్చరిస్తూ కామెంట్ పెట్టిన ఓ వ్యక్తిని కూడా కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. హత్యాచార ఘటనలో దోషులను రక్షించేందుకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేశారని.. ఇందుకు బాధ్యత వహిస్తూ సీఎం మమత తన పదవికి రాజీనామా చేయాలంటూ బీజేపీ డిమాండ్ చేసింది. ఇక.. మమత రాజీనామా చేయాలంటూ ఆమె వైపు వేలెత్తి చూపేవారి వేళ్లను విరిచేస్తామంటూ బెంగాల్ క్యాబినెట్ మంత్రి ఉదయన్ గుహ హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఓ వీడియో నెట్‌లో చక్కర్లు కొడుతోంది.

16వ శతాబ్దం నుంచి 'రాఖీ'

చరిత్రపై సుధామూర్తి వీడియో పోస్ట్.. సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ



న్యూఢిల్లీ, ఆగస్టు 19: రాజ్యసభ ఎంపీ సుధామూర్తి రాఖీ పండుగ చరిత్రను తెలియజేస్తూ పోస్టు చేసిన ఓ వీడియోపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'నాకు ముఖ్యమైన పండుగల్లో రక్షా బంధన్ కూడా ఒకటి. సోదరి కష్టంలో ఉన్నప్పుడు ఆమెకు సోదరుడు అండగా ఉంటాననే భరోసాతో కట్టే దారమే ఈ రాఖీ. 16వ శతాబ్దంలో ఈ సంప్రదాయం మొదలైంది. రాణి కర్ణావతి సామ్రాజ్యం చాలా చిన్నది. ఒకరోజు ఆమె రాజ్యంపై దండయాత్ర జరగడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆమె ఒక చిన్న దారాన్ని మొఘల్ చక్రవర్తి హుమయూన్‌కు పంపింది. కానీ, దాని సారాంశం హుమయూన్‌కు అర్థం కాలేదు. దాని గురించి స్థానికులను అడగ్గా.. ఇక్కడి సాంప్రదాయం ప్రకారం ఇది సోదరుడి సాయం కోరుతూ సోదరి నుంచి వచ్చే పిలుపు అని వారు చెప్పారు. దీంతో హుమయూన్ వెంటనే కర్ణావతికి సాయం చేసేందుకు బయల్దేరుతాడు. ఆ రోజుల్లో విమానాలు లేవు కాబట్టి గుర్రంపై వెళ్లే సరికి ఆలస్యమైంది. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోతుంది. కానీ, అప్పటి నుంచి రాఖీ సాంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. ఈ పర్వదినం నాడు మహిళలు ఎంత దూరంలో ఉన్నా సరే వారి సోదరుల వద్దకు వెళ్లి రాఖీ కడుతున్నారు' అని సుధామూర్తి వివరించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోపై మిశ్రమ స్పందన వస్తోంది. అనేక మంది సుధామూర్తి వివరణను విభేదిస్తూ ట్రోల్ చేస్తున్నారు.

కాల్పుల విరమణకు.. ఇజ్రాయెల్ అంగీకారం

- హమాస్ నుంచీ అదే స్పందన ఆశిస్తున్నాం
- అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్

టెల్ అవీవ్, ఆగస్టు 19: పశ్చిమాసియాను దాదాపు పది నెలలుగా కుదిపేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టేందుకు తాము చేసిన "బందీల విడుదలకు ప్రతిగా కాల్పుల విరమణ" ప్రతిపాదనకు ఇజ్రాయెల్ అంగీకారం తెలిపిందని.. హమాస్ నుంచి కూడా అదే స్పందనను ఆశిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించారు. ఆదివారం టెల్ అవీవ్‌కు చేరుకున్న ఆయన.. ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌ను కలిశారు. అనంతరం జెరూసలెం వెళ్లి ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో సోమవారం దాదాపు రెండున్నర గంటలపాటు చర్చలు జరిపారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. "బందీలను వెనక్కి తెచ్చుకోవడానికి, కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి శాంతి, భద్రతల సాధన దిశగా ప్రతి ఒక్కరినీ మెరుగైన బాటలో పెట్టడానికి.. బహుశా ఇదే చివరి, ఉత్తమ అవకాశం" అని బ్లింకెన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ఇక హమాస్ 'అవును' అని చెప్పడమే మిగిలి ఉందని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై త్వరగా నివేదిక ఇవ్వండి

- విజిలెన్స్ డీజీకి జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశం
- మధ్యంతర నివేదిక అందజేసిన డీజీ ఆనంద్



జస్టిస్ పీసీ ఘోష్‌ను కలిసి బయటికి వస్తున్న సీవీ ఆనంద్

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను త్వరగా అందించాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించారు. సోమవారం కమిషన్ ముందు ఆ విభాగం డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ హాజరయ్యారు. విచారణ నివేదిక ఎక్కడిదాకా వచ్చిందని ఈ సందర్భంగా జస్టిస్ పీసీ ఘోష్ ఆరా తీయగా... ప్రాథమిక నివేదికను ఇప్పటికే ఇచ్చామని ఆనంద్ తెలిపారు. మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని కాపీని తీసి, ఆయనకు అందజేశారు. పూర్తి నివేదిక ఇవ్వడానికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఒక అంశంపై కమిషన్ విచారణ జరుగుతున్నప్పుడు మరో సంస్థ విచారణ చేయాలా? వద్దా? స్పష్టత ఇవ్వాలని ఆనంద్ కోరారు. కమిషన్ ఏర్పడే నాటికీ జరిగిన విచారణ ప్రక్రియలో భాగంగా చోటు చేసుకున్న అంశాలు, గుర్తించిన అంశాలపై పూర్తి నివేదిక అందించాలని జస్టిస్ ఘోష్ స్పష్టం చేశారు. విచారణలో భాగంగా ప్రాజెక్టుకు చెందిన కీలక పత్రాలను తీసుకెళ్లారని, ఆ పత్రాల ప్రతులన్నీ కమిషన్‌కు అందించాలని జస్టిస్ పీసీ ఘోష్ కోరారు. అందుకు ఆనంద్ అంగీకరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలకు గల కారణాలేంటి? డిజైన్ లోపమా? నిర్మాణ లోపమా? నిర్వహణ లోపమా? కారణాలు గుర్తించాలని బెంగాల్ లోని ఫరక్కా బ్యారేజీకి చెందిన ఇంజనీరింగ్ నిపుణులతో జస్టిస్ ఘోష్ తనిఖీలు చేయించారు. బ్యారేజీ వైఫల్యానికి గల కారణాలపై వారి నుంచి నివేదికను కోరారు. విచారణలో కీలకమైన క్రాస్ ఎగ్జామినేషన్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 21న తొలి రోజు మాజీ ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్‌ను కమిషన్ చైర్మన్ స్వయంగా ప్రశ్నించనున్నారు. ఇప్పటికే 57 మంది అఫిడవిట్లు దాఖలు చేశారు. ఎవరెవరినీ క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలనే దానిపై ఘోష్ నిర్ణయం తీసుకుంటారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ వైఖరిపై కమిషన్ ఆగ్రహంతో ఉంది. విచారణలో భాగంగా కమిషన్ ముందు హాజరై... వివరాలు అందించిన ఆయన్ను అఫిడవిట్ రూపంలో వివరాలు అందించాలని కమిషన్ ఆదేశించింది. ఆయన స్పందించలేదు. సోమవారం కూడా కమిషన్ నుంచి ఆయనకు ఫోన్ వెళ్లింది. అఫిడవిట్ దాఖలు చేయకపోతే తదుపరి ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై కమిషన్ సమాలోచనలు జరుపుతోంది. క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసే లోపు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం జరుగుతున్నప్పుడు కీలక స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధులకు కబురు పంపించాలని కమిషన్ యోచిస్తోంది. కమిషన్ ముందు హాజరై... పథకానికి సంబంధించిన వివరాలు అందించాలని కోరే అవకాశం ఉంది.



జలమయమైన నిర్మల్ జిల్లాకేంద్రంలోని బస్టాండ్



షేక్‌పేట నాలా వద్ద ప్రధానరహదారిలో వరదనీటిలో సగానికిపైగా మునిగిన కారు

వాన.. వరదై.. వాహనాలను ముంచేసి..

హైదరాబాద్‌లో 2గంటలపాటు కుండపోతగా వర్షం.. వరదకు టోలిచౌకీలో మునిగిన కార్లు.. కొట్టుకుపోయిన బైక్‌లు

- వాహనాల్లో ఉన్న వారిని బయటకు తీసిన స్థానికులు
- షేక్‌పేటలో అత్యధికంగా 5.3 సెం.మీ నమోదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్): ప్రధాన రోడ్లు ఉన్నట్టుండి చెరువుల్లా మారిపోతే? పోటెత్తుతున్న కాలువలను తలపిస్తే? హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం కొన్నిచోట్ల వాహనదారులకు ఇలాంటి అనుభవం ఎదురైంది. అప్పటిదాకా రయ్యిన దూసుకెళ్లిన కార్లు, బైక్‌లు.. కుండపోత వర్షంతో ముందుకు కదిలేందుకు మొరాయించాయి! కొద్దిసేపటికే.. వరద పోటెత్తడంతో ఆ నీళ్లలో బైక్‌లు కొట్టుకుపోయాయి! కార్లు మునిగిపోయాయి. లోపల చిక్కుకున్నవారిని స్థానికులు బయటకు తీయాల్సి వచ్చిందంటే ఏ స్థాయిలో వర్షం కురిసిందో అర్థం చేసుకోవచ్చు!! గతంలో ఎన్నడూలేని విధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరింది. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో రెండు గంటల పాటు కుండపోత వర్షం పడింది. వరద ఉధృతికి టోలిచౌకీ, సికింద్రాబాద్, షేక్‌పేట నాలా, యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్, ఫిలింనగర్ దీన్‌దయాళ్ నగర్ ప్రాంతాల్లో రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. టోలిచౌకీ గెలాక్సీ వద్ద వరదనీరు ముంచేయడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు నీటమునిగి.. కదల్లేకపోయాయి. కొన్ని కొట్టుకుపోయాయి. కార్లు సగం దాకా మునిగి అతికష్టమ్మీద లోపలున్న వారు బయట పడ్డారు. రోడ్లపై వరద నీరు చేరడంతో పలు చోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కుత్బుల్లాపూర్ వెంకన్నహిల్స్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరింది. నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి.. మురుగు నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షేక్‌పేటలో 5.3 సెం.మీ, యూసుఫ్‌గూడలో 5.2, గచ్చిబౌలిలో 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. పలుప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సోమవారం పలు జిల్లాల్లో వర్షం పడింది. నిజామాబాద్‌లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరద పోటెత్తింది. నగరంలోని రైల్వే కమాన్ అండర్‌బ్రిడ్జి వద్దకు భారీగా వరద పోటెత్తడంతో ఓ ఆర్టీసీ బస్సు నీళ్లలో చిక్కుకుపోయింది. లోపల 40మంది దాకా ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులొచ్చి.. స్థానికుల సాయంతో వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. జిల్లాలోని భీంగల్‌లో 10.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా పరిధిలోని మరో నాలుగు మండలాల్లో 5సెం.మీ పైచిలుకు వర్ష పాతం నమోదవ్వడం గమనార్హం. సిద్దిపేట జిల్లా ధూల్మిట్టలో 10.6 సెం.మీ, నల్లగొండ జిల్లా గుర్రంపోడులో 9.5 సెం.మీ, జగిత్యాల జిల్లా మేడిపల్లిలో 7 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో 5.1 సెం.మీ, సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేటలో 6.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

పిడుగులు పడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇద్దరు మృతిచెందారు. పొలంలో పెసరకాయ ఏరుతుండగా పిడుగుపడటంతో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంకిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు కార్తీక్ మృతిచెందాడు. పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి పిడుగుపడటంతో మంచిర్యాల జిల్లా భీమిని మండలం బిట్టూరుపల్లి గ్రామానికి చెందిన జక్కుల భాస్కర్ (56) మృతి చెందాడు.

సాగర్ గేట్లు మూసివేత

కృష్ణా పరిధిలో వరద తగ్గడంతో నాగార్జునసాగర్ గేట్లు మూసివేశారు. సాగర్‌కు 14 రోజుల్లో 200 టీఎంసీల వరద వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టుకు 96,811 క్యూసెక్కుల వరద వస్తోంది. 37,540 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 195.21 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టమైన 45.77 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి 16వేల క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. గోదావరి పరిధిలోని మేడిగడ్డకు వరద ప్రవాహం కొనసాగుతోంది. 2.02 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 3.1 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

మరో రెండ్రోజులు వర్షాలే

రాష్ట్రవ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో గ్రేటర్ హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నిజామాబాద్, కరీంనగర్, హన్మకొండ, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, గద్వాల, నారాయణ్‌పేట జిల్లాలో, ఈనెల 21న కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటలకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది.

బురద రోడ్డులో ఎడ్లబండిపై ప్రయాణం.. తల్లి గర్భంలోనే శిశువు మృతి

- అంబులెన్స్‌కి దారిలేక దారుణం.. ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన

పెంచికలపేట, ఆగస్టు 19 : తీవ్రమైన నొప్పులు, రక్తస్రావంతో నరక యాతన అనుభవిస్తున్న ఓ గర్భిణి బురదమయమైన రోడ్డుపై ఎడ్లబండిలో 2.5 కి.మీ ప్రయాణించడంతో ఆస్పత్రికి చేరుకునేలోపే గర్భస్థ శిశువు చనిపోయింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం మేరగూడకు చెందిన దుర్గం పంచపూల గర్భిణి. సోమవారం తెల్లవారు జామున తీవ్రమైన నొప్పులతో ఆమెకు రక్తస్రావం అయింది. మేరగూడ రోడ్డు గుంతలతో బురదమయంగా ఉండడంతో 108 అంబులెన్స్ చేరుకునే పరిస్థితి లేదు. చేసేదేమీ లేక గర్భిణి ఎడ్ల బండిలో అవస్థలు పడుతూ 2.5కి.మీ. ప్రయాణించింది. అప్పటికే ఎల్లూరుకు చేరుకున్న ఆమెను కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. కానీ గర్భిణి పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే గర్భంలోనే శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు.

అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనుల రాళ్ల దాడి

- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సిరికొండ, ఆగస్టు 19 : నిజామాబాద్ జిల్లాలో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనులు సోమవారం రాళ్లతో దాడి చేశారు. జిల్లాలోని సిరికొండ మండలం జంగిలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని 397 కంపార్టుమెంట్‌లో గ్రామానికి చెందిన గిరిజనులు అటవీ భూమిలోని చెట్లు నరికి ఆక్రమించుకున్నారు. ఇటీవలే పంటలు కూడా సాగు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు సోమవారం భారీ పోలీసు బందోబస్తుతో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడానికి జంగిలోడి తండాకు వెళ్లారు. పంటలను జేసీబీలతో తీసివేసేందుకు అధికారులు యత్నిస్తుండగా.. గ్రామానికి చెందిన గిరిజన మహిళలు, యువకులు.. పంటలను ఎందుకు తీసివేస్తున్నారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అటవీ, పోలీసు సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. అటవీ భూమిని ఆక్రమించుకున్న వారితో పాటు దాడికి పాల్పడిన వారిపైనా చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత.. ఏసీపీ రాజవెంకటరెడ్డిని కోరారు. దీంతో పోలీసులు దాడికి పాల్పడిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.



తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించిన దళితవాడ ప్రజలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన జనం

- సరఫరా కాని భగీరథ నీరు.. పని చేయని బోర్లు
- వికారాబాద్ జిల్లా మంబాపూర్‌వాసుల అవస్థలు

పెద్దేముల్, ఆగస్టు 19: తాగునీటి కోసం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ వాసులు రోడ్డెక్కారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రత్యేకాధికారుల పాలనలో అధికారులు జనం సమస్యలు పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఈ గ్రామంలో మూడు రోజులుగా మిషన్‌భగీరత నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని దళితవాడలో ఉన్న రెండు బోర్లు కూడా చెడిపోయి రెండు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మూడు రోజుల నుంచి నీటిసరఫరా నిలిచిపోయి జనాలకు నీటి కటకట ఏర్పడింది. రోజువారీ అవసరాలకు కూడా నీళ్లు లేకపోవడంతో దళితవాడ ప్రజలంతా ఖాళీ బిందెలు తీసుకుని రోడ్డుపైకి వచ్చారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రేగొండి శ్రవణ్‌కుమార్ మెకానిక్‌కును తీసుకుపోయి రెండు బోర్లకు మరమ్మతులు చేయించారు. దీంతో వారు ధర్నాను విరమించారు. కాగా, బషీరాబాద్ మండలంలోని పర్వత్‌పల్లిలో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయడంతో నీటి ఇబ్బందులు మరింత పెరిగాయి. గ్రామంలో మల్లన్న గూడి దగ్గర పని చేస్తున్న బోరు వద్దకు తెల్లవారక ముందే గుమిగూడి బిందెలతో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పనిమనిషిగా దగ్గరై.. అదనుచూసి మొత్తం దోచేసే కి'లేడీ'

- ఇప్పటికే 16 కేసులు.. 10 సార్లు జైలుకు
- బయటికొచ్చాక కూడా 18 దొంగతనాలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 30.. చోరీ కేసులు 34.. ఇప్పటికే 10 సార్లు జైలుకెళ్లి వచ్చింది.. అయినా మార్పు రాలేదు.. యథావిధిగా చోరీలు కొనసాగిస్తోంది. ఒంటరిగా ఉంటున్న వృద్ధులే ఈమె టార్గెట్..! వారిని మచ్చిక చేసుకుని దగ్గరవుతుంది. ఆ తర్వాత ఉన్నదంతా ఊడ్చుకుపోతుంది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పోలీసులు ఆ కిలాడి లేడీ ఆట కట్టించారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిశోర్ సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సూర్యచంద్ర చక్ర జగదాంబ(30)కు భర్త చనిపోయాడు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులోని పెట్రోల్ బంకు దగ్గర చెరువుగట్టు సమీపంలో నివాసం ఉంటోంది. వృద్ధులు ఉండే ఇల్లు కంటబడితే అనుపానులు గమనిస్తుంది. తనకు ఎవరూ లేరని, తిండికి కూడా డబ్బుల్లేవని నమ్మించి వారి ఇంట్లో పనిమనిషిగా చేరుతుంది. బంగారు వస్తువులు ఉన్నాయని నిర్ధారించుకున్నాక.. మాయ మాటలు చెప్పి అన్నం, ప్రసాదం, జ్యూస్, కూల్‌డ్రింక్‌లలో నిద్రమాత్రలు కలిపి ఇస్తుంది. అవి తీసుకున్న వృద్ధులు స్పృహ కోల్పోయిన తర్వాత ఒంటిపై ఉన్న నగలతో పాటు ఇంట్లోని బంగారు వస్తువులు దోచుకుని ఉడాయిస్తుంది. ఈ క్రమంలో అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ నెల 18న ఆమెను అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. గతంలో ఆమె 16 కేసుల్లో నిందితురాలని, 10 కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించిందని చెప్పారు. విడుదలైన తర్వాత కూడా సుమారు 18 దొంగతనాలు చేసిందన్నారు.

అనాథాశ్రమంలో ఉసురు తీసిన ఆహారం

- ముగ్గురు మృతి.. ఏడుగురికి సీరియస్.. 80 మందికి అస్వస్థత
- ఏపీలోని అనకాపల్లి జిల్లా కోటవురట్లలో విషాదం

విశాఖపట్నం/కోటవురట్ల/నర్సీపట్నం, ఆగస్టు 19: అభంశుభం ఎరుగని చిన్నారులను కలుషితాహారం కాటేసింది. ఏపీలోని అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ అనాథాశ్రమంలో ఘోరం జరిగింది. ఆశ్రమ నిర్వాహకుడు ఓ ఫంక్షన్‌లో మిగిలిన ఆహారం తీసుకొచ్చి రాత్రి పిల్లలకు పెట్టారు. ఆహారం కలుషితం కావడంతో ముగ్గురు పిల్లలు మృత్యువాత పడ్డారు. మొత్తం 80 మంది వరకు అస్వస్థతకు గురవ్వగా, ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నటు సమాచారం.

కైలాసపట్నంలో క్రిస్టియన్ ప్రార్థనా మందిరాన్ని పాస్టర్ కిరణ్‌కుమార్ నిర్వహిస్తున్నారు. మరోవైపు ట్రస్టును నెలకొల్పి దాని ఆధ్వర్యంలో అనాథాశ్రమం నిర్వహిస్తున్నారు. పేరుకు అనాథాశ్రమమే అయినా.. ఇక్కడ ఉన్న పిల్లందరికీ తల్లిదండ్రులున్నారు. ప్రస్తుతం ఆ ఆశ్రమంలో 91 మంది ఉన్నారు. ఈ నెల 17వ తేదీన పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించారు. వారు వెళ్లిపోయిన తర్వాత పాస్టర్ కిరణ్‌కుమార్ ఓ ఫంక్షన్‌లో మిగిలిపోయిన బిర్యానీ, కూరలు తెచ్చి రాత్రి ఆశ్రమంలో విద్యార్థులకు పెట్టారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి విద్యార్థులకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. అయితే బాధిత విద్యార్థులను ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా ఫోన్ ద్వారా వారి తల్లిదండ్రులకు కిరణ్ సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను తీసుకువెళ్లారు. అలా ఇంటికి వెళ్లిన వారిలో చింతపల్లి మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేల్లి జాషువా (7), జామ్మి చెట్టు గ్రామానికి చెందిన కొర్రా సాధ(7), కొయ్యూరు మండలం రేవళ్లపాలెం గ్రామానికి చెందిన గెమ్మెల భవానీ అలియాస్ నిత్య (8) మృతిచెందారు. మరో 42 మంది అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు, రాజేంద్రపాలెం, నర్సీపట్నం, విశాఖ కేజీహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు. అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రులలో చేరిన విద్యార్థుల పరిస్థితి కొంత నిలకడగానే ఉన్నా.. విశాఖ కేజీహెచ్‌లో చేరిన 14 మంది చిన్నారుల్లో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా : చంద్రబాబు

విశాఖపట్నంలోని ఓ అనాథాశ్రమంలో విషతుల్యమైన భోజనం తిని నలుగురు పేద పిల్లలు చనిపోవడం తీవ్ర వేదన కలిగించిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మరణించిన చిన్నారుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఆయన ప్రకటించారు.

విజిట్ వీసాపై సౌదీ వెళ్లి మృత్యువాత

- గల్ఫ్‌లోనే ఇందూరు కూలీ మృతదేహం
- ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి చొరవతో స్వదేశానికి..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి 30 రోజుల విజిట్ వీసాపై సౌదీ అరేబియాకు వచ్చిన తెలంగాణ వాసి నాలుగున్నరేళ్లు ఇక్కడే ఉన్నాడు. అనారోగ్య కారణాలతో మరణించిన అతడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చొరవ చూపడంతో ఆ మృతదేహాన్ని తెలంగాణకు పంపించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఉప్పు రవి నాలుగేళ్ల క్రితం 30 రోజుల విజిట్ వీసాపై సౌదీ అరేబియాకు వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ ఇక్కడే ఉన్న అతడు అనారోగ్యంతో పదిహేను రోజుల క్రితం చనిపోయాడు. అతడితో పాటు గదిలో ఉన్నవారందరి వీసా గడువు ముగిసి ఉండటంతో పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడానికి భయపడ్డారు. దీంతో కేసు విచారణలో జాప్యం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు విషయాన్ని ఆర్మూర్ శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సౌదీలోని తన మిత్రులతో పాటు భారతీయ ఎంబసీ అధికారులతో మాట్లాడారు. అనంతరం మృతదేహాన్ని పంపించడానికి అవసరమైన నిధులను కూడ ఎంబసీ ద్వారా కేటాయించేలా సంప్రదింపులు జరిపారు. దీంతో రవి మృతదేహాన్ని బుధవారం స్వదేశానికి పంపించేందుకు వీలుగా ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి.

హైడ్రాను ఆపేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

మధ్య నిర్మించుకున్న భవనాలు ఎక్కడ నేలమట్టమవుతాయో అన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. దీంతో.. హైడ్రా పంజా తమ నిర్మాణాల దాకా రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మంత్రులు, ఉన్నతాధికారుల ద్వారా మంత్రాంగం మొదలెట్టారు. అయితే.. హైడ్రా వర్గాలు మాత్రం.. 'ఒత్తిళ్లకు తలొగ్గం.. ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చకుండా వదలం' అని తేల్చిచెబుతున్నాయి. వరుస కూల్చివేతల నేపథ్యంలో రెండు రోజులు బ్రేక్ ఇచ్చామని.. త్వరలో మళ్లీ ఆపరేషన్ డిమాలిషన్ మొదలవుతుందని ఓ అధికారి చెప్పారు. మరోవైపు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సమావేశమయ్యారు. గండిపేటలో కూల్చిన భవనాలు, ప్రహరీ గోడల వివరాలను రంగనాథ్ ప్రభుత్వానికి సమర్పించారని తెలిసింది. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో గుర్తించిన నిర్మాణాల సమాచారమూ అందించినట్టు తెలుస్తోంది.

ఆపరేషన్‌ను అడ్డుకునేలా...

హిమాయత్ సాగర్‌లో గుర్తించిన అక్రమ నిర్మాణాల్లో.. గత, ప్రస్తుత ప్రభుత్వంలోని పలువురితోపాటు.. ప్రముఖ వ్యాపార సంస్థల యజమానులు, సినీ ప్రముఖులకు చెందిన ఫామ్‌హౌస్‌లు, భవనాలున్నాయి. ఉదాహరణకు.. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఓ ఎమ్మెల్సీ ఫామ్‌హౌస్ ఉంది. 20యేళ్ల క్రితం దాన్ని నిర్మించారని చెబుతున్నారు. అలాగే.. అజీజ్‌నగర్‌లో మాజీ మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల నిర్మాణాలున్నాయి. పదవీ విరమణ చేసిన, ప్రస్తుతం విధుల్లో ఉన్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులూ ఇక్కడ ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. నాగిరెడ్డిగూడ వైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న వాటిని ఇప్పటికే గుర్తించిన హైడ్రా.. కూల్చివేతకు రంగం సిద్ధం చేస్తోంది. కూల్చివేతల నేపథ్యంలో ఇప్పుడు వారంతా అప్రమత్తమయ్యారు. మంత్రులు, పరిచయస్తుల ద్వారా ప్రభుత్వ పెద్దలను సంప్రదించి.. కూల్చివేతలను ఆపేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. అయితే, స్వతంత్ర ప్రతిపత్తితో ఏర్పాటుచేసిన హైడ్రాకు పూర్తి స్వేచ్ఛనిచ్చిన సర్కారు.. కూల్చివేతల విషయంలో జోక్యం చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని, వాటి గురించి తమ వద్ద ప్రస్తావించొద్దని సుతిమెత్తగా చెబుతున్నట్టు సమాచారం. నిజానికి, గండిపేటలోనే కూల్చివేతలను ఆపేందుకు పలువురు ప్రముఖులు.. మంత్రులు, ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినా వారి యత్నాలు ఫలించలేదు. హైడ్రా అధికారులకూ పదుల సంఖ్యలో ఫోన్లు వచ్చినా.. వాళ్లు మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేసినట్టు సమాచారం. అలాగే.. ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో హెచ్ఎండీఏ అనుమతితో నిర్మించిన మూడు స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తుల భవనాలను ఇటీవల నేలమట్టం చేశారు. కూల్చివేతలు ఆపాలని ఓ మంత్రిని ఆశ్రయించినా ఆయన చేతులెత్తేసినట్టు తెలిసింది.

ఆక్రమణలతో...

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ (జంట జలాశయాలు) ఒకప్పుడు భాగ్యనగరానికి ప్రధాన తాగునీటి వనరులు. 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఉస్మాన్‌సాగర్ 24 చదరపు కి.మీలు, 2.9 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన హిమాయత్‌సాగర్ సుమారు 20 చదరపు కి.మీల విస్తీర్ణంలో ఉంది. కాలగమనంలో ఈ జలాశయాల 15 నుంచి 20 శాతం వరకు విస్తీర్ణం కుచించుకుపోయింది. ఈ రెండింటి పరీవాహక ప్రాంతంలో 11,887 అక్రమ నిర్మాణాలున్నట్టు వాటర్ బోర్డు గుర్తించింది. ఆ ప్రాంతంలో జీవో-111 నిబంధనలు ఉల్లంఘిస్తు అక్రమంగా వెలిసిన నిర్మాణాలు వరద ప్రవాహానికి ప్రతిబంధకంగా మారాయి. నీటి రాక తగ్గడంతో అక్రమార్కులు మట్టితో నింపి చదును చేసి భూముల విక్రయం మొదలుపెట్టారు. మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బడా వ్యాపారులు, సినీ ప్రముఖులు ఆ స్థలాలు కొన్నారు. జీవో-111 అమలులో ఉన్నప్పుడు అక్కడ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అవకాశం లేకపోవడంతో ప్రకృతి ఒడిలో గడపొచ్చనే ఉద్దేశంతో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. వాటిలో కొన్ని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయి. వాటిపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారులు.. అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న పలు నిర్మాణాలను గుర్తించారు. గండిపేటలో ఆదివారం 20కిపైగా భవనాలు, పలు ప్రహరీగోడలను కూల్చివేశారు. మీర్జాగూడ, జన్వాడ ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని మరిన్ని నిర్మాణాలపైనా చర్యలుంటాయని, త్వరలో హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాల కూల్చివేత ఉంటుందని సమాచారం.

వార్తా చిత్రాలు ఎంతో శక్తిమంతమైనవి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



పొంగులేటి నుంచి అవార్డు అందుకుంటున్న ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్లు హరిప్రేమ్, హరీశ్, విజయ్

హైదరాబాద్, బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతతో తీసే ఫొటో పాఠకుల్ని ఆలోచింపజేస్తుందని, వార్తా చిత్రాలకు ప్రజలను ప్రభావితం చేస్తూ భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఉంటుందని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభయ హస్తం హామీలపై నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఎంపికైన ఫొటోగ్రాఫర్లకు మంత్రి మొమెంటో, నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పౌరసంబంధాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

ఆయా కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు అవార్డులు సొంతం చేసుకున్నారు. వీరగోని హరీశ్ (వరంగల్)కు చేయూత కేటగిరీలో మొదటి బహుమతి, బెస్ట్ న్యూస్ పిక్చర్ కేటగిరీలో కన్సొలేషన్ అవార్డు లభించింది. ముచ్చెర్ల విజయ్(నల్లగొండ)కు మహాలక్ష్మీ, రైతుభరోసా కేటగిరీల్లో, హరిప్రేమ్ (హైదరాబాద్)కు చేయూత కేటగిరీలో కన్సొలేషన్ అవార్డులు దక్కాయి. తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్(టీఎస్‌పీజేఏ) ఏర్పాటు చేసిన బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డు కేటగిరీలో జ్వాలా కోటేశ్వరరావు(హైదరాబాద్), ముచ్చెర్ల విజయ్(నల్లగొండ) కన్సొలేషన్ బహుమతి గెలుచుకున్నారు. అశోకుడు యాదవ్(హైదరాబాద్)కు టీఎస్‌పీజేఏతోపాటు ఏపీపీజేఏ, ఏయూవర్సిటీలో ఏర్పాటుచేసిన న్యూస్ పిక్చర్ అవార్డు కేటగిరీల్లో బహుమతులు లభించాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వైవిధ్యంలోనూ, ప్రజాస్వామ్యంలోనూ భారతదేశం చాలాదేశాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నదని, మాల్దీవులు సైతం ఎంతో స్ఫూర్తిపొందుతున్నదని ఆ దేశ విదేశాంగమంత్రి చేసిన వ్యాఖ్య, ఇరుదేశాల సంబంధాల్లో వస్తున్న మార్పుకు నిదర్శనం. భారతదేశంతో సాన్నిహిత్యాన్ని, సత్సంబంధాలను తమ అధ్యక్షుడు బలంగా కోరుకుంటున్నారని ఆయన స్పష్టంచేశాడు. ఇదంతా ఇటీవల మన విదేశాంగమంత్రి ఆ దేశంలో పర్యటించివచ్చిన ప్రభావం. బంగ్లాదేశ్‌లో మనకు జరిగిన నష్టం మాల్దీవుల్లో భర్తీ అయిందని కొందరి విశ్లేషణ.

షేక్ హసీనా కంటే, ఆమె పార్టీకంటే తామే భారతదేశంతో అధికంగా సత్సంబంధాలు కోరుకుంటున్నామని బీఎన్పీ నాయకుడు ఒకరు ఈ మధ్యన వ్యాఖ్యానించారు. అక్కడ ఎన్నికలు జరిగి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వ్యాఖ్యల్లో నిజాయితీ ఎంతో తెలుస్తుంది. కానీ, ముజిబూర్ రహ్మాన్ కుమార్తె అధికారంలో ఉన్నంత కాలం భారతదేశం సరిహద్దుల వరకూ ప్రశాంతంగా ఉన్నమాట నిజం. దానికి ముందు బీఎన్పీ-జమాత్ కూటమి అధికారంలో ఉండగా ఉగ్రవాదుల చొరబాట్లు, దాడులు, అక్రమరవాణాలు, ఈశాన్యంలో తిరుగుబాటుదారులకు సహకారం ఇత్యాది బాధలు అనేకం భారత్ అనుభవించింది. ఇప్పుడు హసీనా నిష్క్రమణతో, చుట్టుపక్కల దేశాలన్నీ వరుసపెట్టి మనకు దూరమవుతున్నాయన్న ఆందోళన అధికమవుతున్న తరుణంలో మాల్దీవుల నుంచి ఈ సానుకూల వైఖరి మనలను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది.

మాల్దీవుల అధ్యక్షపదవికి మహ్మద్ మొయిజ్జు పోటీపడిందే భారతవ్యతిరేక ప్రచారంతో. ఇతరత్రా కారణాలతో కూడా అక్కడి ప్రజలు ఆయనకు ఓటువేసి వుండవచ్చును కానీ, ఎన్నికల ప్రచారంలో చెప్పినదానికి అనుగుణంగా భారత దేశ సైనికులను తనదేశంనుంచి పంపించివేయడానికి ఆయన గట్టిగా పట్టుబట్టాడు. మొదట్లో కాస్తంత బెట్టుచేసినా, భారతదేశం కూడా అందుకు అంగీకరించింది. మాల్దీవులకు బహూకరించిన హెలికాప్టర్లు, రక్షణ సామగ్రి నిర్వహణ, శిక్షణ నిమిత్తం భారత సైనికులు అక్కడ ఉన్నారన్నది మన వాదన. ప్రకృతి విపత్తుల్లో కూడా మన సైనికులు ఆ దేశానికి సహకరిస్తున్నారు. కానీ, తన దేశంలో మన సైనికుల ఉనికిని మొయిజ్జు అంగీకరించలేదు. చివరకు ఆ తొంభై మంది 'సైనికుల' స్థానంలోకి మన 'సాంకేతికనిపుణులు' వెళ్ళడంతో సమస్య పరిష్కారమైపోయింది. ఈ సైనికుల ఉపసంహరణతో పాటు, లక్షద్వీప్ వ్యవహారం కూడా రెండు దేశాల మధ్యా అగాధాన్ని పెంచింది. ప్రధాని మోదీ లక్షద్వీప్ వెళ్ళి, పర్యాటక స్థలంగా అది అద్భుతమైనదంటూ కొన్ని చిత్రాలను ప్రచారంలోకి పెట్టడం, బీజేపీ అభిమానులు, నాయకులు కొందరు దానిని అందిపుచ్చుకొని మాల్దీవులను పర్యాటకంలో దెబ్బతీయాలంటూ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇందుకు ప్రతిగా ఆ దేశంనుంచి హద్దులు దాటి మాట్లాడిన కొందరు మంత్రులను మొయిజ్జు వెంటనే తొలగించారు. ఆయనను అభిశంసించడానికి అక్కడి విపక్షాలు చేసిన ప్రయత్నాలు సైతం ఫలించలేదు.

ఇంతటి తీవ్ర పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు బంధాలు తిరిగి అతుక్కోవడం కచ్చితంగా సంతోషించాల్సిన విషయమే. జయశంకర్ తన పర్యటనలో మాల్దీవుల్లో భారతదేశం ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రాజెక్టుల స్థితిగతులను సమీక్షించారు, 28దీవులకు మంచినీరు సరఫరా చేసే మరో వెయ్యికోట్ల రూపాయల ప్రాజెక్టులను ఆరంభించారు. ఇందుకు మొయిజ్జు కృతజ్ఞతలు తెలియచేశారు, రెండుదేశాల మధ్యా సహకారం హెచ్చుతోందన్నారు. ఇటీవల తనదేశ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంలోనూ ఆయన భారతదేశం మాల్దీవులను రుణాల చెల్లింపుల భారంనుంచి కాపాడిందనీ, మాల్దీవుల ఆర్థికస్వావలంబనను పరిరక్షించిందనీ ప్రశంసలు కురిపించారు. భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటానని కూడా ప్రకటించారు. మాల్దీవులకు ప్రకటించిన రుణాలు, ప్రాజెక్టులు ఇత్యాది అంశాల్లో భారతదేశం ఏ మాత్రం తన వైఖరిని మార్చుకోకుండా నిజానికి మరిన్ని అధిక కేటాయింపులతో గత కొద్దినెలలుగా వ్యవహరిస్తూ వచ్చింది. మొయిజ్జు వైఖరితో నిమిత్తం లేకుండా అక్కడి ప్రజల మనసులు గెలుచుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. భారతదేశాన్ని దూరం చేసుకుంటే తమ పర్యాటకరంగం తీవ్రంగా నష్టపోతుందని ఆ దేశానికి తెలిసి వచ్చింది. తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్న మాల్దీవులకు ప్రకృతి విపత్తులతో పాటు అన్ని ఆపదల్లోనూ భారత్‌మీదే ఆధారపడాలని తెలియనిదేమీ కాదు.

మళ్లీ సఖ్యత!

వివాహవైభోగం... పేదవాడితో పరిహాసం!

ముంబైలో అత్యంత సంపన్నుల ఇంట వేలాదికోట్ల ఖర్చుతో ఇటీవల జరిగిన వివాహ వేడుకలు అందరినీ అబ్బురపరిచాయి. రాజభోగాన్ని మించిన అట్టహాసాన్ని ప్రదర్శించిన వివాహమది. పత్రికలు ఈ ధనవైభోగాన్ని చిత్రిస్తూ వార్తలను గుప్పించాయి. కొందరు ఈ వివాహ విలాసాన్ని విమర్శించారు. కొన్ని పత్రికలు దానిని వికృతమైన వేడుక (Grotesque) అని వ్యాఖ్యానించాయి. ఒక విధంగా ఈ ప్రదర్శన దేశంలోని పేదవాడిని పరిహసించింది.

ఆ సందర్భంగా ప్రఖ్యాత ఉర్దూ కవి సాహిర్ లుధియాన్వి 'తాజ్‌మహల్' గురించి వ్యాఖ్యానించిన పంక్తులు గుర్తుకొచ్చాయి. "ఏక్ షెహన్షానే అపనే బేగంకె లియే తాజ్‌మల్ బనాకర్ గరీబోంకా మజాక్ ఉడాయా" (ఒక మహారాజు తన భార్యకై తాజ్‌మహల్ నిర్మించి పేదవాళ్లను పరిహసించాడు.)

సాధారణంగా ఈ దేశంలో ఎవరైనా అప్పోసొప్పో చేసి తమ పిల్లల వివాహాలను వేడుకగానే చేయాలనుకుంటారు. సంపన్నుల గురించి చెప్పనక్కరలేదు. నయా సంపన్నులు (న్యూ రిచ్) మరీ ఎగబడి 'వల్గర్‌'గానే ఇలాంటి వివాహ తతంగాల్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఢిల్లీలో ఇలాంటి అత్యంత ఆడంబరంగా జరిగిన కొన్ని వివాహాలను చూసిన తర్వాత ఆనాటి అమెరికన్ రాయబారి చెస్టర్ బేల్స్ బాహాటంగానే ఇలా వ్యాఖ్యానించాడు. "ఇండియాలోని వివాహాల ఆడంబరాలను, దుబారా ఖర్చులను గమనిస్తే ఆశ్చర్యమేస్తున్నది. మా



అమెరికాలోని కోటీశ్వరులు కూడా ఇంత ఆడంబరంగా, విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ పెళ్లిళ్లు చేయరు."

ఈ దేశంలోని మతాలు-కులాల పరంగా జరిగే వివాహ వేడుకల్లో ధనికులు సహజంగానే ఆడంబరంగా, సామాజికంగా తమ ఔన్నత్యాన్ని చాటుకుంటారు. ఈ ఆనవాయితీ క్రమంగా మధ్యతరగతి కుటుంబాలకి కూడా పాకిపోయింది. పెళ్లి అనేది జీవితంలో ఒకసారి చేసుకుంటాం కాబట్టి వీలైనంత ఖర్చుపెట్టి ఆనందిస్తున్నామని సమర్థించుకుంటారు. కొన్ని కుటుంబాల వాళ్లు అప్పులపాలై నానా ఇబ్బందీ పడుతుంటారు.

సామాజికంగా జరిగే వివాహాలన్నీ ఎలాంటి తంతు లేకుండా, నిరాడంబరంగా జరుపుకోవాలనే ఒకనాటి ఆదర్శం కనుమరుగైపోయింది. చివరికి గ్రామీణ స్థాయిలో కూడా అన్ని కులాలవాళ్లు ఆడంబరంగా వివాహాలు చేస్తున్నారు. మన సామాజిక వ్యవస్థలు క్రమంగా వినియోగదారుల అలవాట్లకు లోనై ఇలాంటి ఆడంబరాలను ప్రోత్సహిస్తున్నాయి. బాగా డబ్బున్నవాడే గొప్పవాడు అనే మానసికతను పెంచి పోషిస్తున్నాయి. మరీ ముఖ్యంగా హిందూ సమాజంలో కుల ఆచారాలు-పరంపర పేరిట జనన-మరణాలు, నామకరణాలు -నిశ్చితార్థాలు-వివాహాల కార్యక్రమాలకు విపరీతంగా ఖర్చు పెడుతున్నారు.

ప్రస్తుతం మధ్యతరగతి యువతీ యువకుల్లో కొంత సంపాదన పెరిగి ఆడంబరాలకు ఎగబడుతున్నారు. వివాహానికి ముందు మెహందీ, సంగీత్ వేడుకలతో పాటు ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అనే క్రేజ్ విస్తరించింది. ఒకరిని చూసి ఒకరు ఈ క్రేజ్‌తో ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకుంటూ లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

'వాడుకో-పారెయ్' అనే వస్తు వినిమయ సంస్కృతికి లోనవుతున్న మన భారతీయ సమాజం, ఈ రోజు ధనిక పెట్టుబడిదారుల అడుపాజ్ఞలలో ఊపిరి పీలుస్తున్నది. పౌరాణిక గాథలు, మతప్రవచనాలు వ్యక్తి స్వార్థాన్ని పెంచుతున్నాయే తప్ప మానవీయ సంబంధాలను పెంచడం లేదు. సాంప్రదాయాలు, తరతరాల మూఢాచారాలను అతి తెలివిగా శబ్దాడంబరంతో సమర్థిస్తున్న ప్రవచనకర్తలను పాదాభివందనాలు చేస్తూ గౌరవిస్తున్నారు.

సామాజికంగా ధనస్వామ్యపు వికృత సంస్కృతిని, భూస్వామ్య ఫ్యూడల్ మానసికతను తిరస్కరిస్తే తప్ప మనమంతా ఆశించే కులరహిత-సెక్యులర్ మానవీయ వ్యవస్థ నిర్మాణం కాదు. అలా కాని పక్షంలో నైరాశ్యం మనలను ఇలా ప్రశ్నించవచ్చు. "లోకపు అంగడిలో ఏ విలువా లేని విప్రలంభ గీతం నుంచి నీ పేరు చెరిగిపోయిందా ఇక నీ పాదరేణువు నువ్వే, పురుగు నుంచి కూడా పరారయ్యే పరీక్షిత్తు నువ్వే, సుసంపన్న విపణివీథిలో దివాళాకోరు నువ్వే" (కె. శ్రీనివాస్- 'మరొక్కమారు' కాలమ్ నుంచి).

– నిఖిలేశ్వర్

నాకిది.. నీకది మన రక్తంలోనే ఉందా?

రాజకీయ నాయకత్వం, వ్యాపారవర్గం, ఉద్యోగస్వామ్యం (బ్యురాక్రసి), ఆశ్రిత పక్షపాతం... వీటి లోతుల్లోకి వెళ్లకుండా మన ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవటం కష్టం. ఆశ్రిత పక్షపాతం ఒక్కో దేశంలో ఒక్కో మోతాదులో ఉండొచ్చు. అసలెక్కడా లేకపోవటం అనేది చాలా అరుదు. మన దేశంలో దాని మోతాదు మించిపోయి ఎన్నో విపరిణామాలకు దారితీస్తోంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మాధవి బుచ్‌పై ప్రముఖ పెట్టుబడుల వ్యవహారాల పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ఇటీవల చేసిన ఆరోపణలతో వ్యాపార రంగం, ప్రభుత్వాల మధ్య నెలకొన్న ఆశ్రిత పక్షపాత ధోరణులపై మళ్లీ చర్చ మొదలైంది. వీటి వల్ల కొందరు వ్యాపారవేత్తలకు అనుచిత లాభాలు కలగటం నిజం. ఇందుకోసం పెద్దగా శోధించాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగాల్లో పక్షపాతాన్ని చూడటం సగటు భారతీయుడికి నిత్యానుభవమే. కులం, మతం, ప్రాంతం, బంధుత్వాల ఆధారంగా పక్షపాత ప్రదర్శనను గమనించని వ్యక్తిని కనిపెట్టటం మన సమాజంలో కష్టసాధ్యమైన పనిగా భావించొచ్చు! వ్యక్తి గుణగణాల కంటే కుల, మత, ప్రాంత, వర్గ అభిమానాలకు ప్రాధాన్యం ఇవ్వటమనేది అనేక కారణాల వల్ల మనలో పాతుకుపోయింది. అవునన్నా కాదన్నా మనం గొప్పగా భావించే హిందూ సామాజిక వ్యవస్థలోనే దీనికి పునాదులు ఉన్నాయి. కులాల ఒడిలో పెరిగి, బలపడి, చైతన్యాన్ని పొందిన సగటు మనిషి ఆలోచన నిరంతరం 'మనవాళ్లను' గుర్తించటం వైపు మొగ్గుతూనే ఉంటుంది. ఆ 'మనవాళ్ల'తో తాదాత్మ్యం కోసం తహతహలాడుతూనే ఉంటుంది. చిన్నాచితకా ప్రయోజనాల కోసం ప్రదర్శితమయ్యే ఈ తరహా కుల, తెగ పక్షపాతప్రీతితో జరిగే నష్టాలకు ఒక పరిమితి ఉంటుంది. కానీ సమాజ వనరులు, ప్రభుత్వాలపై ఆధిపత్యం చలాయించే వర్గాలు ప్రదర్శించే పక్షపాతంతో కలిగే విపరిణామాలు అసాధారణంగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థనూ, సంపద పంపిణీని ఎన్నో విధాలుగా అవి ప్రభావితం చేస్తాయి. అందుకే వ్యాపార, రాజకీయ, ఉన్నత ఉద్యోగ వర్గాల మధ్య జరిగే నాకిది.. నీకది (క్విడ్‌ప్రోక్వో) వ్యవహారాల గురించి చాలా విశ్లేషణలు వస్తున్నాయి. దానికి తోడు ఆర్థిక విధానాల రూపకల్పనలో పెరిగిపోతున్న వ్యాపార వర్గాల పాత్రపై లోతైన పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే రాజకీయాల్లో వేగంగా పెరుగుతున్న ఆ వర్గాల ప్రమేయం పైనా చాలా అధ్యయనాలూ సాగుతున్నాయి. టరంటొ విశ్వవిద్యాలయం, క్లైమాంట్ మకెన కళాశాలలో రాజకీయాలను బోధించే కాంత మురళి, అసీమా సిన్హాలు ఈ రెండు అంశాలపై ఇటీవల చాలా విషయాలను వెలుగులోకి తెచ్చారు.

ప్రభుత్వం-వ్యాపార వర్గం మధ్య నెలకొన్న అనుచిత సంబంధాలను అర్థం చేసుకోటానికి మనం 1950ల నుంచి పరిశీలన మొదలుపెట్టాలి. 1980ల వరకూ పరిశ్రమ-వ్యాపారానికి సంబంధించి ప్రభుత్వ జోక్యం విపరీతంగా ఉండేది. ప్రైవేటు రంగంపై లెక్కలేనన్ని నియంత్రణలు కొనసాగేవి. నచ్చిన రంగంలో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఉండేది కాదు. ఒక వేళ అనుమతి ఇచ్చినా ఎంత ఉత్పత్తి చేయాలో ప్రభుత్వమే నిర్దేశించేది. డిమాండును బట్టి ఉత్పత్తి పెంచుకునే వెసులుబాటు లేదు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకునే అవకాశమూ దొరికేది కాదు. అన్నిటికి ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సిందే. దీన్నే లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్‌గా ఈసడించుకునేవారు. కావాల్సిన యంత్రాలనూ, వస్తువులనూ స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలనే ఆలోచనలతో ఆ తరహా ఆర్థిక విధానాలకు రూపకల్పన చేశారు. వలసపాలన కింద నలిగిపోయిన అనుభవంతో సొంతకాళ్లపై నిలబడాలన్న అప్పటి సంకల్పాన్ని తప్పుపట్టలేం. సంకల్పం ఎలా ఉన్నా ఫలితాలు మాత్రం అనుకున్న విధంగా రాలేదు. అనేక పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వానికే పెద్దపీట వేశారు. కొన్ని రంగాల్లో ప్రైవేటు రంగానికి కనీస ప్రవేశం కూడా ఇవ్వలేదు. విదేశాల సాయంతో కొన్ని పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటుచేసినా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉండేది కాదు.



పోటీతో కూడిన వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాలను పారదర్శకంగా ప్రభావితం చేయటం ఒక పద్ధతి. దీనికి భిన్నంగా రాజకీయ పార్టీలకు గోప్యంగా భారీగా నిధులు సమకూర్చటం, వ్యాపారవర్గానికి చెందిన వారే నేరుగా చట్టసభల్లోకి అడుగుపెట్టటం ఎన్నో వైపరీత్యాలకు దారితీస్తోంది. 17వ లోక్‌సభ (2019-2024)లో 154 మంది వ్యాపార నేపథ్యం నుంచే వచ్చారు. అంటే 28.4 శాతం మంది అన్నమాట! 1991-96 నాటి పరిస్థితితో (14.2శాతం) పోల్చితే ప్రాతినిధ్యం 100 శాతం పెరిగింది. ఈ ప్రాతినిధ్యం ఇలా పెరుగుతూ పోతే రూపంలో మాత్రమే ప్రజాస్వామ్యం మిగిలి సారంలో ధనస్వామ్యం అధికారం చలాయిస్తుంది! దాని ఛాయలు ఇప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి!

ప్రైవేటు రంగం చొరవను కట్టడి చేయటం వల్లే 1950-80ల మధ్య ఆర్థికప్రగతి అంతంత మాత్రంగా ఉందని చెప్పటానికి బోలెడు అధ్యయనాలు ఉన్నాయి. ఆగ్నేయాసియా దేశాలతో పోల్చితే భారత్ మందగమనానికి దీన్నే ప్రధాన కారణంగా చెప్పేవారు. ఆ కాలంలో మన ఆర్థిక వృద్ధి సగటున మూడు శాతానికి అటు ఇటుగా ఉండేది. ఇక్కడో విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. అదుపులేని లాభాపేక్ష చరిత్రలో చాలా అనర్థాలకు కారణమైంది. అయితే అది నాణేనికి ఒకవైపు చిత్రమే. లాభాలను గరిష్ఠంగా పొందే లక్ష్యంలో భాగంగా ఎన్నో కొత్త ఆవిష్కరణలూ జరిగాయి. కొత్త సాంకేతికతలూ అందుబాటులోకి వచ్చాయి. కాలక్రమేణా జనజీవితాన్నీ మెరుగుపరచాయి. నాణేనికది రెండో చిత్రం! జనహిత దృష్టితో కొన్ని సాంకేతిక ఆవిష్కరణలూ వచ్చాయి. కానీ వాటి సంఖ్య పరిమితం. సోషలిస్టు విప్లవాలకు నెలవైన రష్యా, చైనాల్లో ఒక దశ దాటిన తర్వాత అవి కనీస స్థాయికి పడిపోయాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాశ్చాత్య దేశాల పరుగును రష్యా, చైనాలు అందుకోలేకపోయాయి. ప్రయోగశీలతకు ప్రాణమైన చొరవ, స్వేచ్ఛలు కనుమరుగయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే కొత్త ఆవిష్కరణలకూ సాంకేతిక అభివృద్ధికీ నిత్యం దోహదం చేసే క్యాపిటలిజానికి ప్రత్యామ్నాయం లేదనే వాదనలు 1990ల తర్వాత బాగా ఎక్కువయ్యాయి.

ఇందిరాగాంధీ తొలిసారి ప్రధానిగా ఉన్న కాలంలో (1967-77) ప్రైవేటురంగంపై ఆంక్షలను మరింతగా పెంచారు. బ్యాంకులను జాతీయం చేశారు. వ్యాపార గుత్తాధిపత్యాన్ని నియంత్రిస్తూ చట్టం తెచ్చారు. గరీబీహటావో లాంటి జనాకర్షణ మంత్రాలను పఠించారు. సోషలిజంవైపు మొగ్గుతున్నట్లుగా ప్రవర్తించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మొత్తాన్ని తన చుట్టూ తిప్పుకొని విపరీత కేంద్రీకరణతో అంతా ఢిల్లీవైపు చూసే విధంగా రాజకీయాలను మార్చివేశారు. లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్‌తో ప్రతి కీలక అనుమతికి సూట్‌కేసులతో డబ్బులు పెట్టుకుని ఢిల్లీ చుట్టూ చక్కర్లుకొట్టే సంస్కృతి పెరిగేటట్లు చేశారు. బడా లావాదేవీల విషయంలో అలా ఆనాడు క్విడ్‌ప్రోక్వో దేశంలో బలంగా వేళ్లూనుకుంది. అయినా విధానాలను పూర్తిగా ప్రభావితం చేసే స్థాయికి వ్యాపారవర్గం చేరుకోలేదు. ఉన్న విధానాల పరిధిలోనే క్విడ్‌ప్రోక్వోతో కొన్ని వర్గాలు బాగానే బలపడ్డాయి. బయటి కంపెనీలతో పోటీపడే పరిస్థితి లేదు. రాజకీయ పరపతిగల వ్యాపారులు తాము నిలదొక్కుకున్న రంగంలోకి ఇతరుల నుంచి పోటీ రాకుండా చేసుకోగలిగారు. అంటే క్విడ్‌ప్రోక్వో వల్ల ప్రైవేటు చొరవను కట్టడి చేశారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అడ్డుకట్టను వేయగలిగారు! మరోవైపు పరిమిత పోటీతో లాభాలకూ ఇబ్బంది ఉండేది కాదు.

ఆశించిన స్థాయిలో జరగని అభివృద్ధి, అంతంతమాత్రంగా ప్రభుత్వరంగ సంస్థల తీరు, విపరీతంగా పెరిగిన జనాభా, నిరుద్యోగ సమస్య, అన్ని స్థాయిల్లో విస్తరించిన అవినీతితో 1970ల నాటికి పరిస్థితి విషమించింది. అసంతృప్తులు, ఆందోళనలు చుట్టుముట్టటంతో అధికారాన్ని కాపాడుకోటానికి ఇందిరాగాంధీ



■ రాహుల్ కుమార్

ఎమర్జన్సీని విధించారు. చివరికి 1977 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలయ్యారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన (1980) తర్వాత ప్రైవేటు రంగానికి సడలింపులు ఇవ్వటం మొదలు పెట్టారు. కొంత మెరుగుదల కనిపించినా 1990 నాటికి విదేశీద్రవ్య నిల్వలు అడుగంటాయి. మొదటి గల్ఫ్ యుద్ధం, సోవియట్ రష్యా పతనం, మండల్ కమిషన్ సిఫార్సులు- వాటికి పోటీగా బీజేపీ చేపట్టిన రామాలయ రాజకీయాలు, రాజీవ్‌గాంధీ హత్య తదితర పరిణామాలతో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దీంతో 1991లో పెద్ద ఎత్తున ఆర్థిక సంస్కరణలకు పూనుకొన్నారు. వీటితో పెట్టుబడిదారులకు కావాల్సినంత స్వేచ్ఛ వచ్చింది. లైసెన్స్-పర్మిట్-కోటారాజ్ నాటి ఆంక్షలు తొలగిపోయాయి. విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచుకున్నాయి. వృద్ధిరేటు బాగా పెరిగింది. చాలా సౌకర్యాలు, వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. మరో వంక వ్యాపారవర్గ జోక్యమూ విధానాల్లో ఎక్కువైపోయింది. స్వదేశీ-విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది. అధికార కమిటీల్లో వ్యాపారవర్గానికి చోటు లభించింది. విధానాల వల్ల లబ్ధి పొందే పరిస్థితి నుంచి విధానాల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించే స్థాయికి వ్యాపారవర్గం ఎదగటాన్ని మన ఆర్థిక చరిత్రలో కీలక పరిణామంగా కాంత మురళి వర్ణించారు. ఇదంతా పైకి చాలా ప్రగతిశీలకంగానే కనిపిస్తుంది. క్విడ్‌ప్రోక్వో దగ్గరకు వచ్చేసరికి అసలు సంగతులు బయటపడతాయి. పారదర్శక విధానాలు అమలై అది పూర్తిగా అంతరిస్తే బొగ్గు, స్పెక్ట్రమ్, స్టాక్‌మార్కెట్ కుంభకోణాల ఆరోపణలు తలెత్తేవి కావు. అలాగే భూములు, గనుల కేటాయింపులో, భారీ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఇవ్వటంలో, ప్రభుత్వరంగం బ్యాంకులు పెద్ద ఎత్తున మంజూరు చేసే రుణాల్లో ఆశ్రితపక్షపాతాన్ని చూపిస్తున్నారనే విమర్శలూ వచ్చేవి కావు.

పోటీతో కూడిన వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాలను పారదర్శకంగా ప్రభావితం చేయటం ఒక పద్ధతి. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఉంది. దీనికి భిన్నంగా రాజకీయ పార్టీలకు గోప్యంగా భారీగా నిధులు సమకూర్చటం, వ్యాపారవర్గానికి చెందినవారే నేరుగా చట్టసభల్లోకి అడుగుపెట్టటం ఎన్నో వైపరీత్యాలకు దారితీస్తోంది. ఎన్నికల్లో భారీగా డబ్బును వెదజల్లే పరిస్థితి ఇందులో ప్రధానమైంది. సామాన్యులకు చట్టసభల్లో చోటులేకుండా పోతోంది. వారి కోసం విధానాల రూపకల్పనా క్షీణించిపోతోంది. అభివృద్ధి ఫలాలను అధికులకు చేర్చే విధానాలు వెనుకంజ పడుతున్నాయి.

చట్టసభలకు వ్యాపారవర్గాలు ఎన్నికవ్వటం ఎలా పెరుగుతుందో చెప్పటానికి అసీమా సిన్హా 2019 లోక్‌ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల నేపథ్యాన్ని విశ్లేషించారు. మొత్తం 542 సభ్యుల్లో 154 మంది వ్యాపార నేపథ్యం నుంచే వచ్చారు. అంటే 28.4 శాతం మంది అన్న మాట! 1991-96 నాటి పరిస్థితితో (14.2శాతం) పోల్చితే ప్రాతినిధ్యం 100 శాతం పెరిగింది. ఈ ప్రాతినిధ్యం ఇలా పెరుగుతూ పోతే రూపంలో మాత్రమే ప్రజాస్వామ్యం మిగిలి సారంలో ధనస్వామ్యం అధికారం చలాయిస్తుంది! దాని ఛాయలు ఇప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి! ఆదాయ, సంపద పరమైన అసమానతల్లో భారత్ ప్రపంచ రికార్డును స్థాపించటమే ఇందుకు నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

బీసీ గురుకుల సొసైటీలో అతిథి బోధకులకు అన్యాయం!

రాష్ట్రం ఏర్పడిన తర్వాత బడుగు వర్గాల పేదలకు విద్యను అందించేందుకు ప్రభుత్వం బీసీలకు 327, ఎస్సీలకు 268, ఎస్టీలకు 188, మైనార్టీలకు 205, జనరల్ కేటగిరీకి 35... ఇలా మొత్తం 1022 గురుకులాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నది. వీటి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఉన్నవి. ముఖ్యంగా అతిథి బోధకుల టర్మినేషన్ సమస్య ప్రధానంగా మారింది. రెగ్యులర్ నియామకాలకు మంగళం పాడిన పాలకులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌ను కాదని, కారు చౌక వేతనాలతో విధులను నిర్వహిస్తారన్న ఉద్దేశంతో గంటల ప్రకారంగా అతిథి బోధకులను నియమించారు. వీరు ఐదు వేల మందికి పైగా ఉన్నారు. తమ శ్రమను, శక్తిని కూడగట్టి అహర్నిశలు శ్రమించి గురుకులాల అభివృద్ధికి ఆలంబనగా నిలిచారు. వీరికి 3 నుంచి 10ఏళ్లకు పైగా సీనియారిటీ ఉంది. సీనియారిటీ లేని పేరుతో నిబద్ధత గలవారిని మహాత్మ జ్యోతిబా బీసీ గురుకుల సొసైటీ యాజమాన్యం తొలగిస్తున్నది. ఇందులో గెస్ట్‌ల శ్రమకు తగ్గ జీతాలు పెంచాలని, పన్నెండు నెలల వేతనాలు ఇవ్వాలని, సీనియారిటీలను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌ను పక్కదారి మళ్లించే కుట్ర ఉంది. సొసైటీ సెక్రెటరీ నుంచి వెలువడిన పలురకాల ఉత్తర్వుల ప్రకారం సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని, ఏ పోస్టుకు ఏ స్కూలుకు ఎవరు రెగ్యులర్ బోధకులు వస్తే ఆ సంస్థలో గెస్ట్ ఫ్యాకల్టీ చివరలో ఉన్నారో వారిని జూనియర్‌గా భావించి టర్మినేట్ చేయాలి, కానీ అలా చేయడం లేదు.



పాఠశాల స్థాయికి పీజీ అభ్యర్థులను నియమించుకొని బీఈడీ ఉన్నవారిని తొలగిస్తున్నారు. కొన్ని చోట్ల పాఠశాల బోధకులను కాదని జూనియర్ కళాశాల బోధకులను, వివిధ పోటీ పరీక్షల శిక్షణ కోసం మధ్యలోనే విధులను మానేసి తిరిగి అదే పాఠశాలలో చేరిన వారిని, ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడకు (ఉపాధే ప్రయారిటీగా) వెళ్ళినవారిని, మరో నిరుద్యోగికి ఉపాధి కల్పిస్తున్న క్రమంలో డిప్యూటేషన్ ఇచ్చిన వారిని, వివిధ పోటీ పరీక్షలకు వయసురీత్యా పోటీపడలేని వారిని... ఇలా అనేక రకాలుగా ఉన్నవారిని స్టేషన్‌లో జూనియర్‌గా గుర్తించి టర్మినేట్ చేస్తున్నారు. ఈ విషయమై సీనియర్ గెస్టులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఎంజెపిటిబిసి గురుకుల సొసైటీ సెక్రెటరీ, ఆయా జిల్లాల కలెక్టర్లను సంప్రదించారు. సొసైటీ నిర్వాహకులకు టర్మినేషన్‌లను మొదలుపెట్టినప్పుడు అర్థం కాలేదు గానీ, రోజులు గడిచిన క్రమంలో సీనియార్టీలను ప్రామాణికంగా తీసుకోవాలని వచ్చిన వినతులతో అర్థం అయ్యింది. పైవారు ఇచ్చిన ఉత్తర్వులని రీజినల్ కో-ఆర్డినేటర్ (ఆర్‌సిఓ)లు, ప్రిన్సిపల్‌లు ఖాతరు చెయ్యలేదు. ఈ ప్రిన్సిపల్స్, ఆర్‌సిఓలు ఒకప్పుడు రెగ్యులర్ బోధకులే. రెగ్యులర్ బోధకుల డే, నైట్, స్టడీ అవర్‌లలో డ్యూటీలు చేస్తామన్న కొద్దిమందినీ, పలు సార్లు టర్మినేటైన వారిని బంధు ప్రీతితోనో, తమ కులం లేదా వర్గం అన్న కారణంగానో, లేదా మతం అన్న కారణంగానో గెస్ట్ ఫ్యాకల్టీగా రిక్రూట్‌మెంట్ చేసుకున్నారు.

ఈ అంశంలో ఇలా చాలా అంశాలు ఇమిడి ఉన్నందున గెస్టు ఫ్యాకల్టీల విషయంలో ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో ఏ విధంగా నిర్వహించారో అదేవిధంగా బీసీ గురుకుల సొసైటీలో కూడా శాస్త్రీయ విధానాన్ని ఎంచుకుని నిర్వహించాలి. అంతర్జాతీయ విద్యా వ్యవస్థలలో రిక్రూట్‌మెంట్ 1:18 నిష్పత్తి ప్రకారం జరగాలి. లేదా భారతదేశ విద్య వ్యవస్థలో సంస్కరణలు కావాలని నివేదించిన కొఠారి కమిషన్ ప్రకారం 1:30 లేదా 35 ప్రకారమైనా జరగాలి. వాటికి భిన్నంగా 1:50గా మారిపోయిన పరిస్థితిని ప్రస్తుతం గురుకుల విద్యా సంస్థలలో చూస్తున్నాం. దీని ప్రకారం రెగ్యులర్ నియామకాలతో పాటు గెస్ట్ ఫ్యాకల్టీల అవసరమూ ఏర్పడుతుంది. కావున రెగ్యులర్ నియామకాలతో పాటు వివిధ రకాల గెస్ట్ ఫ్యాకల్టీల ద్వారా, ఇందులో సొసైటీ సీనియారిటీ, సక్రమవిధులు, బోధనలో సామాజిక బాధ్యత, తదితరమైనవి ప్రయారిటీగా వెయిటేజ్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి, మంత్రివర్గం, క్లుప్తంగా ప్రజాప్రతినిధులంతా చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

– కె. రేణుక
ఎంజేపీటీబీసీ గురుకులాల సొసైటీలో గెస్ట్ టీచర్

సులభ వ్యాపార విధానాలకు కార్మికులే సమిధలు!

సులభ వ్యాపార విధాన భావనకు పురుడు పోసి, పెంచి పోషించినది ప్రపంచ బ్యాంక్. మొదటగా 2002లో 'వ్యాపారం చేయడం' నివేదిక ద్వారా ఈ విధానాలకు పునాది వేసింది. వ్యాపార ప్రారంభం, నిర్మాణాల అనుమతులూ, విద్యుత్ లభ్యతా, ఋణ పరపతీ, పన్నులూ తదితర వర్తక విధానాలు సులువుగా, ప్రోత్సాహకంగా ఉన్నాయా లేదా అన్నవి సులభ వ్యాపారానికి ముఖ్యం. వివిధ దేశాలు వాటి సులభ వ్యాపార విధానాలకు రూపమిచ్చాయి. ప్రపంచ బ్యాంకు వాటిని బేరీజు వేసి ఒక సులభ వ్యాపార సూచీలోకి కుదించి ఏటా దేశాల శ్రేణిని ప్రకటిస్తూ వచ్చింది.

మెరుగైన సూచీతో పెట్టుబడులకు అనువుగా ఉండేందుకు భారత్ లాంటి దేశాలు పర్యావరణ, భద్రతా చట్టాలను కూడా సులభ వ్యాపార విధానాల పరిధిలోకి తెచ్చాయి. సులభ వ్యాపార విధానాన్ని అమలు చేస్తున్న తెలుగు రాష్ట్రాలలో తరచూ పారిశ్రామిక ప్రమాదాలు జరిగి, ఏటా వందల ప్రాణాలు పోతున్నాయి. వాటిని అరికట్టడానికి నిజాయితీగా జరుగుతున్న ప్రయత్నాలు శూన్యం. ప్రమాదం జరగగానే హడావుడి. అంతే. తరువాత షరా మామూలే.

సులభ వ్యాపార విధానాలని సమర్థవంతంగా అమలుపరుస్తున్న సింగపూర్, జర్మనీ, స్వీడన్ లలో, ప్రతి లక్షమంది కార్మికులకీ పారిశ్రామిక ప్రమాద మరణాలు సగటున ఒకటి కంటే తక్కువ. అవి రమారమి జపాన్‌లో 2, తెలంగాణలో 6 (ఒక పత్రికలో వార్త ఆధారంగా కట్టిన లెక్క). నిజానికి తెలంగాణలో మరణాలు కొన్ని రెట్లు ఉండే అవకాశం వుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రపంచ దేశాల పనిలో ప్రమాద గణాంకాలు సేకరించి నివేదికలు విడుదల చేస్తుంది. ఆ నివేదికలలో భారత గణాంకాలు లేవు. భారత్ పనిలో భద్రత విషయంలో 52 అంతర్జాతీయ ఒడంబడికలపై సంతకం చేయలేదు.

పైగా బలహీనమైన, అసమగ్రమైన పర్యావరణ చట్టాలను ఇంకా బలహీనపరచి దానిని సులభ వ్యాపారానికి ప్రోత్సాహకంగా భావిస్తున్నారు. కోవిడ్ కాలంలో రెడ్ కాటగిరీ మందుల పరిశ్రమలనూ, తరువాత ఇథనాల్ ఇంధన పరిశ్రమలనూ పర్యావరణంపై స్వల్ప ప్రభావం చూపే పరిశ్రమల కేటగిరీలోకి మార్చారు. వాటికి పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక సమర్పించి ప్రజాభిప్రాయ సేకరణ చేయవలసిన నిబంధనను తొలగించారు. తెలుగు రాష్ట్రాలలో మార్చిన నిబంధన పరిధిలో వందల సంఖ్యలో మందుల పరిశ్రమలకు అనుమతులిచ్చారు. కంపెనీలు నిర్మాణం చేపట్టినపుడు ప్రజలు తిరగబడ్డారు. గట్టుప్పల్‌లో ప్రజలు ఉద్యమించి వ్యతిరేకించిన కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ జరపలేకపోయింది. అదే పరిశ్రమ నూతన విధానంలో అనుమతి తెచ్చుకుని నిర్మాణం చేయడానికి ఉపక్రమించగానే ప్రజలు మళ్ళీ తిరగబడ్డారు. అలాగే మునుగోడు, తురకల ఖానాపూర్, ఇంకా ఎన్నో గ్రామాలలోనూ అడ్డ తోవలో ఇచ్చిన అనుమతులను ప్రజలు తిరస్కరించారు. ఇథనాల్ పరిశ్రమలకు నీటి వనరులు భారీగా కావాలి. నిజంగా ఎంత నీరు వాడుతున్నారన్న అధ్యయనం లేదు. ఆంధ్రాలోని ఒక ఇథనాల్ కంపెనీ నీటి వనరులు చాలక విస్తరణను తెలంగాణకు మార్చుకుంది. తెలంగాణలో ఒక కంపెనీ అనుమతి కంటే దాదాపు మూడు రెట్లు నీరు వాడినట్లు ప్రజల ఫిర్యాదులతో బయటపడింది.

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సింగపూర్‌ని ఆదర్శంగా ప్రకటిస్తుంటాయి. కాని అక్కడి పాలనా ప్రమాణాలను పట్టించుకోవు. అక్కడ పనిలో భద్రత పాటించని బాధ్యులైన వారికి జైలు శిక్షలు వేస్తారు. ఒక రవాణా కంపెనీ డైరెక్టర్ శిక్షణ లేకుండా ఎక్స్‌కవేటర్ వాడి ఒక కార్మికుడి మరణానికి కారణమైనందున అతనికి 5 నెలల 2 వారాల జైలు శిక్ష వేశారు. నవంబర్ 2014లో, హ్యూస్టన్ నగర పరిసరాల్లోని లాపోర్ట్‌లో మిథైల్ మెర్కాప్టాన్ అనే అత్యంత విషపూరితమైన, మండే వాయువును సుమారు 24,000 పౌండ్లు గాలిలోకి విడుదల చేసింది డ్యూపాంట్ సంస్థ. అది నలుగురు కార్మికులను చంపడంతో పాటు, ఇతర డ్యూపాంట్ ఉద్యోగులనూ గాయపరిచింది. ఇంకా చుట్టుపక్కల ప్రాంతాలకూ విస్తరించడంతో మరికొంతమంది ప్రజలు గాయపడ్డారు. డ్యూపాంట్ నేరాన్ని అంగీకరించడంతో మొత్తంగా కోటీ, 90 లక్షల డాలర్ల జరిమానా విధించి దానిలోని 40 లక్షల డాలర్లతో ఆ ప్రాంతాన్ని జరిగిన పర్యావరణ హాని నుండి పునరుద్ధరించాలని కోర్టు ఆదేశించింది. ఆస్ట్రేలియాలో 2023లో పనిలో భద్రతా ఆరోగ్యం చట్టాన్ని కార్మికుల మరణాలను హత్యా నేరంగా పరిగణించి 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష, కోటీ 80 లక్షల డాలర్ల వరకూ జరిమానా విధించేలా సవరించారు.



మన దేశంలో సులభ వ్యాపార సంస్కరణల కోసం నియంత్రణ సంస్థలను దిష్టిబొమ్మలుగా మార్చారు. అవి ప్రజల సొమ్ముతో నడుస్తున్నా ప్రజల కోసం పనిచేయవు. పర్యావరణ, ప్రజారోగ్య, కార్మికుల ఆరోగ్య ప్రాణ రక్షణలకు గాక వ్యాపార ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా అవి పని చేస్తాయి. వాటిని అలా మార్చేశారు.

మన దేశంలో సులభ వ్యాపార సంస్కరణల కోసం నియంత్రణ సంస్థలను దిష్టి బొమ్మలుగా మార్చారు. అవి ప్రజల సొమ్ముతో నడుస్తున్నా ప్రజల కోసం పనిచేయవు. పర్యావరణ, ప్రజారోగ్య, కార్మికుల ఆరోగ్య ప్రాణ రక్షణలకు గాక వ్యాపార ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా పని చేస్తాయి. అలా వాటిని మార్చారు. వృత్తిపరమైన సవాళ్ళను ఎదుర్కొని వాటికి పరిష్కారాలు కనుగొనే అవసరం, సంస్కృతీ ఆ సంస్థలలో లేక ఉద్యోగ ధర్మానికి తగ్గ నైపుణ్యం ఎదగడం లేదు. ఉదాహరణకి పర్యావరణ మంత్రిత్వ శాఖా, కాలుష్యనియంత్రణ మండలీ జవాబు దారీ లేని నిపుణుల కమిటీల పేరుతో అనుమతి నిర్ణయాలు తీసుకుంటాయి. ఆ కమిటీలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. కమిటీలలో నిజమైన నిపుణులూ అరుదు.

ఇక ఫాక్టరీ విభాగాన్ని చూస్తే, ప్రధానంగా ప్రమాదాలు రసాయన కంపెనీలలో జరుగుతున్నా సంబంధిత నైపుణ్యమున్న అధికారులు కరవయ్యారు. ప్రమాద నివారణ చర్యలు కనపడవు. ప్రమాదం జరిగిన తరువాత ప్రజలకు వివరించడం చేయరు. పత్రికలలో ఊహాగానాలు వస్తుంటాయి. సరైన ప్రమాద దర్యాప్తు సామర్థ్యం లేదు. అదే ప్రమాదాలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయి. జులై 2020లో విశాఖ సాల్వెంట్స్‌లో జరిగిన ప్రమాదమే సాహితి ఫార్మాలో జూన్ 2023లో జరిగింది. ఏలూరు జిల్లా అక్కిరెడ్డి గూడెంలో జరిగిన పోరస్ లాబ్స్ పేలుడు ప్రమాదంలో పదిమంది చనిపోయారు. దర్యాప్తులో జాతీయ హరిత ట్రిబ్యూనల్‌కి తప్పుడు కారణాలు చూపారు. ఆ రియాక్టర్‌లో రసాయన చర్య జరిగేటప్పుడు ఉత్పన్నమయ్యే ఉష్ణాన్ని తొలగించడానికి చల్లబరచే వ్యవస్థ లేదు. అది సరి చేయకుండా అశాస్త్రీయ పద్ధతులలో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. భద్రత పట్ల కంపెనీల అలక్ష్యానికి నియంత్రణ సంస్థల నిర్వహణా లోపాలు తోడై సహేతుక మార్పులు జరగడమే లేదు. అదే తప్పు ఎస్‌బి ఆర్గానిక్స్, చందాపూర్‌లో జరిగింది. చల్లబరిచే వ్యవస్థ లేక ఉష్ణోగ్రత పెరిగి రియాక్టర్ పేలిపోయింది. ఆరుగురు చనిపోయారు. పంతొమ్మిదిమంది గాయపడ్డారు. ఏళ్లుగా ఫాక్టరీ అధికారులూ, కాలుష్య నియంత్రణ అధికారులూ చేసిన తనిఖీలలో ఆ తప్పులు గుర్తించలేదు. పైగా ఆ ప్రాంత ఫాక్టరీ అధికారి కంపెనీలను వెనకేసుకొస్తూ రియాక్టర్ లాటి కీలక పరికరాలపై ఎట్టి పరిస్థితులలోనూ శిక్షణ లేని కార్మికులను కంపెనీలు పెట్టవని పత్రికలకు సెలవిచ్చారు. ఈ ప్రమాదంపై విచారణ చేసిన మాకు ఆ కంపెనీలో జరుగుతున్న ఉత్పత్తిపై కనీస అవగాహన గల ఉద్యోగి కనపడలేదు.

భారత రాజ్యాంగం ప్రకారం జీవించే హక్కు అనేది ప్రాథమిక హక్కు. పొట్టకూటి కోసం ప్రమాదకర రసాయన కంపెనీలలో కార్మికులూ, ఉద్యోగులూ ప్రాణాలు కోల్పోతున్నారు. సులభ వ్యాపార విధానాలు కార్మికుల జీవించే హక్కుని పణంగా పెడుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలూ, విద్యావంతులూ ప్రజలలో పర్యావరణ పరిరక్షణ, పనిలో భద్రతకు సంబంధించిన స్పృహని పెంచడానికి కృషి చెయ్యాలి.

● డాక్టర్ కలపాల బాబూరావు



సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి కొండా సురేఖ

ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన సురేఖ

వరంగల్ సిటీ, ఆగస్టు 19: రాఖీ పండుగను పురస్కరించుకుని దేవాదాయ,అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోని సీఎం నివాసంలో సీఎంతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కూడా రాఖీ కట్టారు.

సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

మంత్రి కొండా సురేఖ జన్మదినం పురస్కరించుకుని సోమవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన అధికారిక లెటర్‌ప్యాడ్‌పై ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రంలో నడుస్తున్న ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని సీఎం అందులో పేర్కొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- రైల్వే పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలి
- కాజీపేట రైల్వే అస్పత్రిని ఆధునికీకరించాలి
- నష్కల్- హసన్‌పర్తి, నష్కల్- చింతలపల్లి రైల్వేలైన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం
- దక్షిణమధ్య రైల్వే జీఎంను కోరిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

7

వలస కూలీలకు ఈకేవైసీ



హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి స్థిర పడి తెల్లరేషన్ కార్డు కలిగిన వారు ఇకపై తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవలసిందే. ఈ మేరకు వలస కూలీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న వలస కూలీలకు కొంత ఊరట లభించనుంది. ఆహార భద్రత కార్డు (తెల్ల రేషన్ కార్డు) కలిగిన వారంతా.. ఆ కార్డులో సభ్యులుగా పేర్లు నమోదైన వారు ఈకేవైసీ చేసుకునే ప్రక్రియ గతేడాది సెప్టెంబరు నుంచి ప్రారంభమై ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 90శాతానికిపైగా పూర్తయింది. అయితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు ఈకేవైసీ చేసుకోలేదు. కూలీ పనులపై వారంతా ఎక్కడెక్కడెక్కడికో వెళ్లడం, పైగా ఈకేవైసీ గురించిన అవగాహన వారికి లేకపోవడంతో వారు ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు వారంతా చేసుకోవలసి ఉంటుంది. ఆహార భద్రత కార్డులో పేరున్న సభ్యులు స్థానికంగా ఉన్నారా? లేదా ఎక్కడికైనా వెళ్లిపోయారా? అని తెలుసుకునేందుకు ఈకేవైసీ ప్రక్రియ నిర్ణయాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకుంది. వలస కూలీలు కాకుండా ఇతరులు రేషన్ దుకాణాల్లో డీలర్ వద్ద బయోమెట్రిక్ విధానంతో ఈకేవైసీ చేయించుకున్నారు.

తప్పనిసరి

ఉత్తర్ ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. వారికి సంబంధించిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వారి స్వరాష్ట్రాలకు చెందిన చిరునామాలు తాము పని చేస్తున్న ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల డీలర్ల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఇలాంటి అవకాశం గతంలో ఇవ్వలేదు. రేషన్ దుకాణంలో డీలర్లు ప్రత్యేక పోర్టల్‌లో కూలీల వివరాలు నమోదు చేస్తారు. కార్డులో పేరున్న సభ్యుడి వేలిముద్రలు రాకుండే ఐరీస్ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇది వరకు రాష్ట్రంలో ఉండేవారికి మాత్రమే ఈకేవైసీ చేశారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు పొందే వీలుంది. ఈ తరుణంలో వలస కూలీలకు దేశంలో ఏ రాష్ట్రంలో ఉన్నా ఈకేవైసీ తప్పని సరిగా మారింది. అధికారిక ఉత్తర్వులు రాగానే ఈ ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రారంభిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రేషన్‌షాపుల డీలర్లకు అందజేశారు.



పెరుగుతున్న వలస కూలీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో గ్రూపు మేస్త్రీలు, గుంపు మేస్త్రీలతో భారీ, మధ్య తరహా నిర్మాణ కాంట్రాక్టర్లు ఒప్పందాలు కుదుర్చుకొని అవసరమైనంత మంది కూలీలను పొరుగు రాష్ట్రాల నుంచి రప్పించి పనిలో పెడుతుండడంతో ఉమ్మడి జిల్లాలో వలస కూలీల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఏ కాంట్రా క్టర్ సహాయం లేకుండానే పని వెతుక్కుంటూ స్వచ్ఛం దగా వస్తున్న వలస కూలీలు కూడా ఉన్నారు. వీరి సంఖ్య కూడా గణనీయంగా ఉన్నది. వీరంతా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చేపట్టే భారీ నిర్మాణాలు, ప్రాజెక్టులు, కాలువలు, విద్యుత్ స్తంభాలను పాతడం లాంటి పనుల్లో పాలుపంచుకుంటున్నారు.

లక్ష మందికిపైగా వలస కూలీలు

ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా వలస కూలీలు ఉన్నట్టు అంచనా. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 30వేల మంది ఉన్నారని, వరంగల్ జిల్లాలో 25వేలు, జనగామ జిల్లాలో 20వేలు, మహబూబాబాద్ జిల్లాలో 10వేలు, ములుగు జిల్లాలో 7వేలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8వేల మంది వలస కూలీలున్నట్టు కొవిడ్ సమయంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. కొవిడ్ అనంతరం పరిస్థితులు చక్కబడిన తర్వాత ఈ వలస కూలీల సంఖ్య మరింత పెరిగినట్టు తెలుస్తోంది. వలస కూలీలు భవన నిర్మాణ పనుల్లోనూ ఎక్కువగా ఉన్నారు. బిల్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తప్పించుకోవడం ద్వారా పనులు చేయించుకుంటున్నారు. స్థానిక కూలీల కన్నా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో పెద్దగా ఇబ్బందులు ఉండకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

రేషన్ దుకాణాలు, కార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2313 రేషన్ దుకాణాలు ఉండగా అన్నపూర్ణకార్డులు (ఏఏపీ), అంత్యోదయ అన్నయోజన కార్డులు (ఏఏవై), ఆహార భద్రతా కార్డులు (ఎఫ్ఎస్‌సీ) కలుపుకొని మొత్తం 11,11,401 రేషన్ కార్డులున్నాయి.



జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు
భూపాలపల్లి	277	1,23,559
మహబూబాబాద్	556	2,40,370
వరంగల్	509	2,66,676
హనుమకొండ	414	2,28,144
ములుగు	222	91,505
జనగామ	335	1,61,147

- త్వరలో ప్రక్రియ ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి ఊరట
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా వలస కూలీలు
- వన్‌నేషన్, వన్ కార్డు విధానంతో వెసులుబాటు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- బల్దియా ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు
- పండుగ రోజు కావడంతో తగ్గిన ఫిర్యాదుదారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 19 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమం నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిర్యాదు దారులు ఊహించిన మేరకు రాలేదు. అంతేకాకుండా పని దినాల్లో గ్రీవెన్స్ నిర్వహించకుండా రక్షాబంధన్ పండగ పూట ప్రజావాణి నిర్వహించడంతో ప్రజలు, ఫిర్యాదు దారులు లేక కౌన్సిల్ హాల్ వెలవెలబోయింది. కమిషనర్‌తో పాటు వివిధ వింగ్ అధికారులు ప్రజావాణిలో నేరుగా ఫిర్యాదులు స్వీకరించాల్సి ఉండగా అకస్మాత్తుగా హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు బల్దియా సువిధ సెల్ నుంచి పాల్గొన్నారు. కాగా బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు వింగ్ ఉన్నతాధికారులు లేకుండా పోయారు. కిందస్థాయి అధికారులు హాజరైన మొక్కుబడిగా కూర్చున్నారు. కాగా, ముందస్తుగా సమాచారం తెలుసుకున్న ప్రజలు బల్దియాకు వచ్చేందుకు మొగ్గు చూపలేదు. దీంతో వేదికపై ముగ్గురు అధికారులు మాత్రమే తూతూ మంత్రంగా ఫిర్యాదులు స్వీకరించి మమ అనిపించారు. కొన్ని విభాగాల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 33 ఫిర్యాదులు స్వీకరించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, కాజీపేట డీసీపీ రవీందర్, ట్యాక్సీ విభాగం అధికారి బీర్రు శ్రీనివాస్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, వెటర్నరీ అధికారి గోపాల్‌రావులతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్-9, హెల్త్, శానిటేషన్-4, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ-2, టౌన్‌ప్లానింగ్-18 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

త్వరగా అనుమతులు జారీ చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 19 : టీజీ-ఐపాస్ పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు త్వరగా అనుమతులు జారీ చేయా లని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. టీజీ-ఐపాస్ పథకంలో భాగంగా మంజూరు కోసం 43 యూనిట్లు 71 అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిలో 51 అనుమతులు వచ్చాయని, ఈ యూని ట్లు రూ.40.22 కోట్లతో ఏర్పాటు చేయడానికి పర్మిషన్ వచ్చిందని, ఈ యూనిట్ల ద్వారా 480 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. 18 రకాలైన కులవృత్తులు వడ్రండి, కమ్మరి, కంసాలి తదితర 18 కులస్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లా పంచాయతీ, మెప్మా, మునిసిపల్ అధికారులు ఈపథకంపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్ : ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమా వేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. హనుమకొండ ఆర్‌డీవో కార్యాలయానికి 3 దరఖాస్తులు, శాయంపేట ఎంపీ డీవో కార్యాలయానికి 2 దరఖాస్తులు, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు 2, జీడబ్ల్యూఎంసీ, కార్పొరే షన్ డీ సెక్షన్, వ్యవసాయ శాఖ, జిల్లా విద్యాశాఖ, పరకాల ఆర్డీవో, ఐనవోలు తహసీల్దార్ కార్యాల యం, కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చాయి. డీఆర్‌వో వై.వి గణేష్, పరకాల ఆర్డీవో నారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులను పరిశీలించిన కలెక్టర్

బాలసముద్రం, ఆగస్టు 19: హనుమకొండ బాల సముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులను హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గడువులోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించండి

- రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 19 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్దిష్ట గడువులోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని ఎంఏ, యూడీ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరి దానకిశోర్ అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి రాష్ట్ర అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్, స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, మహిళా శక్తి క్యాంటీన్లు, స్వచ్ఛదనం.. పచ్చదనం, వీధికుక్కల వల్ల జరిగే నష్టాలపై అధికారులకు విశ్లేసించారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 లాగిన్‌లను రాష్ట్రంలోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ సిబ్బందికి అందించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించిన అనుమతులు ఇవ్వాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ముందుగా సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఎనిమల్ కంట్రోల్ బర్త్ సెంటర్ (ఏబీసీ)లను ఏర్పాటు చేసుకుని వీధి కుక్కల వృద్ధిని నియంత్రించాలన్నారు.

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం మూడు విభాగాలను సమన్వయ పరుస్తూ 12 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్వే నెంబర్‌ల వారిగా దరఖాస్తుల పరిశీలన చేస్తున్నామన్నారు. బల్దియా వ్యాప్తంగా 11 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ఇప్పటికే 8 లక్షల మొక్కలను నాటామన్నారు. ఇంకా రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ కేంద్రంలో 3.75 లక్షల మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ లక్ష్యంగా పని చేస్తున్నామని ఇప్పటికే 2.80 మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ పూర్తి చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.







నేడు ముగ్గురు మంత్రుల రాక

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పర్యటన
- పర్యాటక కేంద్రాలు, చారిత్రాక ప్రదేశాలు, దేవాలయాల సందర్శన
- పలు అభివృద్ధి పనుల పరిశీలన

ములుగు/రేగొండ, ఆగస్టు 19: భూపాలపల్లి, ములుగు జిల్లాలోరాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం పర్యటించనున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఉదయం 9.30 గంటలకు సందర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామం మీదుగా పాండవుల గుట్టలకు చేరుకొని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గణపురం మండలం మైలారంలోని గుహలు, గణపసముద్రం చెరువు పరిశీలించి వాటి అభివృద్ధిపై చర్చిస్తారు. 2.15 గంటలకు కోటగుళ్లను సందర్శిస్తారు. అక్కడి నుంచి ములుగు జిల్లాకు బయల్దేరుతారు. వెంకటాపూర్‌లోని రామప్ప దేవాలయాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు గోవిందరావుపేట మండలం లక్నవరం చెరువును పరిశీలిస్తారు. 5.40 గంటలకు తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటారు. పర్యాటక, దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. రాత్రి 7 గంటలకు వరకు మంత్రుల పర్యటన ములుగు జిల్లాలో కొనసాగనుంది.

రాష్ట్రానికి రక్షణ కరువైంది

- రేవంత్ అరాచక పాలన సాగిస్తున్నారు
- కుట్రలో భాగంగానే జీవో 55 రద్దు
- మహిళలకు ఉచిత ప్రయాణం సమ్మతమే
- బస్సు సర్వీసులు పెంచకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం
- ములుగు పర్యటనలో బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్

7





కాళోజీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హత్యాచార నిందితులను శిక్షించాలి

- కాళోజీ విగ్రహం వద్ద సీపీఐ నాయకుల నిరసన

బాలసముద్రం, ఆగస్టు 19 : కలకత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులకు ఉరి శిక్ష విధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ జంక్షన్ వద్ద గల కాళోజీ విగ్రహం ఎదుట మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్లకార్డులతో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఎల్లేశ్, శ్రీనివాస్, సారంగ పాణి, భిక్షపతి, రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 : సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం హనుమకొండలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. వారంలో రెండు రోజులు ప్రభుత్వ ఆస్పత్రులు, రెండు రోజులు ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలు నమోదు అవుతున్న తీరు, ఎంత మందికి అడ్మిషన్ అవసరం ఉందని, ప్లేట్‌లెట్ సంఖ్య లక్షలోపు ఎంత మంది ఉన్నారని వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును సైతం సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ర్యాపిడ్ కిట్‌లో పాజిటీవ్ వచ్చినట్లయితే వారి నమూనాలను ఎంజీఎం ల్యాబ్‌కు పంపించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 28 డెంగీ పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయని, మలేరియా పాజిటీవ్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇన్‌చార్జి డాక్టర్ ఇష్తికర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడుతున్న అధికారులు

అప్పుల బాధతో మత్స్యకార్మికుడి ఆత్మహత్య



మృతి చెందిన రమేష్

హసన్‌పర్తి, ఆగస్టు 19: అప్పుల బాధతో మత్స్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం హసన్‌పర్తి ఇందిరాకాలనీలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చేరాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పిట్టల రమేష్ (48) కుటుం బం చేపలు పట్టుకొని అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. సంవత్సరం క్రిత మే కూతురు వివాహం, దీనికి తోడు ఇటీవలే తల్లి మృతి చెందడంతో కుటుంబం అప్పుల ఊబిలోకి కూరుకుపోయింది. దీంతో రమేష్ చేసిన అప్పు లు తీర్చలేక మద్యానికి బానిసై మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ముదిరాజ్ కుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కట్టిన మహిళలు



అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కడుతున్న ధర్మ సమాజ్ కమిటీ మహిళలు

ఐనవోలు, ఆగస్టు 19: ధర్మ సమాజ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐనవోలులో అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కట్టి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు కే. ప్రవీణ్, కమిటీ బాధ్యులు లక్ష్మి, మమత రేణుక, శ్వేత, వెన్నెల, స్వప్న, మౌనిక, జోషితలు మాట్లాడుతూ ఆస్తిహక్కు, రాజకీయ హక్కు, విద్య, ఉద్యోగ, ఆత్మగౌరవంతో జీవించే హక్కులు కల్పించిన అన్నయ్యగా రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటామన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు, వంశీ, గణేష్, జయపాల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన వారిని శిక్షించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 19: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అమాయిత్యం చేసి, హత్య చేసిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూరాలని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో క్యాండిల్ ప్రదర్శన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రేణుగుంట్ల సురేష్, దామెర శ్రీను, అనిల్, టీఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మూర్తిరాజుతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతీ మహిళకు అన్ని విధాలుగా రక్షణ చర్యల కోసం ప్రభుత్వాలు మరింత కఠినంగా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, తమ్మల శోభారాణి, రవీందర్, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్య అమానుషం

హనుమకొండ టౌన్ : కలకతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేయడం అమానుషమని జనవేదిక రాష్ట్ర సమతా కమిటీ కన్వీనర్ వెలిదండి సుమలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్‌పై జరిగిన అమానవీయ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలిపారు. సభ్య సమాజం ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

గీసుగొండ, ఆగస్టు 19: మండలంలోని కొమ్మాల శివారు వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి రత్తీరాంతండా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం. కొమ్మాలకు చెందిన తాళ్లపెల్లి రాజు నర్సంపేట నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా మరో బైక్‌పై వచ్చిన నర్సంపేటకు చెందిన సాయి ఢీకొన్నారు. దీంతో కిందపడిపోయిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఇద్దరిని ఎంజీఎంకు తరలించారు. కాగా రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పెంపు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 19: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ప్రవేశ గడువును ఈ నెల 31 వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్‌నాయక్, కోఆర్డినేటర్ హతిరాం తెలిపా రు. ఆసక్తి గల అభ్యర్థులు www.brau online.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని కళాశాలకు వచ్చి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు 73829 29705ను సంప్రదించాలని సూచించారు.


రాక్ క్లైంబింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)


పాండవుల గుట్టలు

గుట్టల అభివృద్ధిపై గంపెడు ఆశలు

- నిర్లక్ష్యానికి గురైన పాండవులు నివసించిన ప్రాంతం
- అనాదిగా అభివృద్ధికి దూరం
- స్వరాష్ట్రంలోనూ సాధించని పురోగతి
- అపూర్వ చరిత్ర ఉన్నా దక్కని ప్రాధాన్యం
- నేడు ముగ్గురు మంత్రుల పర్యటన
- కాంగ్రెస్ సర్కారు దృష్టిసారిస్తుందని పర్యాటకుల ఆశలు

రేగొండ, ఆగస్టు 19 : పాండవుల గుట్టలు... ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధ సౌందర్యం. ఇవి హిమాలయాల కంటే పురాతనమైనవి. పాండవులు ఇక్కడ నివసించారనే ఆధారాలు ఉన్నాయి ఇక్కడ. అత్యంత అరుదైన రాతి సంపద, వాటిపై చెక్కిన చిత్రాలు పాండువుల గుట్టలకు చారిత్రక ఆనవాలు. దేశంలో 90 ప్రాంతాలను జియో హెరిటేజ్‌సైట్‌గా ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక్క పాండవుల గుట్టలకు ఈ ఘనత దక్కింది. 2 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి ఈ గుట్టలు. పచ్చని చెట్లతో జీవవైవిధ్యం ఉట్టిపడుతుం దిక్కడ. అయితే... ఇంత విశిష్టత కలిగిన ఈ చారిత్రక ప్రదేశం పర్యాటకంగా మాత్రం ఆశించినంతగా అభివృద్ధిని సాధించలేకపోయింది. ప్రభుత్వాలు మారినా అనాదిగా ఇది నిర్లక్ష్యానికి గురైంది. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం కూడా పాండవుల గుట్టలకు ప్రాధాన్యం దక్కలేదు. కొత్తగా కొలువుదీరిన సర్కారు అయినా దీనిపై దృష్టి పెట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మంగళవారం ఇక్కడ పర్యటించనున్నారు. దీంతో పర్యాటకులు, స్థానికుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవాలని సర్వత్రా కాంక్షిస్తున్నారు. అత్యధికంగా నిధులు కేటాయించి అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా పాండవుల గుట్టలను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే ఎలాంటి కార్యాచరణ ఉండాలి.. ఏమేం చేయాలని అనే అంశాలపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

నైట్ క్యాంప్ కోసం..

పాండవుల గట్టల సందర్శనకు ఇప్పటికే పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో నైట్ క్యాంప్ కోసం అధికారులు జిప్ టెంట్లు కొనుగోలు చేశారు. పాండవుల గుట్టల వెనకాల క్యాంపు ఏర్పాటు చేయడానికి దంసకుంట చెరువు పక్కన స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ఆ ప్రతిపాదన మరుగునపడిపోయింది. ఈ ప్రదేశంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని పర్యాటకులు కోరుతున్నారు. మార్నింగ్ వాక్ చేయడానికి అనువుగా పోతరాజు చెలిమ వరకు రోడ్డు ఏర్పాటు చేయాలంటున్నారు.

కేబుల్‌కార్, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే..

అందమైన ఆకృతులతో ఎత్తయిన కొండలు, పచ్చని ప్రకృతి పాండవుల గుట్టల సొంతం. ఇలాంటి ప్రదేశంలో కేబుల్‌కార్, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే పర్యాటకులను ఆకర్షించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి సౌకర్యాలు ఉంటే కాళేశ్వరం, రామప్ప ఆలయాలకు వచ్చే భక్తులు, పర్యాటకులు కూడా పాండవుల గుట్టలను సందర్శించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

గెస్ట్ హౌస్‌లు.. కాంటీన్

సుదూర ప్రాంతాల నుంచి కూడా పాండవుల గుట్టలకు పర్యాటకులు వస్తుంటారు. వారి కోసం గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తే రోజంతా విడిది చేసి పాండవుల గుట్టల ప్రకృతిని ఆస్వాదించే అవకాశం ఉంటుందని పలువురు కోరుతున్నారు. అలాగే ఇక్కడ హరిత హోటల్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అంటున్నారు.

రాక్ క్లైంబింగ్ పునరుద్ధరిస్తే..

గతంలో ఇక్కడ ప్రతి ఆదివారం రాక్‌క్లైంబింగ్ నిర్వహించేవారు. ఇందుకు స్థానిక యువకులను ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించారు. కరోనా కాలంలో రాక్ క్లైంబింగ్ నిలిచిపోయింది. దీన్ని పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు. ట్రెక్కింగ్ చేసే వారికి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

సెక్యూరిటీ.. సౌకర్యాల కల్పన

గుట్టలు ఉన్న ప్రాంతాల్లో పర్యాటకులకు రక్షణ, మౌలిక సౌకర్యాలు కల్పించడం అత్యంత ప్రధానం. గుట్ట పైకి వెళ్లే క్రమంలో సెక్యూరిటీ లేకపోతే పర్యాటకులు అభద్రతభావానికి గురయ్యే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానిక యువకులకు శిక్షణ ఇప్పించి సెక్యూరిటీగా నియవిస్తే ఉపాధి కల్పించడంతో పాటు పర్యాటకులకు, రాతి చిత్రాలకు రక్షణ కల్పించొచ్చని అంటున్నారు. తాగునీటి సౌకర్యం కోసం పాండవుల గుట్ట కింద ప్రాంతంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసినప్పటికీ అది పదే పదే మరమ్మతులకు వస్తోందని, కొత్త దాన్ని ఏర్పాటు చేసి పలు చోట్లా ట్యాపులు బిగించాలని కోరుతున్నారు. కొండ పైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని అంటున్నారు.

జింకల పార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు

పాండవుల గుట్టల నుంచి బుగులోని జాతర వెళ్లే మార్గంలో జింకలపార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారులు నివేదికను సిద్ధం చేసినా నిధులు మంజూరు కాక అది మరుగునపడింది. ఇప్పటికైనా జింకల పార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు కార్యరూపం దాల్చాలని పర్యాటకులు కోరుతున్నారు.



వైభవంగా రుద్రేశ్వరుడికి అన్నపూజ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 19 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రావణ మాస పౌర్ణమి శివప్రీతికర సోమవారం రాఖీ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో గణపతికి అరిద్రకుంకుమ లేపనంతో, రుద్రేశ్వరుడికి పాశుపద మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. 108 మంది శివదీక్షాపరులచే సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం 51 కిలోల పెరుగు అన్నంతో అన్నసూక్త మంత్రపఠనంతో మహా అన్నపూజ నిర్వహించారు. రుద్రేశ్వరుడికి ప్రత్యేక రాఖీలు కట్టి రాఖీ రుద్రేశ్వరుడిగా అలంకరింప చేయడం విశేషం. ఈసందర్భంగా ఆలయానికి తరలి వచ్చిన భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్, సందీప్‌లతో పాటు ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజాక్, ఎం. సుజాత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రదోషకాల సమయంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ మాస విశిష్టతపై ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించినట్లు, అదే విధంగా ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు కో ఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు.

భద్రకాళి అమ్మవారికి పవిత్రోత్సవం



వరంగల్ కల్చరల్, ఆగస్టు 19: శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని చారిత్రక భద్రకాళి అమ్మవారికి సోమవారం పవిత్రోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు నేతృత్వంలో అర్చక బృందం నూలుతో వివిధ రకాల దండలు (పవిత్రోత్సవాలు) మాలలను అమ్మవారికి అలంకరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి శేషవస్త్రాలు అందించగా, ప్రధానార్చకులు ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందించారు.


మృతి చెందిన జనగాని సదానందం (ఇన్‌సెట్‌లో ఫైల్)

పండగ పూట విషాదం

- మోకు తెగి కింద పడి గీత కార్మికుడి మృతి

హసన్‌పర్తి, ఆగస్టు 19: అనుబంధానికి ప్రతీకగా నిర్వహించుకునే రాఖీ పండగ పూట హసన్‌పర్తి మండలం జయగిరిలో విషాదం చోటు చేసుకుంది. తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు తెగి జారి కింద పడి గీత కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన ఘటన సోమవారం జరిగింది. హసన్‌పర్తి సీఐ చేరాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన జనగాం సదానందం (58)కి ఒక కొడుకు, కూతురు. మడిపల్లి గ్రామం నుంచి వలస వచ్చి జయగిరిలోనే జీవనం సాగిస్తున్నారు. భార్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా కొడుకు సుమన్ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇద్దరు పిల్లలకు రెక్కల కష్టంతోనే వివాహం జరిపించాడు. సోమవారం సుమన్‌కు రాఖీ కట్టేందుకు ఇంటికి వచ్చిన కూతురికి ఇప్పుడే రెండు మెరలు పెట్టి వస్తానని చెప్పి సదానందం తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కిందికి దిగుతుండగా మోకు తెగి ఒక్కసారిగా కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చేరాలు తెలిపారు. సదానందం కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ కవితసుభాష్‌గౌడ్, గీత కార్మిక సంఘం ప్రతినిధులు మోటపోతుల రాజు, కొక్కొండ రమేష్, తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కాజీపేట : సదానందం కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ కల్లు గీతకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే సదానందం వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కేక్రమంలో పై నుంచి కిందపడి అక్కడిక్కడే మరణించాడని చెప్పారు. ప్రభుత్వం గీత కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన కోరారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- దక్షిణమధ్య రైల్వే జీఎంను కోరిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి


రైల్వే జీఎంతో సమావేశం అయిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

కాజీపేట, ఆగస్టు 19 : కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుతో పాటు రైల్వే పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ఉత్తర భారత దేశాల రైల్వే మార్గాలను కలిపే కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌లు భారత రైల్వేలోనే అతిప్రధానమైనవని, ప్రధానంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైళ్ల ట్రాఫిక్‌ను నివారించడానికి అదనపు ప్లాట్‌ఫారాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని కోరారు. కాజీపేట టౌన్‌స్టేషన్ పూర్తిస్థాయి స్టాండింగ్ స్టేషన్‌గా మార్చాలని, రైల్వే ఆసుపత్రికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు కొత్త భవనం నిర్మించాలని, కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

కాజీపేటలో 3వేల మందికి పైగా రైల్వే ఉద్యోగులు, వైద్యసహాయం అవసరమయ్యే రిటైర్డ్ ఉద్యోగులు మరో 3వేల మందికి వరకు ఉన్నారని, వీరందరి కోసం కాజీపేట రైల్వే అస్పత్రిని అభివృద్ధి చేయటంతో పాటు అదనపు సిబ్బంది, అదనపు సౌకర్యాలు కల్పించి, నిపుణులైన వైద్యులతో పూర్తి స్థాయి సబ్‌డివిజనల్ అస్పత్రిని ప్రారంభించేందుకు నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్, ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్‌కు కొత్త భవనం ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేయాలని కోరారు.

స్టేషన్‌ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ హెడ్‌క్వార్టర్స్‌లో అనేక డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, అధిక సంఖ్యలో అధికారులు, హైదరాబాద్ విజయవాడకు వెళ్తారని, ఈ రైల్వే స్టేషన్ చుట్టూ 60 గ్రామాలు ఉన్నాయని, దీనిని పరిశీలించి పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు స్టేషన్‌ఘన్‌పూర్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరారు. నష్కల్ నుంచి చింతలపల్లి, నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు రెండు మార్గాల్లో రైల్వే బైపాస్ లైన్‌లను నిర్మించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వరంగల్ పట్టణ అభివృద్ధికి అడ్డంగా మారే ప్రమాదం ఉందని, దీనికి ప్రత్యామ్నయంగా అలైన్‌మెంట్‌లో మార్పుచేసి మరో మార్గంలో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన రైల్వే జీఎం రైల్వే ఆసుపత్రి అభివృద్ధికి రూ.1.75 కోట్లు మంజూరు చేస్తున్నామని, టౌన్‌స్టేషన్‌లో వేయిటింగ్‌హాల్స్ నిర్మిస్తామని, కాజీపేట డివిజన్ ఏర్పాటుకై పూర్తి సమాచారాన్ని రైల్వే బోర్డుకు పంపించామని, త్వరలో డివిజన్ ఏర్పాటు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారని వారు చెప్పారు. బైపాస్ లైన్‌ల డిజైన్‌ల మార్పును పరిశీలిస్తామని, రైల్వే సమస్యలపై రైల్వే జీఎం సానుకూలత తెలిపినట్లు ఎంపీ కడియం కావ్య, మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

ఎంపీ కావ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు

- టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్

వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ ప్రాజెక్టులపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ కడియం కావ్య కలిసి ప్రస్తావించినందుకు టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 140 సంవత్సరాల క్రితం కట్టిన రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు నూతన భవనం నిర్మించాలని, కమ్యూనిటీహాల్‌కు అదనపు సౌకర్యాలు కల్పించాలని, రైల్వే ఆసుపత్రికి అదనపు సిబ్బంది ఏర్పాటు, రైల్వే ఉద్యోగుల సమస్యలు తీర్చాలని ఎంపీ కడియం కావ్య రైల్వే జీఎం దృష్టికి తీసురావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కిడ్నీ మార్పిడి సదస్సులో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డికి అవార్డు


మాట్లాడుతున్న డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 : కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సదస్సు 204 యూరాలజిస్టు వైద్యుల సదస్సులో హనుమకొండ ముత్యా కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డికి ద్వితీయ బహుమతి లభించింది. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ కిడ్నీ మార్పిడి, వాస్కులర్ యాక్సెస్ (ఏ వి- ఫిస్టులా ఆపరేషన్) సదస్సులో ఉత్తమ వీడియో ప్రదర్శనలో అవార్డు పొందారు. డయాలసిస్ రోగులలో పారాచూట్ టెక్నిక్‌తో వరంగల్ రోగులకు అత్యాధునిక పద్ధతిలో విజయవంతమైన సేవలు అందించామని డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పద్ధతి ద్వారా ముత్యా కిడ్నీ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా కొంత మంది రోగులకు సేవలు అందించామన్నారు. వరంగల్‌లోని పేద రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 90శాతం సక్సెస్ రేటును పొందామని, అరుదైన ఆపరేషన్‌లకు సంబంధించిన వీడియో ప్రదర్శన జాతీయస్థాయిలో ఆకట్టుకుందని తెలిపారు. ఈ అవార్డు పొందినందుకు హనుమకొండ ముత్యా కిడ్నీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బచ్చు చందు కృష్ణ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు. సదస్సు ఛైర్మన్ డాక్టర్ ఉమేశ్ ఓజా, కార్యదర్శి డాక్టర్ అజయ్ ఓష్వాల్ చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. పలువురు ఐఎంఏ వైద్యులు, హనుమకొండ ముత్యా కిడ్నీ సెంటర్ వైద్యులు డాక్టర్ పాపయ్య నిర్మల్, డాక్టర్ సందీప్, సిబ్బంది మన్నెం శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు.

సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఎత్తివేత

- మణిపూర్‌కు తరలింపు
- నేటి నుంచి 25లోగా తరలివెళ్లనున్న జవాన్లు
- 1100 మంది జవాన్లు పని చేసేవారు



వరంగల్ క్రైం, ఆగస్టు 19 : నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న 58వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ శాశ్వతంగా ఎత్తివేశారు. ఈ మేరకు కేంద్ర సీఆర్‌పీఎఫ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో 1990లో కాకతీయ యూనివర్సిటీ స్థలంలో బెటాలియన్ ఏర్పాటు చేశారు. 58వ బెటాలియన్ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 1100 మంది జవాన్లు పని చేస్తున్నారు. ఇక్కడి నుంచే వరంగల్, ఖమ్మం, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో జవాన్లు విధులు నిర్వహిస్తూ ఉంటారు. ప్రస్తుతం వరంగల్‌లో మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో 58వ డివిజన్ మణిపూర్‌కు తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం 25వ తేదీలోగా పూర్తిగా జవాన్లు తరలివెళ్లనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, 58వ బెటాలియన్ పరిధిలో పని చేస్తున్న కాటారం, మహాముత్తారం కంపెనీలు సైతం తరలి వెళ్లనున్నట్లు సమాచారం.

సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అంటే హడల్...

మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో విచారణకు సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అడ్డాగా ఉండేది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టులను పోలీసులు ఇక్కడికి తీసుకవచ్చి తమదైన పద్ధతిలో విచారించే వారని సమాచారం. చీకటి గదుల్లో వేసి విచారణ సాగించే వారనే ఆరోపణలు ఉన్నాయి. మావోయిస్టులే కాకుండా ఇతర నేరాలకు పాల్పడిన చాలా మందిని ఇక్కడ విచారణ చేసినట్లు సమాచారం. ఏదైనా విచారణ పేరిట నిందితులను క్వార్టర్స్‌కు తరలిస్తే హడలి పోయేవారు.

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఇద్దరు పోలీసు అధికారులు సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అడ్డాగా విచారణ చేసే వారని సమాచారం. జిల్లాలో ఎక్కడ ఎవరు పట్టుకున్నా ఈ ఇద్దరు పోలీసు అధికారుల సమక్షంలోనే చాలా కేసుల విచారణ సాగేదని తెలిసింది. మొత్తంగా సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ 1990 నుంచి 2000 వరకు విచారణకు కేంద్రంగా ఉండేదని అధికారిక సమాచారం.

బాధ్యత మరువని అన్న.. బంధం వీడని చెల్లి..

- సోదరుడుకి బస్సులోనే రాఖీ కట్టిన సోదరి


ఆర్టీసీ బస్సులోనే కండక్టర్ కృష్ణమూర్తికి రాఖీ కడుతున్న సరస్వతి

శాయంపేట, ఆగస్టు 19: విధినిర్వహణలో బాధ్యతగా మెలిగే ఆ అన్నకు.. ఆయన విధినిర్వహణలో ఉన్న సమయంలో రాఖీ కట్టిన ఓ చెల్లి తన అనురాగాన్ని చాటుకుంది. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రానికి చెందిన పోకల కృష్ణమూర్తి భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన రోజులాగే సోమవారం కూడా విధులకు హాజరైన ఆయన హనుమకొండ నుంచి కాళేశ్వరం బస్సులో విధినిర్వహణలో ఉన్నారు. సోమవారం రాఖీ పండుగ కావడంతో తన అన్నకు రాఖీ కట్టాలనుకున్న ఆయన చెల్లెలు శాయంపేట మండలం పెద్దకోడెపాకకు చెందిన ముక్కా సరస్వతి తన అన్న కండక్టర్‌గా ఉన్న బస్సు పెద్దకోడెపాక క్రాస్ వద్దకు రాగానే బస్సు ఆపి, ప్రయాణికుల సమక్షంలో బస్సులో తన అన్నకు రాఖీ కట్టి అనురాగాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా సరస్వతి స్పందిస్తూ తన అన్నలాంటి ఆర్టీసీ కార్మికులు పండుగ రోజు సెలవులు పెడితే తమ పుట్టిళ్లకు వెళ్లి సోదరులకు రాఖీలు కట్టాలనుకునే సోదరీమణులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు.

రాష్ట్రానికి రక్షణ కరువైంది

- కుట్రలో భాగంగానే జీవో 55 రద్దు
- మహిళలకు ఉచిత ప్రయాణం సమ్మతమే
- బస్సు సర్వీసులు పెంచకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం
- బీఆర్‌ఎస్ రాష్ట్రనేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగు, ఆగస్టు 19: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి రక్షణ కరువైందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరాచక చర్యలతోనే పోలీసులు దళిత మహిళను వివస్త్రను చేసి కొట్టే పరిస్థితులు వచ్చాయని బీఆర్‌ఎస్ రాష్ట్రనేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంపన్న చారిటబుల్ ట్రస్టును సోమవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు గట్టమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకున్న ప్రవీణ్‌కుమార్ బస్టాండు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్టును ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనతో జనంలో వ్యతిరేకత వస్తోందని, మరో పోరాటానికి సిద్ధమవుతారన్నారు. మెజారిటీ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటూ దేవుళ్లకు మొక్కుకుంటున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి సభకు రాహుల్‌గాంధీని తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డి చేసిన బీసీ డిక్లరేషన్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కకు పెట్టారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం బీసీ కమిషన్‌కు ఆదేశాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇక బీసీ జనాభా గణన ఎప్పుడు చేస్తారో సమాధానమే లేదని తెలిపారు. 563 గ్రూప్-1పోస్టులలో 209 పోస్టులు ఓపెన్ కేటగిరీలో ఉండగా ఇప్పటివరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన కేటాయింపులపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడంలేదని విమర్శించారు. జీవో 55ను ఆగమేఘాల మీద రద్దుచేసి జీవో 29 తీసుకువచ్చి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచారని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్‌లు అవలంభించిన రిక్రూట్‌మెంట్ విధానం, సుప్రీంకోర్టు తీర్పును స్వయంగా ప్రభుత్వానికి అప్పగించినా స్పందన కనిపించడంలేదని తెలిపారు.

ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు..?

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సమంజసమే అయినా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ఒక్కో బస్సులో 170మంది వరకు ఎక్కుతున్నారని, అవి బస్సులా పుష్పక విమానాలా అని ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. సామర్థ్యానికి మించిన జనంతో బస్సులు నడిస్తే కొండగట్టు లాంటి ప్రమాదం పునరావృతమయ్యే అవకాశముందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల రక్షణపై ఎవ్వరూ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కాగా, జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలు అనే దివ్యాంగునికి ద్విచక్రవాహనాన్ని ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ భూక్యా జంపన్న, బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో మొక్కలు నాటిన డీఎం

కాజీపేట, ఆగస్టు 19: కాజీపేట ఎఫ్‌సీఐ ఆవరణలో సోమవారం ఎఫ్‌సీఐ డీఎం పఖార్ వర్మ, ఇతర సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని తెలిపారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్‌కుమార్, జగ్గు నాయ క్, కిసాన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ఎఫ్‌సీఐ సిబ్బంది

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

హసన్‌పర్తి, ఆగస్టు 19: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన భైరాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ ముల్కలపల్లి కుమార స్వామి కుటుంబాన్ని సోమవారం బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల కోసం తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ సాంబరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సురెందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రజనీకుమార్ న్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మడికొండ, ఆగస్టు 19 : శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వయంభూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకములు, సీతారామచంద్రస్వామికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, బోగి కేదారి, ఆలయ సిబ్బంది భాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పార్వతి అమ్మ వారికి ప్రత్యేక అర్చనలు

దామెర, ఆగస్టు 19: మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో పార్వతి అమ్మ వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సోమవారం శ్రావణ మాసం పురస్కరించుకుని పార్వతి అమ్మ వారికి శ్రీచక్రంపై కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు నాగిళ్ల రాజుశర్మ వేద మంత్రాల నడుమ అమ్మ వారికి నూతన వస్త్రాలను ధరింపచేశారు. శివం టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక పూజాధికాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తమ వెంట తీసుకొచ్చిన పసుపు, కుంకుమలు అమ్మ వారికి సమర్పించి తమ కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు.

వైభవంగా రక్షా బంధన్

వెల్లివిరిసిన సోదర ప్రేమ

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఎంపీ కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి



ఎంజీఎంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న జూనియర్ డాక్టర్లు



దాస్యం వినయ్ భాస్కర్‌కు రక్షా కడుతున్న బ్రహ్మకుమారీలు



మాజీ డిప్యూటీ మేయర్ ఖాజాసిరాజోద్దీన్‌కు రాఖీలు కడుతున్న ఆర్పీలు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 19 : అన్నాచెల్లెళ్ల మధ్య ఆత్మీయ బంధాన్ని చాటే పవిత్ర రక్షా బంధన్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ప్రతీ చోట, ప్రతీఇంటా సోదరీమణులచే రక్షా బంధనాలను కట్టించుకొని ఆశీర్వాదం తీసుకున్న దృశ్యాలు ప్రతీ ఇంటా ఆవిష్కృతమయ్యాయి. వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , నగర మేయర్ గుండు సుధారాణిలు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సోమవారం ఉదయం నుంచి తన క్యాంపు కార్యాలయంలో రక్షా బంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. అనేక మంది మహిళలు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, సుకన్య, మేరి, స్రవంతి, లలిత, సుజాత, తదితరముఖ్య కార్యకర్తలు, మల్లికాంబ మనోవికా కేంద్ర చిన్నారులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి రక్షా బంధనాలు కట్టారు.

భద్రకాళి ఆలయంలో జరిగిన పవిత్రోత్సవ వేడుకల్లోనూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌కు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. నగరంలోని ఎన్‌సీసీ క్యాడెట్లు పోలీసులకు , ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. నగరంలోని వరంగల్ దర్శన్ కార్యాలయంలో రక్షా బంధన్ ప్రాముఖ్యతను చాటే కార్యక్రమాన్ని పెండెం రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సోదరప్రేమను చాటే రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు.

ధర్నా శిబిరంలోనే జూడాల రాఖీ పండగ

వరంగల్ మెడికల్ : కోల్‌కత్తాలో డాక్టర్‌పై జరిగిన అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఎంజీఎంలో జూడాలు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. జూడాల నిరసనకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఎంజీఎంలోని సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి ఆదేశాలు ఇచ్చారు. కేఎంసీలోని రోడ్డు కూడా వారం లోపు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. స్త్రీల రక్షణకై ప్రతిజ్ఞ చేశారు. ధర్నా శిబిరంలో రాఖీ పండగను నిర్వహించుకున్నారు.

అనురాగ బంధానికి ప్రతీక రాఖీ పండుగ

హనుమకొండ చౌరస్తా : వెలకట్టలేని బంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షా బంధన్ అని మాజీ డిప్యూటీ మేయర్ ఖాజాసిరాజోద్దీన్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా హనుమకొండ రాయపూరలోని సిరాజోద్దీన్ నివాసంలో రాఖీ వేడుకల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆర్పీలు సిరాజోద్దీన్ నివాసానికి వెళ్లి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు ప్రమీల, వాణి, శోభా, గీత, కళావతి, స్వరూప పాల్గొన్నారు.

బాలికల సదనంలో ...

సుబేదారి, ఆగస్టు 19 : హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని బాలికల సదనంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బాలికల సదనంను సందర్శించారు. ఈసందర్భంగా బాలికల సదనం పిల్లలు కలెక్టర్ ప్రావీణ్యకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలందరికీ నోట్ బుక్స్, బ్లాకెట్స్, ఫ్రూట్స్‌ను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి, సూపరింటెండెంట్ ఎం. కల్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి సౌరం ప్రవీణ్‌కుమార్, యూడీసీ వెంకట్రాం, సిందూరాణి, కౌన్సిలర్లు పావని, మౌనిక, సతీష్‌కుమార్, సునిత, నగేష్, చైతన్య, సీత, శ్రీలత, గౌతమి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సీపీకి రాఖీ కట్టిన మహిళా పోలీసులు

బాలసముద్రం : రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కు మహిళా పోలీస్‌లు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు రాఖీ కడుతున్న బాలికల సదనం విద్యార్థులు



సీపీకి రాఖీలు కడుతున్న బాలిక సదనం విద్యార్థినులు

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం సీపీ అంబర్ కిశోర్ ఝాకి బాలిక సదనం విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సీపీ అభినందించి అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్‌కు డయల్ చేయాలని వారికి సూచించారు.

బ్రిడ్జీలపై జరభద్రం..

ప్రమాదకరంగా కాజీపేట ఆర్వోబీలు

తీవ్ర ఇబ్బందుల్లో వాహనదారులు

పట్టించుకోని అధికారులు



కడిపికొండ ఆర్వోబీపై దెబ్బతిన్న రోడ్డు, తేలిన ఐరన్ రాడ్లు



గుంతలమయంగా మారిన కాజీపేట ఆర్వోబీ

కాజీపేట, ఆగస్టు 19: ఎవరైనా వాహదారులు రైలెక్కడానికో.. హైదరాబాద్‌కు వెళ్లడానికో, ఇతరత్రా పనులకోసమో.. కాజీపేట వైపు వస్తున్నారా... అయితే జర జాగ్రత్త.. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా గుంతల్లో బొక్క బోర్లా పడే ప్రమాదం ఉంది. కాజీపేట బ్రిడ్జి, కడిపికొండ బ్రిడ్జిపైన నిత్యం వేలాది మంది వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. అయితే ఈ బ్రిడ్జీలపై గుంతలు పడి, రోడ్డు కొట్టుకుపోయి, రోడ్డుపై ఇనుప ఊసలు పైకి తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఈ బ్రిడ్జీలపై ప్రమాదాలు సర్వసాధారణమవుతోంది. ఇక వర్షాకాలమైతే ప్రమాదాలకు కేంద్రాలుగా మారున్నాయి. ప్రతీరోజు జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు సైతం ఈ మార్గాల గుండా ప్రయాణిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఉదయం వేళల్లో అయితే స్కూల్ ఆటోలకు, స్టూడెంట్స్‌కు, ఉద్యోగులకు, ఎదో ఒక వాహనదారునికో ఎదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటోంది. ఈ మధ్య కడిపికొండ బ్రిడ్జిపై ఓ ఆటో గుంతల్లో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కాజీపేట, కడిపికొండ బ్రిడ్జీలపై ఉన్న రోడ్డులను మరమ్మత్తులు చేయాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు



బధిరుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

న్యూశాయంపేట, ఆగస్టు19: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని కార్యాలయంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం లూయిస్ బధిరుల పాఠశాలలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, నాయకులు పెరుకారి శ్రీధర్, పూజారి సత్యనారాయణ, మందాటి మనోజ్‌కుమార్, కంభంపాటి శ్రీధర్, కర్రు వెంకటేశ్వర్లుతోపాటు పెద్ద సంఖ్యలో కులస్థులు పాల్గొన్నారు.

మడికొండలో...

మడికొండ, ఆగస్టు 19 : మడికొండ చౌరస్తాలో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను సోమవారం మడికొండ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోలు సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకలలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, కుర్ల మోహన్, పల్లపు అర్జున్, దువ్వ విజయ్, వస్కుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్టు

శాయంపేట, ఆగస్టు 19: వ్యవసాయ పొలాల వద్ద మోటార్ల చోరికి పాల్పడుతున్న ఐదుగురిని శాయంపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోగంపల్లి పరిధిలోని వ్యవసాయ పొలాల వద్ద మోటార్లు, తహరాపూర్ గుట్టలలోని ఓ క్రషర్‌లో కాపర్‌వైరు చోరీ అయ్యాయని ఇటీవల పోలీసులకు పలు ఫిర్యాదుల రాగా కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు దొంగలను పట్టుకునే క్రమంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోలో ఐదుగురు వ్యక్తులు అనుమానస్పందంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పట్టుకుని విచారణ చేయగా.. నాలుగు ఎలక్ట్రిక్ మోటార్లు, 10 కిలోల కాపర్‌వైరు, ఇతర ఇనుప సామగ్రి లభించాయి. వివరాలు సేకరించగా దొంగతనాలు చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. దీంతో పెద్దకోడెపాకకు చెందిన గోవిందు వెంకటేష్, మంద భద్రయ్య, పరకాలకు చెందిన కేదారి దుర్గాభవాని, కుంభం అరుణ, కేందాల లక్ష్మిలను అరెస్ట్ చేసి, రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 19: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 17 మంది వాహనదారులకు సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరి మానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపి పోలీ సులకుపట్టుబడ్డ 17 మంది వాహనదారులకు రూ. 28,000 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు రూ. 6,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 19: పంథిని శివారు శారద పౌల్ట్రీ ఫాంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పౌల్ట్రీ ఫాంలో సోమవారం తనిఖీలు చేయగా సుమారు 15 క్వింటాల బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి జోరు

సుబేదారి పీఎస్ పరిధిలో విచ్చలవిడిగా విక్రయం

పోలీసులు దృష్టి సారించాలంటున్న స్థానికులు


బాలసముద్రం/న్యూశాయంపేట, ఆగస్టు 19 : హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చదువుకునే యువకులు గంజాయికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ఇటీవల పోలీసు అధికారులతో సమీక్షలు నిర్వహించి గంజాయి విక్రయాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కొందరు సులభంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి కిలో రూ.2500 నుంచి రూ.3వేలకు కొనుగోలు చేసి నగరంలో రూ.20వేల నుంచి రూ.30వేల వరకు విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేట, ఆర్టీసీ బస్టాండ్, వడ్డెపల్లి రోడ్, హంటర్‌రోడ్డు, ఎక్సైజ్‌కాలనీ, అదాలత్, సుబేదారి, జులైవాడ, సహకారనగర్ కాలనీ, పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. యువకులు గంజాయి విక్రయాలు చేస్తున్న రహస్య స్థావరాల సమాచారాన్ని స్థానికులు పోలీసులకు, అధికారులకు అందించినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

మహిళలపై దాడులు

నగరంలో గంజాయి, డ్రగ్స్‌కు బానిసైన యువకులు పరిచయం ఏర్పడిన విద్యార్థినులు, మహిళలపై మత్తులో దాడికి పాల్పడుతున్నట్లు పేర్కొంటున్నారు. కొందరు మహిళలపై దాడి చేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. గంజాయి, డ్రగ్స్ అలవాటుపడిన ఆకతాయిలు బస్టాండ్ కూడళ్లలో మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా కనిపిస్తే లైంగికంగా, మానసికంగా దాడులు చేస్తున్నారు. వీరిపై పోలీసులు నిఘా పెంచి మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ట్రాక్ అడ్డాగా..

31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలో గంజాయి సేవించే యువకుల సంఖ్య పెరుగుతోంది. న్యూశాయంపేటలోని రైల్వేట్రాక్, ట్రాక్ వెనక ఉన్న పోచమ్మగుడి సమీపంలో యువకులు గంజాయి సేవిస్తూ మత్తులో మునుగుతున్నారు. గడిచిన నెల రోజుల నుంచి ఈ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న యువకుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. కొందరు ఇక్కడి యువకులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా యువకులు వచ్చి సేవిస్తున్నట్లు సమాచారం. పోలీసులు గంజాయి విషయంలో సీరియస్ తీసుకుని గంజాయి అమ్ముతున్న, సేవిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ పూర్తిగా గంజాయి నిర్మూలన కావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు న్యూశాయంపేటపై ప్రత్యేక దృష్టి సారించి, పెట్రోలింగ్ చేస్తూ యువకులు గంజాయి సేవించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అంటున్నారు.



న్యూశాయంపేటలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యానర్

న్యూశాయంపేటలో వెలిసిన బ్యానర్లు

'గంజాయి, డ్రగ్స్‌ని తరిమికొడదాం - యువతను కాపాడుకుందాం' అనే బ్యానర్లను న్యూశాయంపేటలోని పలు కూడళ్లలో సుబేదారి పోలీసులు ఏర్పాటు చేశారు. న్యూశాయంపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రైల్వే ట్రాక్ వరకు పలుచోట్ల సుబేదారి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై కన్నేసి ఉంచాలని, ఫోన్లను విచ్చలవిడిగా వాడకుండా అరికట్టాలని ఈ సందర్భంగా పోలీసులు తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

యువకులు జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం గంజాయిని విక్రయిస్తున్నారు. అడ్డదారుల్లో డబ్బుల కోసం గంజాయిని విక్రయించినా.. మహిళలు, విద్యార్థినులను వేధించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నగరంలోని ప్రధాన కూడళ్లలో నిఘా ఏర్పాటు చేశాం. యువకులు గంజాయిని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణరెడ్డి, సీఐ సుబేదారి

డివిజన్‌లో రూపుమాపుతా..

న్యూశాయంపేటలో యువకులు గంజాయి సేవిస్తున్నట్లు పలువురు స్థానికులు చెబుతున్నారు. గంజాయి మత్తులో మునిగి యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. గంజాయి, డ్రగ్స్‌పై యువకులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి రహిత డివిజన్‌గా 31వ డివిజన్ ను తీర్చిదిద్దుతా.

- కార్పొరేటర్ మామిండ్ల రాజు



చెవులంటే మనకు చెప్పలేనంత నిర్లక్ష్యం. చెవులను శుభ్రం చేయడం కోసం చేతికందిన వస్తువులను వాడేస్తూ ఉంటాం. ఎటువంటి రక్షణ చర్యలు పాటించకుండా స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకేస్తూ ఉంటాం. ఫలితంగా చెవుల్లో సమస్య తలెత్తినా, దాన్ని కూడా తెలిసిన చిట్కాతో పరిష్కరించే ప్రయత్నం చేస్తాం! కానీ ఇవన్నీ అంతిమంగా వినికిడి శక్తిని దెబ్బ తీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చెవిలోని జోరీగ..

విమాన ప్రయాణంలో చెవిపోటుతో ఇబ్బంది పడే వారుంటారు. చెవిలో శబ్దాలతో నిద్రపట్టక రాత్రంతా మేలుకునే వాళ్లూ ఉంటారు. గులిమితో చెవులు మూసుకుపోయి, వినికిడి శక్తిని పోగొట్టుకున్న వాళ్లు కూడా ఉంటారు. ఇవన్నీ చిన్నపాటి జాగ్రత్తలతో పరిష్కరించుకోదగిన సమస్యలే! ఇలాంటి చెవి సమస్యల గురించి కొంత అవగాహనతో మెలగగలిగితే, అసౌకర్యాలతో ఇబ్బంది పడే తిప్పలు తప్పుతాయి. సర్వసాధారణమైన చెవి సమస్యల గురించి మాట్లాడుకుంటే...

విమాన ప్రయాణాల్లో చెవి నొప్పి



కొందరికి విమాన ప్రయాణాల్లో చెవి పోటు వేధిస్తుంది. చెవులు దిబ్బెడ పడతాయి. చెవిలో శబ్దం బాధిస్తుంది. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో కళ్లు తిరగడం, మత్తు తలెత్తుతాయి. అరుదుగా కొందర్లో కర్ణభేరి పగిలిపోయి, తీవ్రమైన నొప్పి, రక్తస్రావం కూడా మొదలవుతాయి. గాలి పీడనాల్లో చోటుచేసుకునే మార్పులకు తగ్గట్టుగా చెవుల్లోని యూస్టేషియన్ ట్యూబ్‌లు స్పందించని సందర్భాల్లో ఇలాంటి సమస్యలు వేధిస్తాయి. సాధారణంగా అంతర్జాతీయ విమానాలు 30 నుంచి 40 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తాయి. ఆ సమయంలో అట్మాస్ఫియరిక్ ప్రెజర్ పాయింట్ 3 నుంచి పాయింట్ 2 ఉంటుంది. కాబట్టి విమానం క్యాబిన్ ప్రెజర్ ఒక అట్మాస్ఫియర్ ఉండేలా చూసుకోవాలి. కానీ విమానాల్లో పాయింట్ 7 లేదా పాయింట్ 8 అట్మాస్ఫియరిక్ ప్రెషర్‌నే మెయింటెయిన్ చేయగలిగే పరిస్థితి ఉంటుంది. దాంతో కొందర్లో చెవి పోటు మొదలవుతుంది.

చెవుల్లో గులిమి

చెవుల్లో స్వేద గ్రంథుల్లాంటి సెబేషియస్ గ్లాండ్స్ ఉంటాయి. వాటి నుంచి వెలువడే స్రావాలే గులిమిగా ఏర్పడతాయి. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కలిగిన గులిమి, ఇన్‌ఫెక్షన్ల నుంచి చెవులను రక్షిస్తుంది. దుమ్ము, ధూళి చెవుల్లోకి చొరబడకుండా అడ్డుకుంటుంది. అలాగే చెవిలోని చర్మానికి కూడా తేమను అందిస్తుంది. కాబట్టి కొంత పరిమాణాల్లో చెవుల్లో గులిమి ఉండడం ఆరోగ్యకరం. ఇలా చెవుల్లో తయారయ్యే గులివి౦, నమిలే క్రమంలో దవడలు కదలుతూ ఉన్నప్పుడు, దానంతట అదే బయటకు కూడా వచ్చేస్తూ ఉంటుంది. అరుదుగా కొందర్లో అవసరానికి మించి స్రావాలు స్రవించడం మూలంగా, ఇయర్ కెనాల్ ఇరుకుగా ఉండడం మూలంగా, చెవుల నిర్మాణం అసాధారణంగా ఉండడం మూలంగా గులిమి లోపలే పేరుకుపోతుంది. కొందర్లో ఇది చెవిని పూర్తిగా మూసేస్తుంది. దాంతో చెవి ఇన్‌ఫెక్షన్లు, నొప్పి రావచ్చు.

పరిష్కారాలు ఇవే

- డ్రై వ్యాక్స్‌ను కరిగించే ఇయర్ డ్రాప్స్ వాడుకోవాలి
- అనుభవజ్ఞులైన వైద్యులను కలిసి గులిమి తొలగించుకోవాలి
- స్వయంగా గులిమిని తొలగించే ప్రయత్నం చేయకూడదు.

చెవుల్లో చిక్కులు

పిల్లలు లెగోలను, బొమ్మలను, థర్మకోల్ బాల్స్‌ను చెవుల్లో పెట్టేసుకుంటూ ఉంటారు. పెద్దలు కూడా చెవులను శుభ్రం చేయడం కోసం ఇయర్ బడ్స్ వాడినప్పుడు, దూది చెవుల్లోనే ఇరుక్కుపోతూ ఉంటుంది. నేల మీద పడుకున్నప్పుడు బొద్దింకలు, గడ్డిలో పడుకున్నప్పుడు చీమలు, పురుగులు లాంటివి కూడా చెవుల్లోకి చేరిపోతూ ఉంటాయి. కొందరికి మెత్తని గులిమి చెవికి అడ్డుపడిపోయి, దాన్ని తొలగించడం కోసం చేసే ప్రయత్నాల ఫలితంగా అది మరింత లోపల ఇరుక్కుపోతూ ఉంటుంది. సాధారణంగా చెవుల్లో ఏదైనా ఇరుక్కుపోతే స్వయంగా బయటకు లాగే ప్రయత్నం చేస్తూ ఉంటారు. లేదంటే ఆన్‌లైన్‌లో దొరికే కొన్ని పరికరాలను కొనుగోలు చేసి, వాటి సహాయంతో సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇలాంటి ప్రయత్నాల వల్ల ఇయర్ కెనాల్, కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో శాశ్వతంగా వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం కూడా రావచ్చు.

పరిష్కారాలు ఇవే...

చెవిలో ఇరుక్కున్న వాటిని తొలగించే పనిముట్ల వాడకం మానేయాలి. మరీముఖ్యంగా ప్రత్యేకించి ఇందు కోసమే ఇంటర్నెట్‌లో దొరికే గ్యాడ్జెట్స్‌ను కొని వాడుకోవడం మానేయాలి. ప్రతి ఒక్కరి ఇయర్ కెనాల్ భిన్నంగా ఉంటుంది. మనం మన చెవుల్లోకి తొంగి చూడలేం కాబట్టి, చెవికి తగని గ్యాడ్జెట్స్‌ను ఉపయోగించడం వల్ల చెవి అంతర్భాగం దెబ్బతింటుంది.

- ఇయర్ బడ్స్‌తో ఇరుక్కుపోయిన వస్తువులను బయటకు లాగే ప్రయత్నం చేయకూడదు
- ఫోర్‌సెప్స్ ఉపయోగించకూడదు
- తలను పక్కకు వంచితే ఫారిన్ బాడీ బయటకొచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి అలా చేయవచ్చు
- చెవిలో చీమలు, పురుగులు చొరబడితే ఆలివ్ నూనె లేదా కొబ్బరినూనె వేసుకోవచ్చు. వాటితో అవి చనిపోయి, బయటకు వచ్చేస్తాయి.
- మరీ ముఖ్యంగా ఇఎన్‌టి వైద్యులను కలిస్తే, వాళ్ల దగ్గర తగిన పరికరాలుంటాయి కాబట్టి కర్ణభేరి దెబ్బ తినకుండా సమస్య నుంచి బయటపడవచ్చు.

పరిష్కారాలు ఇవే!

విమాన ప్రయాణం చేసే అందరికీ ఇలాంటి సమస్యలు తలెత్తవు. జలుబు వల్ల ముక్కులో కంజెషన్ ఉన్నవాళ్లు, అలర్జీలు, సైనసైటిస్ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవాళ్లు, పాలు తాగే పసిపిల్లలు, తరచూ విమాన ప్రయాణాలు చేసేవాళ్లలో ఈ సమస్య ఎక్కువ. ఈ కోవకు చెందిన వాళ్లు చిన్నపాటి చిట్కాలతో సమస్య తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చు. అవేంటంటే...

- విమానం గాల్లోకి లేచేటప్పుడు, కిందకు దిగేటప్పుడు ఆవులించడం, చూయింగ్ గమ్ నమలడం లాంటివి చేయాలి.
- ముక్కును వేళ్లతో మూసి, నోరును గట్టిగా మూసేసి, ముక్కు ద్వారా గాలిని బయటకు ఊదే ప్రయత్నం చేసి, చెవి దిబ్బెడను తొలగించుకోవాలి.
- ట్రావెలర్ ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి.
- విమాన ప్రయాణం ఆసాంతం నీళ్లు తాగుతూ ఉండాలి.
- జలుబు, దగ్గు ఉన్నవాళ్లు విమానం గాల్లోకి లేచే ముందు, నేల మీదకు దిగిన తర్వాత నేసల్ స్ప్రేలు వాడుకోవాలి.
- జలుబు ఉన్న పసికందులకు కూడా నేసల్ డ్రాప్స్ వేయాలి.

స్కూబా డైవింగ్‌తో చెవి అసౌకర్యం

సాధారణంగా ఆకాశంలోకి పైకి వెళ్లేటప్పుడు వాతావరణ పీడనం తగ్గుతుంది. కానీ నీటి అడుగుకు వెళ్లేటప్పుడు పీడనం పెరుగుతుంది. ఒక్కొక అడుగు నీళ్ల దిగువకు డైవ్ చేసేకొద్దీ పీడనం కూడా క్రమేపీ పెరిగిపోతూ ఉంటుంది. కాబట్టి ఆ పీడనాన్ని శరీరానికి అలవాటు చేయడం కోసం ఒక్కొక్క అడుగు దిగువకు దశలవారీగా విరామం తీసుకుంటూ డైవ్ చేయాలి. ఒక అడుగు దిగువకు చేరుకున్న తర్వాత కొంత సేపు ఆగి, తర్వాత ఇంకొక అడుగు కిందకు డైవ్ చేయాలి. అలాగే నీళ్ల పైకి చేరుకునేటప్పుడు కూడా ఒకేసారి పైకి వచ్చేయకుండా, నెమ్మదిగా రావాలి. లేదంటే శరీరంలోని వాయువులన్నీ కీళ్లలో ఉండిపోయి నడక కష్టమవుతుంది. విమాన ప్రయాణం చేసి గమ్యానికి చేరుకున్న 24 గంటల లోపు స్కూబా డైవింగ్, అండర్ వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొనకూడదు. అలాగే స్కూబా డైవింగ్, అండర్ వాటర్ స్పోర్ట్స్ ఆడిన 24 గంటల వరకూ విమాన ప్రయాణం చేయకూడదు. ఇలా చేస్తే, వాతావరణ పీడనంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులను చెవులు తట్టుకోలేక, ఇబ్బంది పెడ తాయి.

చెవుల్లో శబ్దాలు

ఈ సమస్యను వైద్య పరిభాషలో టిన్నిటస్ అంటారు. పబ్స్, పెళ్లిళ్లలో పెద్ద శబ్దాలకు బహిర్గతమైనప్పుడు తాత్కాలికమైన టిన్నిటస్‌కు గురవుతాం. ఈ సమస్య ఎనిమిది గంటలకు సర్దుకుంటుంది. కానీ చెవుల్లోని హియరింగ్ నాడి బలహీనపడినప్పుడు శాశ్వత టిన్నిటస్‌కు గురవుతాం! అలాగే టిన్నిటస్‌లో చెవిలో శబ్దాలు ఇతరులకు కూడా వినిపించే టిన్నిటస్ ఉంటుంది. కేవలం సమస్య ఉన్న వాళ్లకే చెవుల్లోపల శబ్దాలు వినిపించే పరిస్థితి ఉంటుంది. బయటి వాళ్లకు కూడా వినిపించే శబ్దాలను అందుకు కారణమైన సమస్యను చికిత్సతో సరిదిద్దడం ద్వారా ఆబ్జెక్టివ్ టిన్నిటస్‌ను నయం చేయవచ్చు. హీమోగ్లోబిన్ తగ్గినవాళ్లలో కూడా ఈ రకమైన టిన్నిటస్ ఉంటుంది. కానీ సమస్య ఉన్నవాళ్లకి మాత్రమే చెవిలో శబ్దాలు వినిపించే సబ్జెక్టివ్ టిన్నిటస్ సమస్యకు శాశ్వత చికిత్స లేదు. కాబట్టి, ఆ సమస్యకు అలవాటుపడే జీవనశైలిని అలవరుచుకోవలసి ఉంటుంది. అందుకోసం...

- ఏకాంతంగా, నిశ్శబ్దంగా ఉండే గదుల్లో నిద్రపోకుండా పరిసరాల శబ్దాలతో నిండిన ప్రదేశాల్లో నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి.
- ఫ్యాన్ రెక్కలకు చిన్న కాగితాన్ని అంటించి, తిరిగేటప్పుడు శబ్దం వెలువడేలా చూసుకుని, ఆ గదిలో నిద్రపోవాలి
- ఏదైనా మ్యూజిక్ వింటూ నిద్రపోయే ప్రయత్నం చేయాలి.
- ఆందోళన వల్ల కూడా టిన్నిటస్ పెరుగుతుంది. కాబట్టి ఆందోళన తగ్గించుకోవాలి.
- వినికిడి లోపం ఉన్నా టిన్నిటస్ వస్తుంది. అలాంటి వాళ్లు హియరింగ్ ఎయిడ్స్ పెట్టుకోవాలి.
- టిన్నిటస్ మాస్కర్స్ పెట్టుకుని చెవుల్లోపలి శబ్దాలను తగ్గించుకోవచ్చు.

డాక్టర్ పి.వి.ఎల్.ఎన్ మూర్తి
పిడియాట్రిక్ ఇఎన్‌టి, స్నోరింగ్ అండ్ స్లీప్ ఆప్నియా సర్జన్,
స్టార్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్



మీకు తెలుసా!

హెల్తీ పాప్ కార్న్



పాప్‌కార్న్ ఆరోగ్యకరమైన అల్పాహారం. ఇది తింటే ఎముకలు, కండరాలు, కణజాలం వృద్ధి చెందుతాయి. జీర్ణ శక్తి పెరుగుతుంది. దంతాలు బలపడతాయి.

యాంటాసిడ్స్

మంట మందులు మంచివేనా?

ఛాతీ, పొట్టలో మంటను చల్లార్చడం కోసం మందుల షాపుల్లో దొరికే యాంటాసిడ్లు కొని వాడేస్తూ ఉంటాం. నిజానికి ఈ అలవాటు వల్ల ఒరిగే ప్రయోజనం తాత్కాలికమే! యాంటాసిడ్‌లు తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందించగలుగుతాయి తప్ప శాశ్వత పరిష్కారాన్ని అందించవు. ఎందుకంటే ఏ రకమైన యాంటాసిడ్ అయినా పొట్టలోని ఆమ్లాన్ని సమం చేయగలుగుతుందే తప్ప ఆమ్లం ఉత్పత్తిని తగ్గించలేదు. ఆమ్లం ఉత్పత్తి కారణంగా తలెత్తే అల్సర్ల నుంచి తక్షణ ఉపశమనం కోసం అరుదుగా యాంటాసిడ్లను వాడుకున్నా ఫర్వాలేదు. బ్యాక్టీరియా, కేన్సర్‌లు అల్సర్ కారకాలైతే యాంటాసిడ్‌లు వాడుతూపోతే సమస్య మరింత ముదిరి ప్రాణాలకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి తక్షణ ఉపశమనం కోసం యాంటాసిడ్లను వాడుతూ ఉండిపోకూడదు. అసిడిటీ



లక్షణాలు అడపా దడపా అందరిలో ఏదో ఓ సందర్భంలో కనిపిస్తాయి. అయితే ఒకవేళ వారంలో నాలుగైదు రోజులు అల్సర్ లక్షణాలు కనిపించినా, పదే పదే యాంటాసిడ్ వాడాల్సిన అవసరం పడుతున్నా ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. యాంటాసిడ్‌లకు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. మెగ్నీసియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ అనే రెండు రకాల యాంటాసిడ్‌లతో వేర్వేరు దుష్ప్రభావాలు కనిపిస్తాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల మలబద్ధకం, మెగ్నీసియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల వాంతులు, విరేచనాలు కలుగుతాయి. మనంతట మనం యాంటాసిడ్‌లను ఎంపిక చేసుకుంటే ఈ దుష్ప్రభావాలను బలవంతంగా భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా వైద్యుల పర్యవేక్షణలో వాడితే ఆ దుష్ప్రభావాలను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లగలుగుతాం! అప్పుడు వైద్యులు లక్షణాల ఆధారంగా ప్రత్యామ్నాయ మందులను సూచిస్తారు.

నడుము, కాళ్లు అందంగా!



నడుము కింది భాగం చక్కని ఫిట్‌నెస్ సంతరించుకోవాలంటే 'కెటిల్ స్క్వాట్స్' వ్యాయామం చేయాలి. ఈ వ్యాయామంతో తొడలు, పిక్కలు, పిరుదుల కండరాలు బలపడతాయి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే...

- రెండు కాళ్లు రెండు అడుగుల దూరంగా ఉంచి నిలబడాలి.
- తర్వాత 2 లేదా 5 కిలోల కెటిల్‌ను చేతుల్లోకి తీసుకుని నిలబడాలి.
- ఇదే భంగిమలో మోకాళ్లను వంచి, కిందకి కుంగి, పైకి లేవాలి.
- ఇలా 10 నుంచి 15 సార్లు 3 సెట్లు చేయాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

ఏ విటమిన్ ఎందుకోసం?

విటమిన్ల లోపం వ్యాధినిరోధకశక్తిని సన్నగిల్లేలా చేసి ఇన్‌ఫెక్షన్లు సోకే ముప్పును పెంచుతుంది. ఈ లోపాన్ని సరిదిద్దుకోవడం కోసం సమతులాహారం తీసుకోవటంతోపాటు ఆ ఆహారం ద్వారా పొందే విటమిన్ల మీద కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి.

విటమిన్ ఎ: ఎదుగుదల, రోగనిరోధక శక్తి, కంటిచూపుకు అవసరం. ఎ విటమిన్ లోపంవల్ల ఈ అంశాలకు సంబంధించిన బలహీనతలు తలెత్తుతాయి. మరిముఖ్యంగా కంటిచూపు మందగించటం, రేచీకటిలాంటి సమస్యలు బాధిస్తాయి.



విటమిన్ బి1: ఈ విటమిన్ డెఫిసియన్సీ వల్ల 'బెరిబెరి' రుగ్మత బాధిస్తుంది.

విటమిన్ బి5: పారాస్థీసియా అనే సమస్య తలెత్తుతుంది.

విటమిన్ బి7: పునరుత్పత్తి, వెంట్రుకలు, చర్మసంబంధ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ బి12: అనీమియా బారిన పడే ప్రమాదం ఉంది.

విటమిన్ సి: బలహీనత, బరువు తగ్గటం, ఒళ్లు నొప్పులు, స్కర్వీ సమస్యలు వేధిస్తాయి.

విటమిన్ డి: రికెట్స్, ఎముకల సమస్యలు.

విటమిన్ ఇ: నరాల సమస్యలువిటమిన్ కె: రక్తం గడ్డకట్టే సమస్యలు, ఎముకలు గుల్లబారటం.

గుడ్ ఫుడ్

ఇన్‌ఫ్లమేషన్‌కు అడ్డు కట్ట

ఆర్థ్రయిటిస్‌లో నొప్పి, వాపు సహజం. అయితే ఈ లక్షణాలను కొన్ని ఆహారపదార్థాలతో తగ్గించుకునే వీలుంది. అవేంటంటే...

బ్లూబెర్రీస్

వీటిలో సహజసిద్ధ రసాయనాలైన పాలిఫినాల్స్ ఉంటాయి. వీటిలో ఉండే యాంథోసయానిన్ పాలిఫినాల్స్ వల్లే బ్లూబెర్రీస్‌కు నీలి రంగు సమకూరుతుంది. ఈ పాలీఫినాల్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రలైజ్ చేసి, ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించి, ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి.



వాల్‌నట్స్

వీటిలోని అత్యధిక ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలిక్ యాసిడ్లు, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. వాల్‌నట్స్‌లో ఉండే సి రియాక్టివ్ ప్రొటీన్, క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఇ పోషకాలు కీళ్ల సంబంధ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి సహాయపడతాయి.

డార్క్ చాక్లెట్

వీటిలో సమృద్ధిగా ఉండే ఫ్లేవనాయిడ్స్ ఇన్‌ఫ్లమేషన్, వాపులను తగ్గిస్తాయి. చాక్లెట్ ఎంత డార్క్‌గా ఉంటే అంత ఎక్కువ ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. కాబట్టి 70% కోకో, అతి తక్కువ చక్కెరలను కలిగి ఉండే డార్క్ చాక్లెట్‌ను ఎంచుకోవాలి. అలాగే డార్క్ చాక్లెట్లు సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, కంటి నిండా నిద్ర పట్టడానికి సహాయపడతాయి.

మంకిఫాక్స్‌తో జాగ్రత్త!

ఈ మధ్యకాలంలో మంకీఫాక్స్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వ్యాపిస్తోంది. ప్రమాదకరమైన ఈ వైరస్ ఎలా వ్యాపిస్తుందో.. దాని నివారణ చర్యలేమిటో తెలుసుకుందాం.



అవేర్‌నెస్

పొంచి ఉన్న ప్లాస్టిక్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, ప్లాస్టిక్ కాలుష్య కారక జబ్బుల కారణంగా ప్రతి 30 సెకన్లకు ఒకరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. మన కంటికి కనిపించని అదృశ్య రూపాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరకుండా ఉండాలంటే, ఇదిగో ఇలా అప్రమత్తంగా వ్యవహరించాలి.

• రేజర్ బ్లేడ్లు

ఒక్కసారి వాడి పారేసే డిస్పోజబుల్ రేజర్లు ఇప్పుడు విరివిగా మార్కెట్లో దొరుకుతున్నాయి. పదే పదే కడిగి వాడే తీరిక లేని వారు ఇలాంటి రేజర్లను కొనేస్తున్నారు. నిజానికి ఈ వస్తువుల తయారీ, ప్యాకింగ్ కోసం ఎక్కువ ప్లాస్టిక్ వాడుతూ ఉంటారు. రేజర్ ప్యాకింగ్ కోసం ప్లాస్టిక్ రేపర్, ప్లాస్టిక్ కేస్ అదనంగా వాడతారు. రేజర్ పూర్తిగా ప్లాస్టిక్‌తోనే తయారవుతుంది. వీటికి బదులు సాధారణ రేజర్లు వాడవచ్చు. ఇవి లోహంతో తయారై ఉంటాయి. కేవలం బ్లేడ్ మాత్రమే మార్చుకోవలసి వస్తూ ఉంటుంది. ప్లాస్టిక్ డిస్పోజబుల్ రేజరు కంటే లోహపు రేజరు ఖరీదు ఎక్కువే కావచ్చు. కానీ ఒకసారి కొంటే ఆ తర్వాత కొనే బ్లేడ్ల ఖర్చు తక్కువే అనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

• రెడీ మీల్స్

వండుకునే తీరిక లేనివాళ్లు రెడీమేడ్ ఆహారాన్ని ఆశ్రయిస్తూ ఉంటారు. ఈ ప్యాకెట్లను మైక్రోవేవ్ ఓవెన్లలో వేడి చేసుకుని తినేయవచ్చు. అయితే రెడీమేడ్ ఆహారం, ప్లాస్టిక్ డబ్బాలతో వస్తుంది. వాటి పైన రీసైకిల్ చేయడానికి వీలు లేని ప్లాస్టిక్ ఫిల్మ్ ఉంటుంది. ఇవన్నీ లామినేట్ చేసిన కార్డ్‌బోర్డ్ స్లీవ్‌లో ఉంటాయి. ఒక పూట ఆహారం కోసం ఇంతటి ప్లాస్టిక్ వాడకం అనవసరం. కాబట్టి మైక్రోవేవ్‌లో వేడి చేసుకుని తినగలిగే ఆహార పదార్థాల వాడకం తగ్గించాలి. డిమాండ్ తగ్గితే ఉత్పత్తీ తగ్గుతుంది. వీలైతే మైక్రోవేవ్‌లో వేడి చేసుకోగలిగే వీలున్న గిన్నెల్లో వండుకున్న పదార్థాలను



ఆఫీసుకు తీసుకువెళ్లి అవసరమైనప్పుడు వేడి చేసుకుని తినవచ్చు.

• టేప్ వాడకం

అతికించే స్టికీ టేప్ ప్లాస్టిక్‌తో తయారైనదే! దీనికి బదులుగా నారను వాడవచ్చు. కొబ్బరిపీచు కూడా వాడుకోవచ్చు. కొబ్బరిపీచుతో కట్టిన పూలగుత్తి అందంగా, ఆధునికంగా కూడా ఉంటుంది. రంగులతో కూడిన ఊలు, దారం, సిల్క్ రిబ్బన్లు, లేసులు కూడా వాడుకోవచ్చు.

• పాప్‌కార్న్

తేలికగా పగిలే వీలున్న గాజు వస్తువుల ప్యాకింగ్ కోసం థర్మకోల్ లేదా పాలీస్టైరీన్ (పీనట్స్) వాడుతూ ఉంటాం. కానీ ఇవి రీసైకిల్ చేయడానికి వీలు లేని ప్లాస్టిక్ ఆధారిత పదార్థాలే. కాబట్టి వీటికి బదులుగా పాప్‌కార్న్ వాడవచ్చు. లేదా కాగితాలను ఉండలుగా చేసి వాడవచ్చు.

• కోన్ ఐస్‌క్రీమ్

ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తే ప్లాస్టిక్ కప్ బదులుగా కోన్‌ను ఎంచుకోండి. అప్పుడు ప్లాస్టిక్ కప్పులతో పర్యావరణానికి జరిగే నష్టం తగ్గుతుంది. కప్‌తో తినే ఐస్‌క్రీమ్ వల్ల కప్పు, దాంతో పాటు వచ్చే ప్లాస్టిక్ చెంచా ఒక్కసారి వాడకంతో వృథా అవడంతో పాటు పర్యావరణానికీ చేటు చేస్తున్నాయి. కాబట్టి ఐస్‌క్రీమ్ కోన్‌లోనే తినడం అలవాటు చేసుకోవాలి.

• వెనిగర్ వాడకం

స్నానపు గది శుభ్రం చేయడానికి టాయిలెట్ క్లీనర్ల మీద ఆధారపడతాం. ఇవన్నీ ప్లాస్టిక్ డబ్బాల్లోనే వస్తాయి. పైగా కాస్త ఖరీదుగానూ ఉంటాయి. ప్లాస్టిక్ వేస్ట్‌తో పాటు ఖర్చూ తగ్గించుకోవాలి అనుకుంటే కొన్ని చెంచాల వెనిగర్‌ను నీళ్లలో కలిపి, రెండు నిమిషాలు ఆగి, ఆ నీటితో కడిగి చూడండి. టాయిలెట్ క్లీనర్ కంటే మెరుగైన ఫలితం దక్కుతుంది.

• పెద్ద మొత్తాల్లో

వంటకు, ఇతర అవసరాలకు ఉపయోగించే వస్తువులు పెద్ద మొత్తాల్లో కొంటే ఒకే ప్లాస్టిక్ వస్తువును ఉపయోగించిన వాళ్లం అవుతాం. అయితే అంత మొత్తం ఒకరే వాడుకోవడం కష్టం కాబట్టి స్నేహితులతో కలిసి వెలను పంచుకుని, వస్తువులను కూడా పంచుకోవాలి. ఈ అలవాటు అలవరుచుకున్నా ప్లాస్టిక్ వాడకం తగ్గించినట్టే!

• టీ బ్యాగ్స్

టీ బ్యాగ్స్‌లో ప్లాస్టిక్ రహస్యంగా దాగి ఉంటుంది. టీ బ్యాగుల్లో పొడి నింపి, మూయడానికి పాలీప్రొపైలీన్ అనే ప్లాస్టిక్‌ను వాడతారు. టీ బ్యాగులు వాడి పారేసిన తర్వాత మట్టిలో కలిసిపోతాయి. కానీ వాటి మూతులు మూయడానికి వాడిన ప్లాస్టిక్ పర్యావరణంలో అలాగే ఉండిపోతుంది. కాబట్టి అలాంటి ప్లాస్టిక్ వాడని టీ బ్యాగులను ఎంచుకోవాలి. లేదా విడిగా టీపొడి వాడకం పెంచాలి.

• ఫేస్ వైప్స్

మేకప్ తొలగించడానికి, ముఖం తుడుచుకోవడానికి వైప్స్ వాడుతూ ఉంటాం. ద్రవపూరిత మేకప్ రిమూవర్లు, దూది కంటే వైప్స్ తక్కువ ప్రభావం కలిగి ఉంటాయి. పైగా ఇవి పర్యావరణంలో కలిసిపోకుండా, నల్లాలకు అడ్డుపడి, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ ఉంటాయి. కాబట్టి మేకప్ తొలగించడానికి అందుకోసం తయారైన వస్తువలను వాడడం మేలు. అలాగే వెంట ఒక చేతిరుమాలు ఉంచుకోవాలి.

దిక్సూచి
DIKSUCHI

భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు



భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ ఉపు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం



భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఓబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాలవారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.**(మిగతా రేపటి దిక్సూచిలో)**



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1zoPRCwలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.

బ్రహ్మా ఆనందం సందడి



హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

కూర్గ్‌లో పెళ్లి



'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.

ఒకే రోజు.. రెండు చిత్రాలు!



సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో ఆలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.

అందరికీ పేరుపేరునా..



"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నా మార్గదర్శకురాలికి..



అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

'హ్యాపీ రక్షా బంధన్'



"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

ఇష్టమైన సమయం వచ్చేసింది



"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

థ్యాంక్యూ అన్నయ్యా..



"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

నిన్ను బాగా మిస్సవుతున్నాను



"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు అందించాలనే ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్'(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.

హీరో కృష్ణ అభిమాని సినిమా



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.

బిజినెస్

విష్ణు కెమికల్స్ చేతికి జయన్‌శ్రీ ఫార్మా

డీల్ విలువ రూ.52 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ విష్ణు కెమికల్స్ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన జయన్‌శ్రీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ (జేపీపీఎల్) కంపెనీని ఆస్తులు, అప్పులతో కలిపి (ఎంటర్‌ప్రైజ్ వాల్యూ) రూ.51.99 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ మేరకు జేపీపీఎల్ సహా వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కాగా సోమవారం నాడు విష్ణు కెమికల్స్ కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ డీల్‌కు ఆమోదం తెలిపింది. విశాఖలోని జేపీపీఎల్ ప్లాంట్.. విష్ణు కెమికల్స్ ప్లాంట్‌కు సమీపంలోనే ఉంది. జేపీపీఎల్ కొనుగోలుతో విష్ణు కెమికల్స్ తయారీ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. అంతేకాకుండా జేపీపీఎల్ టేకోవర్‌తో విష్ణు కెమికల్స్ స్థిరాస్తుల విలువ మరో రూ.80 కోట్ల వరకు పెరగనుంది.

మైన్ డిటెక్షన్ సిస్టమ్‌కు పేటెంట్

జెన్ టెక్నాలజీస్


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ దళాలకు అవసరమైన సిమ్యులేషన్ యంత్రాలను డిజైన్ చేసి సరఫరా చేస్తున్న జెన్ టెక్నాలజీస్ మరో వినూత్న ఉత్పత్తిని అభివృద్ధి చేసింది. 'మైన్ డిటెక్షన్ సిస్టమ్' పేరుతో అభివృద్ధి చేసిన ఈ వినూత్న ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. అత్యంత కచ్చితంగా మందుపాతరలను అమర్చడం, వాటిని కనిపెట్టి, తొలగించేందుకు ఈ వ్యవస్థ అత్యంత సురక్షితమైనదని కంపెనీ పేర్కొంది. జీపీఎస్/జీఐఎస్ టెక్నాలజీ ఆధారంగా ఈ మైన్ డిటెక్షన్ సిస్టమ్ పని చేస్తుంది. మైనస్ 25 డిగ్రీల సెల్సియస్ నుంచి 45 డిగ్రీల సెల్సియల్ వరకు ఈ సిస్టమ్ పని చేస్తుంది. సముద్ర మట్టానికి 15,000 అడుగుల ఎత్తు వరకు ఉన్న ప్రాంతాల్లోనూ ఈ టెక్నాలజీ సాయంతో మందుపాతరలు అమర్చటం, తొలగించడం చేయవచ్చని తెలిపింది.

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై కమిటీ!

న్యూఢిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశాయి. దీంతో ఈ సమస్య నుంచి బయటపడేందుకు, ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ కమిటీలో సెబీ అధికారులు కూడా ఉండే అవకాశం ఉంది. సెబీలో చేరాక కూడా బుచ్, సింగపూర్‌లో తాను నెలకొల్పిన రెండు కన్సల్టెన్సీల నుంచి ఆదాయం అందుకున్నట్టు హిండెన్‌బర్గ్ డాక్యుమెంట్లతో సహా బయటపెట్టింది. ఈ నేపథ్యంలో ఒక కమిటీ వేసి ఈ అంశాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పండగ సీజన్‌లో విమానయానం భారం

25% వరకు పెరిగిన టికెట్ చార్జీలు



న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగ సీజన్‌లో విమానయానం మరింత భారం కానుంది. దీపావళి సమయంలో దేశీయంగా విమాన ప్రయాణానికి ముందస్తు బుకింగ్ చార్జీలు కీలక మార్గాల్లో సగటున 10-15 శాతం వరకు పెరిగాయి. ఓనం సమయంలో కేరళలోని నగరాలకు టికెట్ ధరలు ఏకంగా 20-25 శాతం వరకు పెరిగాయని ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో తాజా విశ్లేషణ నివేదిక వెల్లడించింది. ఈ దీపావళి సీజన్‌లో ఢిల్లీ-చెన్నై, ముంబై- బెంగళూరు, ఢిల్లీ-హైదరాబాద్ వంటి ప్రముఖ మార్గాలతో పాటు ఇతర ప్రదేశాలకూ ప్రయాణ టికెట్ చార్జీలు గత ఏడాదిలో ఇదే సీజన్‌తో పోలిస్తే సగటున 10-15 శాతం పెరిగాయని ఇక్సిగో గ్రూప్ కో-సీఈఓ రజనీశ్ కుమార్ అన్నారు. అయితే, కొన్ని మార్గాల్లో మాత్రం చార్జీలు 1-27 శాతం వరకు తగ్గాయని అన్నారు. ముంబై-అహ్మదాబాద్ రూట్ టికెట్ రేటు 27 శాతం తగ్గి రూ.2,508గా ఉందని, ముంబై-ఉదయ్‌పూర్ చార్జీ 25 శాతం తగ్గుదలతో రూ.4,890కి లభిస్తున్నదన్నారు. బెంగళూరు-హైదరాబాద్ మార్గంలో టికెట్ రేటు 23 శాతం తగ్గి రూ.3,383కి, ముంబై-జమ్ము రూట్లో చార్జీ 21 శాతం తగ్గుదలతో రూ.7,826కి జారుకుందన్నారు. కాగా, వచ్చే నెల రెండో వారంలో ఓనం పండగ సమయంలో విమాన ప్రయాణానికీ గిరాకీ అధికంగా ఉందని.. బుకింగ్‌లు, ట్రావెల్ సెర్చ్‌లు గత ఏడాది ఇదే పండగ సీజన్‌తో పోలిస్తే రెట్టింపయ్యాయని రజనీశ్ అన్నారు. కేరళలోని కోచి, కోజికోడ్, తిరువనంతపురానికి ఎయిర్ టికెట్ ధరలు 20-25 శాతం పెరిగాయన్నారు. కొన్ని మార్గాల్లో మాత్రం ధరలు 6-35 శాతం వరకు తగ్గాయన్నారు.

పండగ సీజన్‌లు, అత్యయిక పరిస్థితుల్లో ఎయిర్ చార్జీలు అనూహ్యంగా పెరగడంపై ఆందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనవసర టికెట్ ధరల పెంపుతో ప్రయాణికులు నష్టపోకుండా చూసేందుకు వారి ఇబ్బందుల పరిష్కారం కోసం ఆన్‌లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఈ మధ్యనే లోక్‌సభలో వెల్లడించారు. ప్రస్తుతం విమాన టికెట్ చార్జీలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. ఈ విషయంలో ఎయిర్‌లైన్స్ స్వీయ నియంత్రణ పాటించాలని, టికెట్ ధరల పెంపు విషయంలో సున్నితంగా వ్యవహరించాలని ఇండస్ట్రీకి నిర్దేశించడం జరిగిందని మంత్రిత్వ శాఖ రాజ్యసభలో వెల్లడించింది.

ఈ ఏడాది దీపావళి సీజన్‌లో (అక్టోబరు 30- నవంబరు 5) ప్రయాణానికి ఎయిర్ టికెట్ ధరల అధికంగా పెరిగిన మార్గాలు

మార్గం	టికెట్ ధర(రూ.)	గత దివాలీ సీజన్‌తో పోలిస్తే పెరుగుదల(%)
ఢిల్లీ-చెన్నై	7,618	25
ముంబై-హైదరాబాద్	5,162	21
ఢిల్లీ-గోవా	5,999	19
ఢిల్లీ-అహ్మదాబాద్	4,930	19

ఈ ఏడాది ఓనం పండగ సమయంలో (సెప్టెంబరు 6-15) ప్రయాణానికి ఎయిర్ టికెట్ చార్జీలు అధికంగా పెరిగిన మార్గాలు

మార్గం	టికెట్ ధర(రూ.)	గత ఓనం సీజన్‌తో పోలిస్తే పెరుగుదల(%)
హైదరాబాద్- తిరువనంతపురం	4,102	30
ముంబై-కోజికోడ్	4,448	30

సెబీకి తప్పని మొండి బకాయిలు

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకీ మొండి బకాయిల బెడద తప్పడం లేదు. కంపెనీలు, వ్యక్తుల నుంచి రావాల్సిన ఫీజులు, పెనాల్టీల బకాయిలు ఏటికేటికీ పెరిగి పోతున్నాయి. ఎంత ప్రయత్నించినా ఈ బకాయిలు వసూలు కావడం లేదు. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి 807 కేసులకు సంబంధించి రూ.76,293 కోట్లను వసూలు చేయడం కష్టమైన బకాయిలు (డీటీఆర్)గా తేల్చింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది నాలుగు శాతం ఎక్కువని 2023-24 వార్షిక నివేదికలో సెబీ పేర్కొంది. ఇందులో ఎక్కువ భాగం కోర్టులు నియమించిన కమిటీలతో ముడిపడి ఉన్న కేసులకు సంబంధించిన బకాయిలు. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించినా వసూలు కాని బకాయిలను సెబీ డీటీఆర్‌లుగా వర్గీకరిస్తుంది

క్యూ3లో చైనా ప్లాంట్‌లో ఉత్పత్తి షురూ

అరబిందో ఫార్మా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (క్యూ3) చైనాలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు అరబిందో ఫార్మా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) సంతానం సుబ్రమణియన్ వెల్లడించారు. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టే వీలుందని తెలిపారు. అమెరికాతో పాటుగా చైనాలో తమ ఉత్పత్తుల అనుమతి కోసం దరఖాస్తు చేయాలని చూస్తున్నట్లు సుబ్రమణియన్ పేర్కొన్నారు. అనుమతులు లభిస్తే చైనా మార్కెట్ ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. అయితే ఈ ఏడాది మాత్రం చైనా మార్కెట్ ఆదాయాలు స్వల్పంగా ఉంటాయన్నారు.

అక్టోబరు నుంచి పెన్-జీ ప్లాంట్ సామర్థ్యం పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన పెన్సిలిన్ (పెన్-జీ) ప్లాంట్‌లో భారీ స్థాయిలో వాణిజ్యీకరణ అనుకున్న విధంగానే సాగుతోందని సుబ్రమణియన్ వివరించారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా అక్టోబరు నుంచి ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచాలని యోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) అనుమతి పొందిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,500 టన్నులని తెలిపారు.

డిపాజిట్ల సేకరణపై దృష్టి పెట్టండి

పీఎస్‌బీ చీఫ్‌లకు నిర్మల సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. డిపాజిట్ల సేకరణకు గట్టిగా కృషి చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. సోమవారం ఆమె పీఎస్‌బీల పనితీరుపై కార్యనిర్వహణాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత కొద్ది నెలల కాలంలో డిపాజిట్లలో 3 నుంచి 4 శాతం వృద్ధి మాత్రమే చోటు చేసుకుంటుండగా రుణాలు మాత్రం గణనీయంగా పెరిగిపోయి ఆస్తులు-రుణాల మధ్య తీవ్ర అంతరం ఏర్పడిందన్నారు. కస్టమర్లకు సమర్థవంతమైన సేవలందించేందుకు వారితో మెరుగైన సంబంధాలు కలిగి ఉండాలని నిర్మల సూచించారు. ప్రధానంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉద్యోగులు ప్రజలతో అనుసంధానమై ఉండేలా చూడాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,780 ▲	66,710 ▲	90,000 ▼
ముంబై	71,108 ▲	65,135 ▲	83,291 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	475
వరంగల్	452	గోదావరి	475
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

ధరలపై అప్రమత్తత తప్పదు

ఆర్‌బీఐ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కాయధాన్యాలు, పప్పులు, వంటనూనెల ధరలు అదుపులోకి వస్తున్నాయి. ఆగస్టు నెలలో వీటన్నింటి ధరలు ఓ మోస్తరుగా తగ్గినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) "ఆర్థిక వ్యవస్థ తాజా స్థితి"పై విడుదల చేసిన నివేదికలో తెలిపింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వస్తూత్పత్తులకు డిమాండ్ పుంజుకుంటోందని, దీని ప్రభావం వల్ల ప్రైవేట్ పెట్టుబడులు కూడా జోరందుకోవచ్చునని పేర్కొంది. జూన్ నెలలో 5.1 శాతం ఉన్న ద్రవ్యోల్బణం జూలై నెలలో 3.5 శాతానికి అంటే 1.54 శాతం మేరకు తగ్గింది. ప్రజలు అధికంగా వినియోగించే కూరగాయల్లో ఉల్లి, టమాటా ధరలు తగ్గినప్పటికీ బంగాళా దుంప ధర ఇంకా పైపైకే ఎగబాకుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ దేవవ్రత పాత్రా నాయకత్వంలోని రచించిన ఆ వ్యాసంలో తెలిపింది. భవిష్యత్తులో కూడా ఆహార ధరల ఒత్తిడులున్నట్టయితే మాత్రం విధానపరమైన అప్రమత్తతను ఆర్‌బీఐ కొనసాగించక తప్పదని తేల్చిచెప్పారు. కాగా ఈ ఏడాది ప్రైవేట్ రంగ మూలధన పెట్టుబడులు 54 శాతం పెరిగి రూ.2.45 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది.

డిపాజిట్ బీమాను సమీక్షించాలి: దేశంలో చిన్న డిపాజిటర్ల రక్షణ కోసం అమల్లోకి తెచ్చిన డిపాజిట్ బీమా గరిష్ఠ పరిమితిని ఎప్పటికప్పుడు పెంచుతూ ఉండాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. డిపాజిట్ల విలువలో వృద్ధి, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ప్రజల ఆదాయ స్థాయిలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ పరిమితిని పెంచుతూ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.5 లక్షలుంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో సంపూర్ణ రక్షణ కల్పించిన డిపాజిట్ల సంఖ్య 97.8 శాతం ఉన్నదని ఆయన చెప్పారు. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ 80 శాతంతో పోల్చితే ఇది చాలా ఎక్కువగానే ఉంది.

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించే అంశాలేమీ లేకపోవడంతో సోమవారం ట్రేడింగ్ నిస్తేజంగా సాగింది. మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శించడంతో రోజంతా స్వల్ప శ్రేణిలో కదలాడిన ప్రామాణిక సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 12.16 పాయింట్ల నష్టంతో 80,424.65 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 31.50 పాయింట్ల పెరుగుదలతో 24,572.65 వద్ద క్లోజైంది.

ఓలా ఎలక్ట్రిక్ షేరు దాదాపు రెండింతలు: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ షేరు దూసుకెళ్తోంది. కంపెనీ షేరు సోమవారం మరో 10 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.146.03కు చేరుకుంది. ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే, ఇప్పటివరకు కంపెనీ షేరు 92.14 శాతం ఎగబాకింది.

1:5 గా ఆంధ్రా పేపర్ షేర్ల విభజన: ఆంధ్రా పేపర్ లిమిటెడ్.. ఒక్కోటి రూ.10 ముఖ విలువతో కూడిన షేరును రూ.2 ముఖ విలువ ఉండే 5 షేర్లుగా విభజిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల 11వ తేదీని ఇందుకు రికార్డు డేట్‌గా నిర్ణయించింది. ఆ తేదీ నాటికి కంపెనీ రికార్డుల్లో వాటాదారులుగా ఉన్న అందరి షేర్లు.. రూ.2 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా మారతాయి.



'బరువు' బాధ్యత రెజ్లర్‌దే

వినేశ్ అప్పీల్ తిరస్కరణపై కాస్ వివరణ

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్ అప్పీల్‌ను ఎందుకు తిరస్కరించామనే విషయమై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) పూర్తి వివరణ ఇచ్చింది. అథ్లెట్లు తమ బరువు పరిమితిని దాటకుండా చూసుకోవాల్సిందేనని, ఎట్టి పరిస్థితిలోనూ మినహాయింపు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. అయితే రెండో రోజు అదనపు బరువు కారణంగా అనర్హతకు గురికావడం కాస్త కఠినంగానే అనిపిస్తుంటుందని పేర్కొంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కిలోల విభాగంలో అదనంగా 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉండడంతో వినేశ్ ఫైనల్‌కు దూరమైన సంగతి తెలిసిందే. అయితే తనకు కనీసం సంయుక్తంగా రజత పతకమైనా ఇవ్వాలని వినేశ్ చేసుకున్న అప్పీల్‌ను ఈనెల 14నే కాస్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. అప్పీల్‌ను తిరస్కరిస్తున్నామంటూ ఒక్క వాక్యంతో తీర్పు కాపీలో కాస్ పేర్కొంది. దానిపై పూర్తి వివరణ ఇచ్చింది. 'నిబంధనలన్నీ స్పష్టంగా ఉన్నాయి. ప్రతీ అథ్లెట్ తమ గరిష్ఠ బరువుకు లోబడే ఉండాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు. కనీసం గ్రాము బరువు ఎక్కువగా ఉన్నా అనుమతించడం కుదరదు. ఇందుకు పూర్తి బాధ్యత రెజ్లర్‌దే. వినేశ్ తనకు తానుగానే 50 కిలోల విభాగాన్ని ఎంచుకుంది. కాబట్టి ఆమెకు తన బరువు ఎంత ఉండాలో తెలుసు' అని కాస్ వివరించింది.



ఈసారి పతకాల సంఖ్య పెంచాలి

పారా అథ్లెట్లతో ప్రధాని మోదీ సంభాషణ

న్యూఢిల్లీ: ఈనెల 28 నుంచి ఆరంభమయ్యే పారాలింపిక్స్‌లో పాల్గొనే భారత అథ్లెట్లతో ప్రధాని మోదీ ముచ్చటించారు. వీడియో కాల్ ద్వారా జరిగిన ఈ సంభాషణలో క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. 12 క్రీడాంశాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి 84 మంది అథ్లెట్లు భారత్ తరఫున పాల్గొనబోతున్నారు. 'క్రీడల్లో ప్రతిభ చూపడమే కాకుండా పారా అథ్లెట్లు తమ అంకిత భావం, మానసిక శక్తి, కఠోర శ్రమతో ఎలాంటి కష్టమొచ్చినా అధిగమించగలమని నిరూపించారు. 140 కోట్ల మంది భారతీయులు ఆశీస్సులు మీకున్నాయి. గతంలో టోక్యో క్రీడల్లో సాధించిన విజయాలకు మించి పారిస్‌లో పతకాలు కొల్లగొడుతారని ఆశిస్తున్నా' అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పారా అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

స్పోర్ట్స్

సెమీస్‌కు రోనక్

అండర్-17 వరల్డ్ రెజ్లింగ్

అమ్మాన్ (జోర్డాన్): భారత కుర్రాడు రోనక్ దహియా అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం దిశగా దూసుకెళుతున్నాడు. రోనక్ 110 కిలోల విభాగంలో సెమీఫైనల్లో ప్రవేశించాడు. ప్రీక్వార్టర్స్‌లో 8-1తో ఆర్థర్ మన్వెలియన్ (ఆర్మేనియా)ను చిత్తుచేసిన రోనక్.. తర్వాతి బౌట్‌లో ఆర్మేనియాకే చెందిన డానిల్ మస్లాకొవ్‌పై టెక్నికల్ సుపీరియారిటీ పద్ధతిలో ఓడించాడు. ఫైనల్ బెర్త్ కోసం హంగేరీ రెజ్లర్ జోల్టాన్ జాకోతో రోనక్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

బిగ్‌బాష్ లీగ్ జాబితాలో హర్మన్, జెమీమా

మెల్‌బోర్న్: మహిళల బిగ్‌బాష్ లీగ్ డ్రాఫ్టింగ్ కోసం తమ ప్రారంభ జాబితాను నిర్వాహకులు విడుదల చేశారు. ఇందులో భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఉన్నారు. అలాగే అంతర్జాతీయ స్టార్లు సోఫీ ఎకెల్‌స్టోన్, సుజీ బేట్స్, హీథర్ నైట్స్ లారా వోల్వార్ట్ నామినీ జాబితాలో చోటు దక్కించుకున్నారు. అక్టోబరు 27 నుంచి జరిగే ఈ లీగ్ కోసం వచ్చే నెల 1న ప్లేయర్ల ఎంపిక జరుగుతుంది. గతంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడిన హర్మన్‌ను అదే జట్టు రిటైన్ చేసుకునే చాన్సుంది.

గొంతులో ఆహారం ఇరుక్కొని..

ఒలింపిక్ సైక్లిస్ట్ మృతి



న్యూఢిల్లీ: తాను తిన్న ఆహారమే ఆమెకు శాపమైంది. మృత్యురూపంలో కబళించింది. ఊహించని రీతిలో కన్నుమూసిన ఒలింపిక్ స్టార్ సైక్లిస్ట్ విషాదాంతమిది. వెనిజులాకు చెందిన మాజీ సైక్లిస్ట్ డానియెలా లారియల్ చిరినోస్ గొంతులో ఆహారం ఇరుక్కుపోవడంతో చనిపోయిందన్న వార్త క్రీడావర్గాల్లో విషాదం నింపింది. ఐదుసార్లు ఒలింపిక్స్‌లో ప్రాతినిథ్యం వహించిన 50 ఏళ్ల డానియెలా.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఈనెల 11న మృతిచెందింది. అయితే, పోస్ట్‌మార్టమ్ రిపోర్టులో ఆమె ఆహారవాహికలో ఘనాహారం కనిపించిందని వైద్యులు తేల్చారు. ఘనాహారం తిన్న తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె.. శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బందిపడి ప్రాణాలు విడిచిందని వెల్లడించారు.

విరాట్, రోహిత్ ఎందుకు ఆడరు?

దులీప్ ట్రోఫీకి దూరమవడంపై గవాస్కర్ ప్రశ్న



న్యూఢిల్లీ: వచ్చే నెల 5 నుంచి జరిగే దులీప్ ట్రోఫీలో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆడకపోవడాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశ్నించాడు. ఇందులో పాల్గొనే నాలుగు జట్లలో చాలామంది అంతర్జాతీయ ఆటగాళ్లు ఆడబోతున్నారు. అయితే రోహిత్, విరాట్, పేసర్ బుమ్రాలకు మాత్రం బీసీసీఐ మినహాయింపునిచ్చింది. జూన్ 28న టీ20 వరల్డ్‌కప్ ముగిశాక రోహిత్, విరాట్ ఈనెల 7 వరకు జరిగిన శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ మాత్రమే ఆడారు. ఇక సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో సిరీస్ వరకు వారికి ఎలాంటి మ్యాచ్ ప్రాక్టీస్ ఉండదు. 'దులీప్ ట్రోఫీకి సెలెక్టర్లు రోహిత్, విరాట్‌లను ఎంపిక చేయకుండా విశ్రాంతినిచ్చారు. దీంతో ఎలాంటి ప్రాక్టీస్ లేకుండానే వారు బంగ్లాతో సిరీస్ ఆడబోతున్నారు. బుమ్రాపై పని ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. కానీ బ్యాటర్లు కాస్త సమయం క్రీజులో గడపాల్సి ఉంటుంది. 30+ వయస్సు వచ్చిన ప్లేయర్లు నిరంతరం ఆడితేనే అత్యున్నత ప్రమాణాలను కాపాడుకున్నట్టవుతుంది. కానీ విరామం ఎక్కువైతే కండరాల శక్తి తగ్గి తిరిగి లయ అందుకునేందుకు సమయం పడుతుంది' అని గవాస్కర్ సూచించాడు.

పసిడిపైనే గురి

పారాలింపిక్స్‌లో శీతల్‌పై భారీ అంచనాలు





రెండు చేతులు లేకపోయినా.. కాళ్లతోనే బాణాలు సంధిస్తూ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుతంగా రాణిస్తున్న 17 ఏళ్ల శీతల్ దేవి భారత పారాలింపిక్స్ బృందంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పారాలింపిక్స్‌లో పోటీ పడుతున్న భారత జట్టులో పిన్న వయసు అథ్లెట్ శీతలే కావడం విశేషం. పారిస్ క్రీడల్లో ఈసారి ఆర్చరీలో ఓవరాల్‌గా 140 మంది ప్లేయర్లు 9 స్వర్ణాల కోసం తలపడనున్నారు. టోక్యో పారాలింపిక్స్, ఆసియాడ్‌లో చైనా టేబుల్ టాపర్‌గా నిలిచింది. కానీ, ఇటీవలి కాలంలో భారత్ కూడా కాంపౌండ్ ఆర్చరీలో మేటి జట్లకు గట్టిపోటీ ఇస్తుంది. ఈ నేపథ్యంలో తొలిసారి పారాలింపిక్స్ బరిలోకి దిగుతున్న జమ్మూకశ్మీర్ ఆర్చర్ శీతల్‌పై భారత్‌కు భారీ అంచనాలున్నాయి. 2023 వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన శీతల్.. పారిస్‌కు అర్హత సాధించింది. అనంతరం ఆసియా పారా క్రీడల్లో వ్యక్తిగత, మిక్స్‌డ్ ఈవెంట్లలో స్వర్ణాలతో అదరగొట్టింది. పారిస్ క్రీడల్లో ఈనెల 31వ తేదీనే వ్యక్తిగత విభాగం పతక రౌండ్ ఉండడంతో శీతల్ గ్రాండ్‌గా బోణీ కొడుతుందని భావిస్తున్నారు. పారాలింపిక్స్‌లో పతకం కొల్లగొట్టేందుకని శీతల్ తీవ్రంగా శ్రమిస్తోంది. పూర్తిగా సాధనలోనే మునిగితేలుతూ ఇంటినే మరిచిపోయింది. ఆమె ఇంటికి వెళ్లక దాదాపు ఏడాదిన్నర దాటిపోయిందట. పారిస్‌లో స్వర్ణ పతకం అందుకుని సగర్వంగా ఇంటికి వెళతానని శీతల్ ధీమాగా చెబుతోంది. పారాలింపిక్స్‌లో పతకం నెగ్గడం అంత సులువేం కాకపోయినా.. కొరియా, ఇరాన్ ఆర్చర్లకు దీటుగా పోరాడితే ఫలితం రాబట్టవచ్చని శీతల్ వెల్లడించింది. పారిస్ క్రీడల్లో భారత్ నుంచి శీతల్‌తో పాటు సరిత, రాకేష్ కుమార్ కూడా ఆర్చరీలో పతకాలు సాధించే అవకాశాలున్నాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఫైనల్ సహా అన్ని మ్యాచ్‌లు పాక్‌లోనే!

● చాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ చీఫ్ నఖ్వీ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు పాల్గొనే విషయమై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. కానీ, 1996 తర్వాత తొలిసారి ఐసీసీ ట్రోఫీ ఆతిథ్య హక్కులను దక్కించుకున్న పాకిస్థాన్ మాత్రం టోర్నీని భారీ ఎత్తున నిర్వహించడానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సహా అన్ని మ్యాచ్‌లు పాక్‌లోనే జరుగుతాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహసిన్ నఖ్వీ చెప్పాడు. టైటిల్‌ఫైట్‌కు లాహోర్ వేదిక కానుందన్నాడు. వచ్చేఏడాది ఫిబ్రవరి-మార్చిలో చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్టేడియాల్లో పెద్దఎత్తున మరమ్మతులు చేపడుతున్నారు. కాగా, పాక్‌లో పర్యటించేందుకు టీమిండియా ఇప్పటి వరకు సమ్మతి తెలియజేయలేదు. మరోవైపు హైబ్రిడ్ విధానంలో టోర్నీని నిర్వహించేందుకు ఐసీసీ యోచన చేస్తుందనే వార్తలు కూడా వచ్చాయి. కానీ, వీటిపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు.

చాంపియన్ గోవింద్

మేడ్చల్ టౌన్ (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-12 మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గోవింద్ గుప్తా విజేతగా నిలిచాడు. భువనగిరిలో జరిగిన ఈ పోటీల్లో మేడ్చల్ యూనివర్సల్ అకాడమీకి చెందిన గోవింద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టైటిల్ ఎగరేసుకుపోయాడు.



దీప్తి.. సూపర్ షో

లండన్‌దే 'హండ్రెడ్' ట్రోఫీ

లండన్: టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మరోసారి సూపర్ షోతో అదరగొట్టింది. మహిళల హండ్రెడ్ లీగ్ టోర్నమెంట్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటి తన జట్టు లండన్ స్పిరిట్‌కు ట్రోఫీ అందించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో లండన్ స్పిరిట్ 4 వికెట్ల తేడాతో వెల్ష్ ఫైర్ జట్టును ఓడించి తొలిసారి విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో స్పిరిట్ గెలవాలంటే చివరి మూడు బంతుల్లో నాలుగు పరుగులు అవసరమవగా.. దీప్తి సిక్సర్ బాది తన జట్టును గెలిపించింది. ఈ మ్యాచ్‌లో ఓ వికెట్ కూడా తీసింది. ఈ సీజన్ టోర్నీలో బ్యాటింగ్‌లో ఆరు ఇన్నింగ్స్‌లు ఆడిన దీప్తి.. 132.50 స్ట్రయిక్ రేట్‌తో 212 పరుగులు చేసింది. ఇందులో అత్యధిక స్కోరు 46 నాటౌట్. ఇక, ఎనిమిది మ్యాచుల్లో బౌలింగ్ చేసిన దీప్తి.. 6.85 ఎకానమీతో 8 వికెట్లు పడగొట్టింది. ఇలా, టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన చేసి లండన్ జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించింది.



మాఫీలో ఆంక్షలొద్దు

ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆందోళన

- ఘట్‌కేసర్ రైతు సేవా సహకార బ్యాంక్ నుంచి 1,230 మంది రైతుల రుణం
- ఒక్క రైతు కు కూడా రుణ మాఫీ కాలే..
- వివరాలు ఆఫ్‌లైన్‌లో.. అందరికీ మాఫీ: అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఆదిలాబాద్ రూరల్/ ఆర్మూర్ రూరల్/పిట్లం, మల్లాపూర్, ఆగస్టు 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండు లక్షల రుణమాఫీ మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు ఇప్పటి వరకు అందలేదు. ఇప్పటిదాకా మూడు విడతల ప్రక్రియ పూర్తయినా మాఫీ ఎప్పుడెప్పుడా అని ఆ రైతులు ఎదురుచూస్తున్నారు. ఘట్‌కేసర్ మండలంలో ప్రధానంగా రైతు సేవా సహకార సంఘం నుంచే రైతులు పంట రుణాలు తీసుకుంటారు. ఆ బ్యాంక్‌లో 1,230 మంది అన్నదాతలు రూ. 9కోట్ల మేరకు పంట రుణం తీసుకున్నారు. మరో 54మంది స్థానిక యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియాలో 92 లక్షల పంట రుణం తీసుకున్నారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ సర్కారు గత నెల 18వ తేదీ నుంచి మూడు దశల్లో రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఘట్‌కేసర్ రైతుల్లో ఏ ఒక్కరికీ ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. స్థానిక యూనియన్ బ్యాంక్ అప్ ఇండియాలో 54 మందికి గాను రెండు దశల్లో 46 మందికి రూ.52 లక్షల మేరకు రుణమాఫీ అయింది. ఘట్‌కేసర్ సహకార బ్యాంకులో రుణం తీసుకున్న అన్నదాతలంతా రైతు సేవా సహకారం సంఘం, బ్యాంకుల చుట్టూ తిరుగతున్నారు. అయితే బ్యాంకులో ఆడిట్ జరుగుతుందని, త్వరలో రుణమాఫీ అవుతుందని అధికారులు చెబుతూ వస్తున్నారు. రుణమాఫీ కాకపోవడంతో పంటల సాగు కోసం బయట అప్పుల చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రుణ మాఫీ కాలేదంటూ ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రైతులు సోమవారం ఆందోళన కొనసాగించారు. ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఇంద్రవెల్లి మండలంలోని ధన్నూర్.. బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి, ఇచ్చోడకు చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలొచ్చారు. కలెక్టర్ రాజార్షి షాను కలిసి తమ సమస్యను విన్నవించారు. వెంటనే తమకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ అందుతుందని, మండల వ్యవసాయాధికారులకు వివరాలను అందజేయాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం దేగాం గ్రామ దక్కన్ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులు సోమవారం ధర్నా చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ వెంటనే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం రాంపూర్ గ్రామంలో గల గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు ఆందోళన చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవుపేట గ్రామంలో రైతు సమన్వయ సమితి నాయకులు సోమవారం రిలే దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరానికి వచ్చిన తహసీల్దార్, ఏవో లావణ్య రైతులతో మాట్లాడారు. అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి రైతులకు ఏవో లావణ్య రాఖీ కట్టి దీక్షను విరమింపజేయించారు.

త్వరలో అందరికీ రుణ మాఫీ



కమర్షియల్ బ్యాంక్‌లో రుణం తీసుకున్న రైతులకు మాఫీ అవుతుంది. కానీ రైతు సేవా సహకార బ్యాంక్‌లో రుణం తీసుకున్నవారికి ఇప్పటి వరకు మాఫీ కాలేదు. రుణం తీసుకున్న రైతుల వివరాలు అఫ్‌లైన్ సిస్టంలో ఉండటం వల్ల కొంత అలస్యమైంది. అధికారులు ఆడిట్ పూర్తి చేసి అన్‌లైన్‌లో పొందుపరిచారు. నాలుగైదు రోజుల్లో రుణమాఫీ అయ్యే అవకాశం ఉంది

-ఎం.ఎ బాసిత్, ఘట్‌కేసర్ మండల వ్యవసాయ అధికారి

రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తాం



(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రుణమాఫీపై ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రూ.2 లక్షల పైన రుణం తీసుకున్నవారు.. ఆ పైన ఉన్న మొత్తాన్ని చెల్లించిన వెంటనే మాఫీ అమలవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. స్వతంత్ర భారత చరిత్రలో మరే ఇతర రాష్ట్రం ఇవ్వని విధంగా రుణమాఫీ చేశామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మొదటి పంట కాలంలోనే 22,37,848 మందికి రూ.17,933.19 కోట్లు మాఫీ చేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండగా.. 2018లో రుణమాఫీలో 2.26 లక్షల ఖాతాలకు చెందిన రూ.1419 కోట్ల సొమ్ము రిటర్న్ కాగా.. చర్యలేమీ తీసుకోలేదని గుర్తు చేశారు. ఓఆర్‌ఆర్‌ను అమ్మేసి 2018లో రుణమాఫీ డబ్బులు వేశారని ఆరోపించారు. కాగా, 2024 రుణమాఫీలో 22 వేల ఖాతాలు రిటర్న్ కాగా.. 8 వేల ఖాతాలకు తిరిగి క్లియర్ చేశామని, పటిష్ఠమైన ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇక ఈ పంటకాలం నుంచే సన్న వడ్లకు రూ.500 బోనస్ అమలు చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు దురుద్దేశపూరితంగా విమర్శలు చేస్తున్నాయని అన్నారు. రైతుల మేలు కోసం బీజేపీ ఒక్క నిర్ణయం కూడా తీసుకున్న దాఖలాల్లేవని, రుణమాఫీపై ఒక్కసారి కూడా మాట్లాడలేదని ఉత్తమ్ ధ్వజమెత్తారు. 2 లక్షల దాకా రుణమాఫీ విషయంలో ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు లేకున్నా మాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో రెండుసార్లు రుణ మాఫీ ప్రకటించిందని, 2014లో నిర్ణయం తీసుకొని నాలుగేళ్లపాటు నాలుగు వాయిదాల్లో రుణమాఫీ నిధులు విడుదల చేశారని ఉత్తమ్ విమర్శించారు. 2014-15లో రూ.4040 కోట్లు, 2015-16లో రూ.4040 కోట్లు, 2016-17లో రూ.4025 కోట్లు, 2017-18లో రూ.4038 కోట్లు విడుదల చేయగా.. ఆ నిధులన్నీ వడ్డీకే సరిపోయాయని తెలిపారు. అనంతరం 2018లో రుణ మాఫీ ప్రకటి ంచారని, కానీ.. 2018-19, 2019-20లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, 2020-21లో 2,96,571 మందికి రూ.408.3 కోట్లు, 2021-22లో 3,88,908 మందికి రూ.1339.5 కోట్లు, 2023-24లో 10,68,779 మందికి మొదటి దశలో 6763 కోట్లు, రెండో దశలో 6,07,641 మందికి 4818 కోట్లు మాఫీ చేశారని వివరించారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే సచివాలయం ఎదురుగా పెడుతున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో అంజయ్య విగ్రహాన్ని పెడతామనే కేటీఆర్ వ్యాఖ్యలపై ఉత్తమ్ స్పందిస్తూ "మళ్లీ వస్తే కదా? అధికారం కోల్పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు.

ఆ పైచిలుకు మాటేంటి?

2 లక్షల పైమొత్తం ఎప్పుడు చెల్లించాలి?.. స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వని ప్రభుత్వం

- రైతులు చెల్లించేందుకు ముందుకొస్తున్నా..
- తీసుకునేందుకు నిరాకరిస్తున్న బ్యాంకర్లు
- సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్న రైతులు
- క్యాబినెట్‌లో చర్చించాకే ప్రభుత్వం నిర్ణయం!



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తున్న ప్రభుత్వం.. రూ.2 లక్షలకు మించి తీసుకున్న రుణాల విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసినా.. పలు కారణాల వల్ల ప్రయోజనం పొందని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో.. రేషన్‌కార్డులు లేనివారు, ఆధార్ సరిపోలని వారు, ఇతర సాంకేతిక కారణాలతో రుణమాఫీ అందని వారి ఖాతాలను పరిశీలించి సమస్యను పరిష్కరించనున్నారు. కానీ, రూ.2 లక్షలకు మించి రుణం తీసుకున్న రైతుల విషయంలో మాత్రం ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయలేదు. రుణ మాఫీకి సంబంధించి జూలై 15న జారీ చేసిన జీవోలో మాత్రం రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు.. ఆ పైమొత్తాన్ని చెల్లించాలని, ఆ తరువాతే మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని పేర్కొంది. కానీ, ఆ పైమొత్తాన్ని ఎప్పుడు చెల్లించాలి? ఎప్పటివరకు చెల్లించాలి? అనే విషయం మాత్రం చెప్పలేదు. దీంతో ఇటు రైతుల్లో, అటు బ్యాంకర్లలో అయోమయం నెలకొంది. పైమొత్తాన్ని చెల్లించేందుకు కొందరు రైతులు ముందుకు వస్తున్నా.. బ్యాంకర్లు ఆ సొమ్ము తీసుకోవడంలేదు. పైమొత్తాన్ని తీసుకుంటే.. మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం ఎప్పుడు మాఫీ చేస్తుందో స్పష్టత లేనప్పుడు ఇప్పుడే తొందరపడటం ఎందుకనే అభిప్రాయంతో బ్యాంకర్లు ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన సర్క్యులర్ వచ్చిన తర్వాతే చూద్దామనే ఆలోచనతో ఉన్నారు. ఉదాహరణకు.. ఒక రైతుకు రూ.2.50 లక్షల అప్పుంటే ఆ రైతు రూ.50 వేలు చెల్లిస్తే బ్యాంకర్లు జమ చేసుకోవాలి. మిగిలిన రూ.2 లక్షలు ప్రభుత్వం మాఫీచేయాలి. కానీ, ఈ ప్రక్రియ రాష్ట్రంలో ఎక్కడా ఇంతవరకు మొదలు కాలేదు.

మాఫీపై రైతుల్లో ఆందోళన..

రూ.2 లక్షలకు మించి రుణం మాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు రైతులకు ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేసిందని, మాకెందుకు మాఫీ చేయరంటూ.. వ్యవసాయశాఖ అధికారులతో, బ్యాంకర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. కొన్నిచోట్ల జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వీరి రుణాలను ఎప్పుడు మాఫీ చేయాలి? కటాఫ్ తేదీ ఎప్పుడు పెట్టాలి? ఎంత సమయం ఇవ్వాలి? అనే అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రకటించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్నవారి కేటగిరీలో మాఫీ కోసం రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. అయితే ఈ పథకానికి పీఎం- కిసాన్ నిబంధనల్ని అమలు చేస్తుండటంతో.. రైతుల సంఖ్య, రుణమాఫీ మొత్తం గణనీయంగా తగ్గుతోంది. మొత్తంగా ఇది నాలుగైదు వేల కోట్లకు తగ్గుతుందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఈ మొత్తం నిధులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. కానీ, రూ.2 లక్షల లోపు రుణం ఉన్న ఖాతాలే ఇంకా కొన్ని క్లియర్ కాలేదు. పలు కారణాల వల్ల తిరస్కరణకు గురైన ఈ ఖాతాల కోసం కొంత బడ్జెట్‌ను కేటాయించాల్సి ఉంది. మొత్తం రుణమాఫీ అమలు కోసం ప్రభుత్వం చెప్పే రూ.31 వేల కోట్ల లెక్క ప్రకారం చూస్తే.. ఈ పథకం పూర్తిచేయడానికి ఇంకా రూ.13 వేల కోట్లు కావాలి. బడ్జెట్‌లో పెట్టిన రూ.26 వేల కోట్ల లెక్క ప్రకారమైతే.. ఇంకా రూ.8 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో నిధుల లభ్యత చూసుకొని, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

రుణమాఫీ కాలేదని అంటే.. అన్నదాతలను అరెస్టు చేస్తారా?: హరీశ్



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ కాలేదని అంటే రైతులను అరెస్టు చేస్తారా..? అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆదిలాబాద్ సహా.. ఇతర జిల్లాల్లో అన్నదాతలపై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అనుసరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో రుణమాఫీ కోసం నిరసన చేస్తున్న రైతులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పోలీసు యాక్ట్-30 పేరు చెప్పి జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని హుకుం జారీ చేయడం అన్నదాతల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. రుణమాఫీ జరగక వ్యవసాయ శాఖ కార్యాలయం, బ్యాంకులు, కలెక్టరేట్ల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల నిరసనలు తెలపకుండా రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతుల కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ కార్యాచరణ చేపడుతుందని సోమవారం ఎక్స్‌వేదికగా హరీశ్ రావు హెచ్చరించారు.

రుణమాఫీపై చర్చకు సిద్ధమా?

- హరీశ్‌రావుకు కోదండరెడ్డి సవాల్

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతు రుణ మాఫీపై బహిరంగ చర్చకు సిద్ధమేనా? అని ఎమ్మెల్యే హరీశ్‌రావుకు కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి సవాల్ విసిరారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో వ్యవసాయేతర భూములకు రైతు బంధుకింద రూ.25,676 కోట్లు ఇచ్చారని, అందులో ఎక్కువ మొత్తం ఆ పార్టీ నేతలకే వెళ్లిందన్నారు. ఓఆర్‌ఆర్ కింద వెళ్లిన భూములకూ రైతు బంధు ఇచ్చారన్నారు. ధరణితో ఎన్నో రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహమా?

తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని గతంలోనే నిర్ణయం.. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఆందోళనలు

- మేమొచ్చాకమరోచోటకు రాజీవ్ విగ్రహం
- విమానాశ్రయం పేరునూ తొలగిస్తాం
- మహిళలపై అరాచకాలు.. సీతక్కకు ఇప్పుడు గుర్తొచ్చాయా?
- రాఖీ నాడు కవిత లేకపోవడం బాధాకరం: కేటీఆర్



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ మహిళ నేతలు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలం కేటాయించిందని, ఆ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించడం తగదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజీవ్ విగ్రహ ఏర్పాటును ఒప్పుకోబోమని, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఆందోళనలు చేపడతామన్నారు. ఎ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన చోట రాజీవ్ విగ్రహం పెట్టాలనుకోవడం కాంగ్రెస్ కుసంస్కారానికి నిదర్శనమన్నారు. మాజీ సీఎం అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారని, సచివాలయం ఎదుట ఆయన విగ్రహం పెడితే బీఆర్‌ఎస్ అడ్డుకుంటుందన్నారు. నాలుగేళ్ల తర్వాత తామే అధికారంలోకి వస్తామని, అప్పుడు సచివాలయం ఎదుట ఏర్పాటుచేసిన రాజీవ్ విగ్రహాన్ని సగౌరవంగా మరోచోటకు మారుస్తామన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్ పేరును తొలగించి.. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ మహనీయుడి పేరును పెడతామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నడూ జై తెలంగాణ అనరని, భారీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయరని, కనీసం అంబేడ్కర్ జయంతి నాడు లైటింగ్ ఏర్పాటు చేయని కుసంస్కారి అని విమర్శించారు. కాగా, రాష్ట్రంలో ఆడబిడ్డలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్య సంఘటనలపై కాంగ్రెస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు స్పందించిన పాపాన పోలేదని, పలు సందర్భాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు బాధితులకు అండగా నిలిచిన తర్వాత అధికార పక్షం స్పందించిందన్నారు. ఇలాంటి అరాచకాలపై మహిళా మంత్రిగా ఎప్పుడో స్పందించాల్సిన సీతక్కకు ఇప్పుడు గుర్తొచ్చిందా.. అని ఆయన ప్రశ్నించారు. ప్రసంగ సమయంలో నోరు జారి తాను చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే క్షమాపణ చెప్పానని, ప్రపంచంలో ఏ సమస్యలూ లేనట్లు తన మాటలపై కాంగ్రెస్ నేతలు రచ్చచేయడం సరికాదని అన్నారు. కాగా, రాఖీ పండుగ నాడు సోదరి కవిత తమతో లేకపోవడం బాధాకరమని, ఇటువంటి సందర్భం ఒకటి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 155రోజులుగా జైలులో కవిత అనుభవిస్తున్న వేదనకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నామన్నారు.

శ్రీలంక మంత్రితో కేటీఆర్ భేటీ

శ్రీలంక వాణిజ్య, పర్యావరణశాఖ మంత్రి సతాశివన్ వియలేందిరన్‌తో కేటీఆర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్ వచ్చిన ఆయనను కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, జాజాల సురేందర్, దాసోజు శ్రవణ్ కలిశారు. 14ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సాధించిన తెలంగాణలో తమ పదేళ్ల పాలనను ఓ యజ్ఞంలా సాగించామని, ఈ కారణంగానే అసాధారణ ఫలితాలు సాధించినట్లు కేటీఆర్ ఆయనకు వివరించారు.

కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మాటాముచ్చట!

- మంచి ముహూర్తాన విలీనమే తరువాయి
- అందుకే అవినీతి కేసులన్నీ అటకెక్కించేశారు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్



భగత్‌నగర్ (కరీంనగర్)/మంచిర్యాల, ఆగస్టు 19: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ పెద్దలతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మంచి ముహూర్తం చూసుకొని కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ విలీనమవడమే తరువాయి అన్నారు. మాటా ముచ్చటతో సహ కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు కప్పం కూడా చెల్లించినట్లున్నారని చెప్పారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ సహా కేసీఆర్ కుటుంబంపై ఉన్న అవినీతి కేసులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించిందని తెలిపారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తామన్న వారు ఇప్పుడు ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు. విలీనంపై కాంగ్రెస్‌తో కేసీఆర్ చర్చలు పూర్తయినట్లు సమాచారం ఉందని సంజయ్ అన్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతనే లేదని చెప్పారు. రూ.40 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే చేసి సోనియానే మోసం చేశారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. ఇవన్నీ అడుగుతుంటే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమంటూ డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌ను విలీనం చేసుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదన్నారు. విలీన అవసరం కాంగ్రెస్‌కే ఉందని చెప్పారు.

పీఎంఏవై ఇళ్లపై ఇందిరమ్మ ఫొటో పెడితే నిధులివ్వం

రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద కేంద్రం ఇచ్చే నిధులతో నిర్మించే ఇళ్లపై ఇందిర, సోనియా బొమ్మలు పెడితే నిధులు ఇచ్చేది లేదని, కచ్చితంగా ప్రధాని మోదీ ఫొటో ఉండాల్సిందేనని సంజయ్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2.4 లక్షల ఇళ్ల మంజూరు చేస్తే.. ఆ నిధులను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. రాష్ట్రానికి ఎన్ని ఇళ్లయినా మంజూరు చేస్తామని, వాటిని రాజకీయాల కోసం వాడితే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.

నక్సల్ భావజాలం వల్లే విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టింది

విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించే నిలయాలుగా శిశుమందిరాలు విరాజిల్లుతున్నాయని బండి సంజయ్ అన్నారు. మంచిర్యాల జిల్లాలోని రాంపూర్ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో పాఠశాల నూతన భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో విద్యాకమిషన్‌లో నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తులు ఉండడం వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా నాశనం అయ్యే పరిస్థితి ఉందని సంజయ్ అన్నారు. ఈ విషయంలో మేధావి వర్గం జాగృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితులు ఉత్పన్నమైతే పిల్లలు తుపాకులు పట్టుకుని తిరుగుతారు తప్ప, చేతిలో జాతీయ జెండాలు పట్టుకోరని తెలిపారు.

ప్రజలు బుద్ధి చెప్పినా అహంకారం తగ్గలేదు

- మహిళా భద్రతపై మీతో చెప్పించుకునే స్థితిలో లేము
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని పోలేదని, రాఖీ పండుగ రోజు కూడా మహిళా నేతలపై నిందలు చేయడం ఆయనకే చెల్లిందని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళా భద్రతను గాలికొదిలేసి, ఇప్పు డు గాలి మాటలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. మహిళా భద్రత విషయంలో వారితో చెప్పించుకోవాల్సిన స్థితిలో తాము లేమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మహిళా భద్రత అంత లక్షణంగా ఉంటే, ఎనిమిదేళ్లలో లక్షన్నరకుపైగా నేరాలెందుకు జరిగాయని ప్రశ్నించారు. మహిళలపై అఘాయిత్యాల విషయం ఇప్పుడు గుర్తొచ్చిందా? అంటూ సీతక్కను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. తమ ప్రభు త్వం మహిళా భద్రతకు పెద్దపీట వేస్తోందని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మహిళలపై జరిగిన దాడులను బయటకు రాకుండా తొక్కిపెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దేనని ఆరోపించారు. మహిళలను రికార్డింగ్ డ్యాన్సర్లతో పోల్చడం చిన్న విషయం కాదని, కోట్ల మందిని కించపర్చడమేనని పేర్కొన్నారు.

సచివాలయం ఎదుట.. రాజీవ్ విగ్రహ ఏర్పాటు సరికాదు

- రాహుల్ గాంధీకి కవులు, కళాకారుల లేఖ

"ఉమ్మడి రాష్ట్రంలో సచివాలయం ఎదుట తెలుగుతల్లి విగ్రహం ఉండేది. తెలంగాణలో అంబేడ్కర్ పేరిట నూతన సచివాలయం నిర్మించుకున్నాం. దాని ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఉండటం న్యాయం. ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదు" అని పలువురు తెలంగాణ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రొఫెసర్ హరగోపాల్, టంకశాల అశోక్, అల్లం నారాయణ, నందిని సిధారెడ్డి, గోరటి వెంకన్న, మల్లేపల్లి లక్ష్మయ్య, దేశపతి శ్రీనివాస్, ఘంటా చక్రపాణి, కట్టా శేఖర్‌రెడ్డి, అంజనేయగౌడ్, రసమయి బాలకిషన్, అనిశెట్టి రజిత తదితరులు(వంద మంది) లేఖ రాశారు. సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్ విగ్రహాన్ని పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచన పట్ల అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సమయంలో తెలంగాణ సాంస్కృతిక ఆకాంక్షలను గౌరవిస్తామన్న రాహుల్.. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పేలా సీఎం రేవంత్ రెడ్డికి సూచించాలని కోరారు.

ఏపీలో మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ!

- త్వరలోనే సమగ్ర ప్రణాళికతో వస్తాం: ఫాక్స్‌కాన్

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ఏర్పాటుకు ఫాక్స్‌కాన్ సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసింది. త్వరలోనే దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళికతో వస్తామని స్పష్టం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం తమ సంస్థ విస్తరణకు ఏమాత్రమూ సహకరించలేదని, పైగా ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారమిక్కడ ఉండవల్లి నివాసంలో ఐటీ మంత్రి లోకేశ్‌తో ఫాక్స్‌కాన్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఇందులో ఫాక్స్‌కాన్ భారత ప్రతినిధి వీ లీ, సంస్థ చైర్మన్ కార్యాలయం డైరెక్టర్ సెంథిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ భరత్ దండి, మేనేజర్ విక్టర్ చెన్, అసోసియేట్ మేనేజర్ హన్నా వాంట్ తదితరులు ఉన్నారు. వీరంతా వస్తున్నారని తెలిసి లోకేశ్ వారికి స్వయంగా ఎదురేగి మరీ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి ఉద్యోగాలను కల్పించేందుకు ఫాక్స్‌కాన్ ప్రతినిధులు అంగీకరించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారాన్ని అందించి, త్వరితగతిన మెగా కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వారికి లోకేశ్ హామీ ఇచ్చారు. వీ లీ మాట్లాడుతూ.. పెట్టుబడుల ఆకర్షణకు సీఎం చంద్రబాబు చొరవ ప్రశంసనీయమని తెలిపారు. కానీ గడచిన ఐదేళ్లలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు.

అభిషేక్ సింఘ్వీ నామినేషన్

- రాజ్యసభ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాల సమర్పణ
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఒక్కో సెట్‌కు పది మంది చొప్పున 40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అభిషేక్ సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ సంతకాలు చేశారు. తొలి సెట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సంతకం చేశారు. సింఘ్వీ నామినేషన్ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీజేఎస్ ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు. తొలుత సీఎల్పీ కార్యాలయానికి చేరుకున్న సింఘ్వీ.. అక్కడి నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్‌కు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ వెంటనే సింఘ్వీ నేరుగా బేగంపేట విమానాశ్రయానికి వెళ్లి.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు వెళ్లారు. వాస్తవానికి ఆయన సోమవారం రాత్రి ఢిల్లీకి వెళ్లాల్సి ఉంది. కానీ, కర్ణాటకలో ముడా కుంభకోణానికి సంబంధించి ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య తరఫున హైకోర్టులో వాదనలు వినిపించాల్సి ఉండడంతో బెంగళూరుకు వెళ్లారు. కాగా, సింఘ్వీ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రావడంతో అసెంబ్లీ ప్రాంగణం కళకళలాడింది. సింఘ్వీ వెళ్లిపోయిన తర్వాత సీఎం రేవంత్.. సీఎల్పీ కార్యాలయంలోని తన చాంబర్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, నేతలతో సమావేశమై.. పిచ్చాపాటిగా మాట్లాడారు.

కేటీఆర్‌వి చిల్లర మాటలు: మధు యాష్కీ

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటు అంశంపై కేటీఆర్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. ఇందిర, రాజీవ్.. దేశం కోసం ప్రాణాలర్పించారని, వారి విగ్రహాల ఏర్పాటుపై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ఊరుకోరని పేర్కొన్నారు. అహంకారాన్ని భరించలేకనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. అధికారం పోయినా కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదేనని, దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణాలనూ ధార పోశారని కొనియాడారు. బీఆర్‌ఎస్ వాళ్లు బీజేపీ పంచన చేరితే తమకు అభ్యంతరం లేదని, రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేస్తే ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. ఒక జాతీయ స్థాయి నాయకుడిపై సంకుచిత బుద్ధితో వ్యాఖ్యలు చేయడం తగదని, కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి నిరంజన్ డిమాండ్ చేశారు.

ఓ పెద్దమనిషి, ఉన్నతాధికారి కుట్ర ఫలితమే ధరణి

- రెవెన్యూ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- ధరణి సమస్యలకు త్వరలో చరమగీతం: పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఓ పెద్దమనిషి, ఓ ఉన్నతాధికారి కలిసి కుట్ర పూరితంగా రాత్రికి రాత్రే ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. చట్టాలు సరిగా లేకుంటే దుష్పలితాలు ఎలా ఉంటాయో చెప్పడానికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన రెవెన్యూ చట్టమే నిదర్శనమని విమర్శించారు. ధరణి పేరుతో రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. త్వరలోనేతాము తీసుకురానున్న కొత్త రెవెన్యూ చట్టం ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని తెలిపారు. టూరిజం ప్లాజాలో సోమవారం ట్రెసా ఆధ్వర్యంలో నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలకు త్వరలో చరమగీతం పాడతామన్నారు. రెవెన్యూ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. భూ చట్టాల నిపుణుడు సునీల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన నష్టాలతోపాటు కొత్త చట్టం ద్వారా అందనున్న సేవలను వివరించారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ముసాయిదాపై తమ వంతుగా అన్ని మండలాల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ మాట్లాడుతూ రెవెన్యూ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

'ఆస్కి' డీజీగా నిమ్మగడ్డ బాధ్యతల స్వీకరణ

'అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కి) డైరెక్టర్ జనరల్(డీజీ)గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ సోమవారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను నిర్మించండి

- పరిశ్రమల పరిధిలో సాగును పెంచండి
- లక్ష్యాన్ని పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు: తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ కంపెనీలు వెంటనే ఫ్యాక్టరీల నిర్మాణాలు చేసి, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ మొదలుపెట్టేలా కార్యాచరణ ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం టార్గెట్ పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై 14 కంపెనీల నిర్వాహకులతో సోమవారం సచివాలయంలో తుమ్మల సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పంట ఉత్పత్తి చేస్తూ, ఇతర రాష్ట్రాలకు ఆయిల్ పామ్ గెలలను తరలించేందుకు తమ ప్రభుత్వం అనుమతించదని తెలిపారు. అన్ని కంపెనీలు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఫ్యాక్టరీ పూర్తయ్యే నాటికి ఫ్యాక్టరీ పరిధిలో కనీసం 10 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ గెలలు వచ్చేలా సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. 2024-25 సంవత్సరానికి గాను లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ప్రణాళిక చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 12,448 ఎకరాల్లో మాత్రమే సాగులోకి తేవడం పట్ల మంత్రి తుమ్మల అసహనం వ్యక్తం చేశారు.

15కల్లా ఆర్ఆర్ఆర్ భూ సేకరణ పూర్తి!

- రైతులకు మంచి ధరలు ఇప్పించేందుకు యత్నిస్తున్నాం
- ఉత్తర భాగం భూ సేకరణకు సహకరించాలి
- హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణకు త్వరలో డీపీఆర్
- అధికారులతో సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి భూ సేకరణ ప్రక్రియను సెప్టెంబరు 15 కల్లా పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. రైతుల భూములకు మంచి ధరలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, భూ సేకరణకు సహకరించాలని కోరారు. సోమవారం ఆయన సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖతో పాటు రాష్ట్రంలోని జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి కావాల్సిన 1941.65 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని కోమటిరెడ్డి తెలిపారు. రోడ్డు నిర్మాణంలో ఇప్పటివరకు ఇబ్బందిగా మారిన అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూముల కింద మహబూబాబాద్ జిల్లాలో 73.04 హెక్టార్ల అటవీయేతర భూములను కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని ఆరు వరసలుగా విస్తరించే ప్రక్రియ వేగంగా సాగుతోందన్నారు. డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్లను నియమించేందుకు కేంద్రం ఇప్పటికే టెండర్లు పిలిచిందని తెలిపారు. అలాగే ఈ రహదారిపై గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్ల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు సూచించారు. ఈ పనులకు రూ.422.12 కోట్లను వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇక మన్నెగూడ జాతీయ రహదారి నిర్మాణ టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు ఈ వారంలోనే తేదీని ఖరారు చేస్తామని చెప్పారు. నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. అయితే పనుల ప్రారంభానికి తేదీ వచ్చేలోగా పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కోదండరాంను సత్కరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ నేతలు

ధరణి పేరిట భూముల స్వాహా: కోదండరాం

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధరణి పేరిట ఒక కుటుంబం భూములను స్వాహా చేసిందని ఎమ్మెల్సీ కోదండరాం ఆరోపించారు. తెలంగాణ భూ రికార్డులను కూడా ధ్వంసం చేశారని మండిపడ్డారు. రవీంద్రభారతిలో రెవెన్యూ ఉద్యోగులు నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటూ అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గత పాలకులు అప్రకటిత నిర్బంధం ప్రకటించారని, సమస్యలు చెప్పుకొనే అవకాశం కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారన్నారు. భూ చట్టాల నిపుణుడు సునీల్ మాట్లాడుతూ కీలకమైన రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చే ముందు కోదండరాం మండలిలో అడుగుపెడుతుండడం సంతోషంగా ఉందన్నారు. రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో కోదండరాం కీలక పాత్ర పోషించాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి ఆకాంక్షించారు.

22న ఈడీ ఆఫీసుకు నిరసన ర్యాలీ: టీపీసీసీ

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అదానీ కంపెనీ షేర్ల విలువను కృత్రిమంగా పెంచుకునేందుకు జరిగిన ప్రయత్నంపై జేపీసీ వేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 22న అమరవీరుల స్థూపం నుంచి ఈడీ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించనున్నట్లు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోనూ నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- చిన్నారి దుర్గకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- సాయం చేయాలని నిర్మల్ కలెక్టర్‌కు ఆదేశాలు

తానూర్/హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తల్లి ఆత్మహత్యతో అనాథగా మారిన చిన్నారి దుర్గకు సీఎం రేవంత్‌రెడ్డి బాసటగా నిలిచారు. విద్య, వైద్యంతోపాటు ఇతర సౌకర్యాలు అందించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష్‌కు ఆదేశాలు జారీ చేశారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని చిన్నారికి తన మాటగా చెప్పాలని సూచించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడాకు చెందిన మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడగా... తల్లి అంత్యక్రియల కోసం డబ్బుల్లేక పదకొండేళ్ల కుమార్తె దుర్గ భిక్షాటన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆమె తండ్రి కూడా గతంలోనే మృతి చెందడంతో ఆ చిన్నారి అనాథగా మారింది. దీనిపై "అమ్మ అంత్యక్రియలకు కూతురి భిక్షాటన" శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి.. కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ అభిలాష్.. బాలిక తల్లి అంత్యక్రియల కోసం రూ.10వేలు అందజేశారు. బాలికను గురుకుల పాఠశాలలో చేర్పుతామని, ఇతర సమస్యలేమైనా ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం బాలికకు అండగా నిలిచారు. ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని తానూర్ తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, స్థానిక నాయకులు సతీష్‌రెడ్డి, చిన్నారెడ్డి ద్వారా దుర్గకు అందజేశారు. ఆ తర్వాత వీడియో కాల్ ద్వారా బాలికతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. ప్రతి నెలా ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు త్వరలోనే ఇంటిని కూడా కట్టిస్తానని హామీ ఇచ్చారు. దుర్గ ఎంత వరకు చదివితే అంత వరకు చదివిస్తానన్నారు. ముధోల్ పర్యటనకు వచ్చినప్పుడు కలుస్తానని బాలికకు మాట ఇచ్చారు. దుర్గ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క.. వ్యక్తిగతంగా రూ.50వేలు అందజేశారు. మరోవైపు.. బాలికను ఆదుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. చిన్నారి దుర్గకు ఐక్యత సేవా సమితి సభ్యులు రూ.41వేలు అందజేశారు. బీజేపీ తానూర్ మండల అధ్యక్షుడు యాతాళం చిన్నారెడ్డి రూ. 5వేలు అందించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌పటేల్, విఠల్‌రెడ్డి తదితరులు బాలికను పరామర్శించారు.



వీడియో కాల్ ద్వారా మంత్రి కోమటిరెడ్డితో మాట్లాడుతున్న బాలిక దుర్గ

టార్గెట్ ఒలింపిక్స్

(మొదటి పేజీ తరువాయి)

కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శరీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు అనువైన వేదికగా మార్చాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులకు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలని అన్నారు. విజేతల్లో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలని చెప్పారు.

ఆరు క్రీడలకు ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ ఆరింటి తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని చెప్పారు. యూనివర్సిటీలో వసతులు, ఆహారం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందించాలని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. వారందరికీ శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధన కూడా ఉంటుందని, క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.



సీఎం రేవంత్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి సీతక్క

విజేతలను అధ్యయనం చేయండి

హైదరాబాద్ స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశా క్రీడారంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ చెప్పారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన వివిధ దేశాల క్రీడాకారులను అధ్యయనం చేయాలన్నారు. పతకాల సాధనకు వారు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

తెలంగాణలోనే కొనసాగుతాం

- తేల్చిచెప్పిన సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కేన్స్ సీఈవో రఘు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే కొనసాగుతామని సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ తేల్చి చెప్పింది. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని ఆ సంస్థ సీఈవో రఘు పణికర్ స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 23న కొంగరకలాన్‌లో అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్ ప్రారంభోత్సవానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. కాగా, సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఓశాట్ యూనిట్ ఇండియన్ సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం) పరిశీలనలో ఉందని, అనుమతి రాగానే ఓశాట్ యూనిట్ పనులను ప్రారంభిస్తామని రఘు పణికర్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు పూడికతీత ఆదాయం

- ఆదాయ వనరు కోణంలో రిజర్వాయర్లలో పూడికతీత
- మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్లు, డ్యామ్‌లలో పేరుకుపోయిన పూడికను ఆదాయ వనరుల కోణంలోనే తీయాలని, ఆ నిధులను ప్రాజెక్టుల నిర్వహణకు వెచ్చించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ప్రాజెక్టుల్లో పూడికతీతపై సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. దీనికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. పూడికతీత విషయంలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్నే రాష్ట్రంలోనూ అనుసరించాలని, దీనికోసం ప్రాజెక్టుల్లో పూడిక ఏ మేరకు ఉందనే అంశంపై శాటిలైట్ చిత్రాలతోపాటు బాతోమేటిక్ అధ్యయనాలతో ఒక అభిప్రాయానికి రావాలని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఆదాయ సమీకరణ కోణంలోనే టెండర్లు పిలవాలని, ఏకకాలంలో పూడికతీతపై నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించారు. పూడికతీతతో జలాశయాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్వ దశకు తీసుకెళ్లడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రభుత్వంపై అదనంగా భారం పడకుండా చూసుకోవడం వంటి వాటిపై దృష్టిసారించాలన్నారు. ఇందుకు రెండు కమిటీలు వేయాలని.. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కాలుష్య నియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులతో ఒక కమిటీని, హైడ్రాలజీ, డ్యామ్ సేఫ్టీ, డిజైన్లకు చెందిన నిపుణులతో అంతర్గత సాంకేతిక కమిటీని వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అక్కర్లేదని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఇచ్చిన ఉత్తర్వులు, మార్గదర్శకాలకనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. పూడికతీత కాంట్రాక్ట్ ఈపీసీ విధానంలో పిలవాలని, అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచి, పనులను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని నిర్ణయించారు. కాగా మానేరు నదిలో ఇసుక తీతపై ఎన్జీటీ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం వంటి అంశాలపైనా కమిటీ చర్చించింది.

టీచర్ల నియామకాల్లో 'వర్గీకరణ' లేనట్టే!

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అవసరమైతే ఇప్పటికే నోటిఫికేషన్లను ఇచ్చిన పోస్టుల భర్తీలోనూ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై అధికారులు కొంత అధ్యయనం చేశారు. టీచర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల అమలుపై స్పష్టత ఇచ్చారు. దానికి విరుద్ధంగా ఇప్పుడు రిజర్వేషన్లను అమలు చేస్తే.. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని భావిస్తున్నారు. అదే జరిగితే ఈ పోస్టుల భర్తీ తీవ్ర ఆలసమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగానే రిజర్వేషన్లను అమలు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

రాష్ట్రంలో భర్తీ చేస్తున్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు

పోస్టు	సంఖ్య
ఎస్ఏ	2,629
ఎస్‌జీటీ	6,508
భాషా పండితులు	727
పీఈటీలు	182
ఎస్ఏ (స్పెషల్ కేటగిరీ)	220
ఎస్‌జీటీలు (స్పెషల్ కేటగిరీ)	796
మొత్తం	11,062

మరోవైపు ఇప్పటికే ప్రకటనలు ఇచ్చిన పోస్టుల విషయంలో ఎస్సీ వర్గీకరణ అమలు సాధ్యం కాదని న్యాయ శాఖ అధికారులు కూడా స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. దీంతో డీఎస్సీ పోస్టుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలును పక్కన పెట్టాలని నిర్ణయించారు. ఉపాధ్యాయ పోస్టులను 95 శాతం స్థానికులతో, 5 శాతం అందరి (నాన్‌లోకల్)తో భర్తీ చేయనున్నారు. ఈ నాన్‌లోకల్ కోటాలో ఎక్కువగా తెలంగాణతో పాటు ఏపీకి చెందిన అభ్యర్థులు అర్హత పొందే అవకాశం ఉంది. అయితే, జిల్లాలు, సబ్జెక్టుల వారీగా ఉన్న పోస్టుల సంఖ్యను పరిశీలిస్తే ఈ నాన్‌లోకల్ కోటాలో ఎక్కువ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక డీఎస్సీ పరీక్షలను రాష్ట్ర యూనిట్‌గా నిర్వహించారు. పోస్టుల భర్తీని మాత్రం జిల్లా యూనిట్‌గా చేపట్టనున్నారు. దీంతో మెరిట్ జాబితాలనూ జిల్లాల వారీగా రూపొందించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో టీచర్ పోస్టుల భర్తీని చేపట్టనున్నారు.

న్యాయవాది మీద పోలీసుల దాడిపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది పి. సంతోష్‌పై పోలీసుల దాడికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆదేశించారు. బెల్టు షాప్ నడిపిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఈ నెల 14న బోరబండ పోలీసులు సంతోష్ ఇంటికి వచ్చారు. పోలీసులు చట్టవిరుద్ధంగా తలుపు పగులగొట్టే ప్రయత్నం చేయడంతో ఆయన అడ్డుకున్నారు. సంతోష్‌పై పోలీసులు దాడి చేయడంతో అతని చేయి విరిగింది. అదే స్థితిలో ఆయనను స్టేషన్‌కు తరలించారని హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి సీజే దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడితో పాటు వీరి విజ్ఞప్తిని పరిశీలించిన సీజే.. వివరాలు తెలుసుకుని చెప్పాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

5 వేల కోట్లతో 'సమీకృత గురుకులాలు'

రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో 120 భవనాలు.. 8 నెలల్లో పూర్తి చేయాలన్నది లక్ష్యం

- భూ సేకరణ, డిజైన్లను పూర్తి చేయాలి
- హాస్టళ్లలో ప్రతి విద్యార్థికీ మంచం ఇవ్వాలి
- వసతుల కల్పనపై 29లోగా నివేదికివ్వాలి
- గురుకులాలపై సమీక్షలో డిప్యూటీ సీఎం

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయతలపెట్టిన సమీకృత గురుకులాలకు అవసరమైన భూములను సేకరించాలని, త్వరితగతిన డిజైన్లను పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సమాహారంగా ఈ సమీకృత గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సోమవారం సచివాలయంలో ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల సంస్థల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5 వేల కోట్ల వ్యయంతో 30 చోట్ల 120 సమీకృత గురుకుల భవనాలను నిర్మించనున్నామని తెలిపారు. ఒకే సముదాయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఉంటాయని చెప్పారు. ఈ బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట వేశామన్నారు. సమీకృత గురుకులాలకు గ్రామీణ ప్రాంతాల్లో 15-25 ఎకరాలు, పట్టణ ప్రాంతాల్లో 10-15 ఎకరాల భూములు అవసరమవుతాయని, ఆ మేరకు భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 8 నెలల్లో ఈ భవనాలను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా స్థలాలను సేకరించి, డిజైన్లను ఖరారు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో 100 శాతం అడ్మిషన్లను పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉండే ప్రతి విద్యార్థికీ మంచాన్ని కేటాయించాలని, ఎవరూ కింద పడుకోవడానికి వీల్లేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని 1029 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో మంచాలు, దుప్పట్లు ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎన్ని కావాలి? అన్న వివరాలను సమర్పించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, హాస్టళ్లకు అవసరమైన మరుగుదొడ్లు, స్నానాల గదులు, నీరు, విద్యుత్తు వంటి సదుపాయాలన్నింటినీ కల్పించాలని చెప్పారు. ఈ సదుపాయాల కల్పనపై ఈ నెల 29లోగా నివేదికలు ఇవ్వాలన్నారు. గురుకుల భవనాల అద్దె డబ్బును త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విజ్ఞప్తికి భట్టి సానుకూలంగా స్పందించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ శాఖల్లోని ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల బకాయిల వివరాలను పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది బీసీ విద్యార్థులు 800 మందికి, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు 500 మందికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులను అందజేస్తామని తెలిపారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలను ఇటీవల తాను సందర్శించిన అనంతరం అక్కడ చేపట్టిన చర్యల గురించి సంస్థ కార్యదర్శి రమణకుమార్‌ను అడిగారు. విద్యార్థులకు మంచాలు, దుప్పట్లు, ఇతర సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని భట్టి ఆదేశించారు.



సర్కారీ వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తాం

- జూడాలతో మంత్రి దామోదర
- మంకీపాక్స్‌పై భయపడనక్కర్లేదు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నివారణ మందులు అందుబాటులో ఉంచాలి
- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సర్కారీ దవాఖానాల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి అవసరమైన భద్రత కల్పిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జూనియర్ డాక్టర్లకు తెలిపారు. సోమవారం తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిశారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో మహిళా డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఆస్పత్రి సిబ్బందికి అవసరమైన భద్రత చర్యలు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. బోధన ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి రక్షణగా ఏర్పాట్లు చేయాలని విన్నవించారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఎస్పీఎఫ్‌తో భద్రత కల్పించాలని, ఆస్పత్రుల్లో సీసీటీవీ, శిక్షణ కలిగిన సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని మంత్రిని కోరారు. ఆస్పత్రుల్లో నియమించే కమిటీల్లో జూనియర్ డాక్టర్లను సభ్యులుగా చేర్చాలన్నారు. జూడాల వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రికి వినతి పత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము రాహుల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఇసాక్ న్యూటన్, మహిళా డాక్టర్లు ఉన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం సమర్పిస్తున్న తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మరోవైపు మంకీ పాక్స్‌పై మంత్రి దామోదర సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్రంలో మంకీపాక్స్ నివారణ చర్యలకు అవసరమైన మెడికల్ కిట్స్, మందులు, ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంకీపాక్స్ నివారణకు వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంకీపాక్స్ గురించి ప్రజలు భయపడాల్సిన అవసరంలేదన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను అందుబాటులో ఉంచేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంకీపాక్స్ వైరస్ నివారణ మందులు, అవసరమైన కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

15 రోజులకు సిబ్బంది హాజరుపై నివేదిక

ప్రజారోగ్యశాఖ, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) శాఖలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వీటి పరిధిలోని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు సెక్యూరిటీ, శానిటేషన్, డైట్, లాండ్రీ సేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆస్పత్రుల భవనాల స్థితిగతులు, ఆస్పత్రి సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించడానికి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఆస్పత్రులను సందర్శించి ప్రతి 15 రోజులకోసారి నివేదికను సమర్పించాలన్నారు. ఆస్పత్రుల్లో సిబ్బంది వేతనాలు ప్రతి నెల చెల్లించేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్యపు డ్రైవింగ్

» ఆడుకుంటున్న బాలుడిని ఢీకొట్టిన కారు

» కిందపడ్డాడని కుటుంబసభ్యులను నమ్మించిన నిందితుడు

» మీర్‌పేట్‌లో దారుణం



దీక్షిత్(ఫైల్)

సరూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నిర్లక్ష్యపు డ్రైవింగ్.. రెండేళ్లు కూడా నిండని బాలుడి నూరేళ్ల జీవితాన్ని చిదిమేసింది. వరికుప్పల రామకృష్ణ, జ్యోతి దంపతులు మీర్‌పేట్ హస్తినాపురం జడ్పీ రోడ్డులోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బాబు దీక్షిత్(22నెలలు) గేటు బయట ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఇంటి యజమాని కొత్తకాపు దినేశ్‌రెడ్డి తన టాటా హారియర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి, ఆడుకుంటున్న దీక్షిత్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు రెండు టైర్లు బాబు పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే దినేశ్‌రెడ్డి బాబును తీసుకుని జ్యోతి వద్దకు వెళ్లి 'మీ బాబు బయట కిందపడ్డాడు... బాగా గాయాలయ్యాయి' అని చెప్పాడు. అనంతరం దినేశ్ తన కారులో బాబును ఆస్పత్రికి తరలించాడు. దీక్షిత్ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించాడు. కాగా, సోమవారం ఉదయం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా దినేశే యాక్సిడెంట్ చేసినట్లు తెలిసింది. దీంతో బాలుడి తండ్రి రామకృష్ణ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసలు విషయం బయట పడడంతో దినేశ్‌రెడ్డి పరారయ్యాడు.

డెంగీతో జూనియర్ అసిస్టెంట్ మృతి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 19: డెంగీతో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన నల్లూరి రాజేశ్(27) నాలుగేళ్లుగా డీజీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఐదు రోజుల నుంచి డెంగీ లక్షణాలతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లగా అదే సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. కుటుంబసభ్యులు వైద్యులకు సమాచారం అందించడంతో అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఆరేళ్ల క్రితం రాజేశ్ అన్న ఆదిత్య సాయికుమార్ భద్రాద్రి కొత్తగూడెం చర్ల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో చేతిలోని గన్ మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందాడు. ఇద్దరు కుమారులు మృతి చెందడంతో తల్లి ప్రభావతి కన్నీరుమున్నీరయ్యారు.

ఆర్టీసీ బస్సులో ప్రసవం



జన్మించిన బిడ్డతో కండక్టర్ భారతి

గద్వాల/వనపర్తి టౌన్, ఆగస్టు 19 : ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్తున్న ఆ గర్భిణికి ఆర్టీసీ బస్సే ఆస్పత్రి అయింది.. కండక్టర్ చొరవతో నర్సు డాక్టరయింది. వెరసి.. పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లికి చెందిన సంధ్య నిండుగర్భిణి, భర్త రామాంజనేయులుతో కలిసి ప్రసవం కోసం వనపర్తిలోని ఆస్పత్రికి వెళ్లేందుకు సోమవారం ఉదయం గద్వాలలో వనపర్తి డిపో బస్సు ఎక్కింది. పెబ్బేరు దాటిన తర్వాత నాచహల్లినికి రాగానే ఆమెకు పురిటినొప్పులు ప్రారంభం అయ్యాయి. స్పందించిన కండక్టర్ భారతి బస్సును రోడ్డు పక్కకు ఆపివేయించింది. బస్సులో ఉన్న అలివేలమ్మ అనే నర్సు పురుడుపోయడానికి సిద్ధం అయ్యింది. పురుష ప్రయాణికులను కిందకు దించివేసి గర్భిణికి ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. సంధ్యకు సురక్షితంగా కాన్పు చేసిన కండక్టర్ భారతి, నర్సు అలివేలమ్మకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు తెలిపారు.

బంధాలను వదులుకోలేని మధుర బంధమే రక్షా బంధన్: షర్మిల

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షాబంధనమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. సోమవారం రక్షా బంధన్‌ను పురస్కరించుకుని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "నా జీవితంలో, రాజకీయ ప్రస్థానంలో అడుగడుగునా అండగా ఉంటూ.. రక్త సంబంధం లేకపోయినా వైఎస్ఆర్ అనే బంధంతో నాకు తోబుట్టువుల్లాగా నిలబడి, అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. రక్షణగా నిలబడిన ప్రతి అన్నకు, ప్రతి తమ్ముడికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. వెలకట్టలేని అనుబంధాలను గుర్తు చేసే మధురబంధమే రక్షాబంధనం. దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలని ప్రార్థన" అని షర్మిల పేర్కొన్నారు.

ఐఐటీ-జేఈఈ, నీట్ డిజిటల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ-2025 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'కోటా' డిజిటల్ మెటీరియల్ సిద్ధమైంది. ఈమేరకు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఈ డిజిటల్ మెటీరియల్‌లో 2025కు సంబంధించిన స్టడీ మెటీరియల్ (కాన్సెప్ట్స్, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు), 2025 'కోటా' గ్రాండ్ టెస్టులు, కోటా' ప్రీవియస్ టెస్టులు, సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్ టెస్టులు, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొంది. వాట్సాప్ ద్వారా పొందే వారు NEET 25 అని, జేఈఈ వారు JEE 25 అని టైపు చేసి 9849016661 కు వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

హనుమకొండ సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఎత్తివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 19: మావోయిస్టుల ప్రభావం తగ్గిన నేపథ్యంలో హనుమకొండ పలివేల్పుల రోడ్డులో ఉన్న 58వ సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ను శాశ్వతంగా ఎత్తివేస్తూ కేంద్ర సీఆర్పీఎఫ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ బెటాలియన్ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 1,100 మంది జవాన్లు పని చేస్తున్నారు. దీనిని మణిపూర్‌కు తరలించాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీలోగా జవాన్లు పూర్తిగా తరలివెళ్లనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువున్న సమయంలో 1990లో కాకతీయ వర్సిటీ స్థలంలో ఈ బెటాలియన్‌ను ఏర్పాటు చేశారు. వరంగల్‌లో మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో బెటాలియన్‌ను తరలించాలని నిర్ణయించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి

» సుమారు రూ.2కోట్ల అప్పులు చేసిన వైనం

» సాగర్ ఎడమ కాల్వలో దూకి బలవన్మరణం

నల్లగొండ, పెన్‌పహాడ్, ఆగస్టు 19: ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం చేసిన అప్పుల ఊబి నుంచి బయటపడలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్లగొండ పట్టణానికి చెందిన తడకమళ్ల సోమయ్య కిరాణ దుకాణం నిర్వహిస్తుండగా.. ఆయన కుమారులు సాయికుమార్(28), సంతోష్ వ్యాపారంలో సహకరించేవారు. అయితే ఆన్‌లైన్‌లో బెట్టింగ్ చేస్తూ సాయికుమార్ సుమారు రూ.2కోట్లు అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారు కొద్దికాలంగా ఇంటి వద్దకు వచ్చి ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14న బయటకు వెళ్లిన సాయికుమార్ ఇంటికి తిరిగిరాకపోవటంతో సోదరుడు సంతోష్ 17న నల్లగొండలోని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి హాలియా చెక్‌పోస్టు వద్ద ఉన్న 14వ మైలురాయి సమీపంలో సాయికుమార్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉన్నట్టు తెలుసుకున్నారు. అయితే సాగర్ ఎడమకాల్వ వద్ద ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ ఉంచి కాల్వలో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. సోమవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామసమీపంలోని సాగర్ ఎడమకాల్వలో మృతదేహం తేలటంతో పెన్‌పహాడ్ పోలీసులు మృతుడి కుటుంబానికి సమాచారమిచ్చారు.

రాష్ట్రాలకు రూ.10వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సాయం అందించనున్నట్లు ప్రకటించింది. మూలధన పెట్టుబడుల కింద ఈ నిధులు అందిస్తామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలను పంపింది. భూ దస్త్రాల్లో పారదర్శకతకు పెద్దపీట వేసి, డిజిటల్ రికార్డులు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మెరుగైన సంక్షేమ పథకాలను అందించడం, గ్రామాల్లోనూ పారిశ్రామిక ప్రగతికి ఉన్న అవకాశాలను మెరుగుపరచడం, పట్టణ ప్రాంతాల్లో భూ దస్త్రాల్లో ఉన్న లొసుగులను సరిదిద్ది పెట్టుబడులను ఆకర్షించడం, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, పెట్టుబడిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేయడమే ప్రధాన ఉద్దేశమని మార్గదర్శకాల్లో పేర్కొంది. గ్రామీణ భూముల సంస్కరణలకు సంబంధించి ప్రధానంగా రెండు అంశాలపై దృష్టిపెట్టాలని తెలిపింది. అందులో ఒకటి భూ పరిపాలన, ప్రణాళిక, నిర్వహణ కాగా.. రెండోది అర్బన్ ప్లానింగ్, వినియోగం, బిల్డింగ్ చట్టాలు. గ్రామీణ భూముల దస్త్రాల విషయంలో ప్రతి భూమికీ యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబరు (యూఎల్‌పీఐఎన్) లేదా భూ-ఆధార్ కార్డులు ఇవ్వడం, పటాలను డిజిటలైజ్ చేయడం, ప్రస్తుతం ఉన్న భూ యజమానుల వివరాలకు సంబంధించి సబ్ డివిజన్ల వారీగా సర్వే మ్యాపులు అందుబాటులో ఉంచడం, భూ రిజిస్టర్లను ఏర్పాటు చేయడం, దీన్ని రైతుల రిజిస్టర్‌తో లింక్ చేయడం వంటి పనులు చేయాలని వివరించింది. దీనివల్ల రైతులకు అందించే రుణాలు, ఇతర వ్యవసాయ పథకాల అమలుపై ప్రభుత్వానికి స్పష్టత ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొంది. రికార్డులను డిజిటలైజ్ చేస్తే రైతు సాధికారత పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని, అలాగే రుణపరపతి పెంచేందుకు, అవసరమైన వ్యవసాయ సేవలను ప్రభుత్వాలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు.

పట్టణ భూములకు జీఐఎస్ మ్యాపింగ్

పట్టణాల్లో ఉండే భూములకు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్) మ్యాపింగ్ ఐటీ ఆధారిత ప్రాపర్టీ రికార్డు నిర్వహణ, ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్, రికార్డుల ఆధునికీకరణ వంటివి చేపట్టాలని కేంద్ర మార్గదర్శకాల్లో తెలిపింది. ఈ మార్పులు తీసుకురావడం వల్ల పట్టణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంటుందని వివరించింది. పట్టణ భూ రికార్డుల్లో పారదర్శకత, పట్టణాల్లో ఆస్తి పన్ను చెల్లించే భూముల వివరాలపై స్పష్టత ఇవ్వడం ద్వారా పట్టణ ప్రణాళికకు అవసరమైన కార్యక్రమాల అమలుకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకావనేది ప్రధాన ఉద్దేశం. పట్టణ భూములకు సంబంధించి యజమానుల వివరాలతో కలిపి ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్ (ఓఆర్ఐ) తయారు చేస్తే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఓఆర్ఐ ఆధారంగా ల్యాండ్ పార్సిళ్లు ఏర్పాటు చేయవచ్చని, 3డీ మ్యాప్స్ రూపొందించి పట్టణ ప్రాంతాల్లో నిర్మాణ పరమైన సవాళ్లను అధిగమించే అవకాశం ఉందని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఇదే ఓఆర్ఐ ఆధారంగా పట్టణ ప్రగతికి అవసరమైన మాస్టర్‌ప్లాన్స్ తయారీకి వినియోగించుకోవచ్చని తెలిపింది. భూ దస్త్రాల్లో సంస్కరణలు చేసిన రాష్ట్రానికి ఒకే విడతలో మొత్తం నిధులు మంజూరు చేస్తామని ఆర్థిక శాఖ పేర్కొంది.

రక్తశుద్ధిపై చిత్తశుద్ధి

(మొదటి పేజీ తరువాయి)



సిద్ధమైంది. రాష్ట్రంలో కిడ్నీ ఫెయిల్యూర్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డయాలసిస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 85 కేంద్రాలున్నప్పటికీ అవి సరిపోని పరిస్థితి. దీంతో కొన్ని కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ డయాలసిస్ సెషన్స్ నడుస్తున్నాయి. కొన్ని రక్తశుద్ధి కేంద్రాలపై రోగుల భారం ఎక్కువగా ఉంటోంది. బాధితులు కొన్నిసార్లు డయాలసిస్ కోసం 30 కిలోమీటర్ల దూరానికి మించి ప్రయాణం చేయాల్సిన సందర్భాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు వైద్య శాఖ సమాయత్తమైంది. వీటివల్ల బాధితులు ఎక్కువ దూరాలు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదు. అలాగే 4-5 షిఫ్టుల్లో డయాలసిస్ సేవలందిస్తున్న కేంద్రాలపై భారం కూడా తగ్గుతుంది. కొత్త కేంద్రాల ఏర్పాటుతో డయాలసిస్ రోగులు వేచిచూడాల్సిన సమయం బాగా తగ్గుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

నాలుగు ప్రాంతీయ వాస్క్యులర్ యాక్సెస్ కేంద్రాలు...

రెండు మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్న రోగులకు తప్పనిసరిగా రక్తశుద్ధి చేయాలి. వారి పరిస్థితిని బట్టి వారానికి రెండు నుంచి మూడు సార్లు డయాలసిస్ అవసరం అవుతుంది. తొలిసారి డయాలసిస్ చేయాల్సివచ్చినప్పుడు రోగికి మొదట ఒక శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. డయాలసిస్‌కు యాక్సెస్ పాయింట్‌ను రూపొందించే సర్జరీ ఇది. సాధారణంగా చేతి మణికట్టు దగ్గర చేస్తారు. రక్తప్రసరణ వ్యవస్థకు చికిత్స చేయడంలో నైపుణ్యం కలిగిన వాస్క్యులర్ సర్జన్ ఈ సర్జరీ చేస్తారు. ఒక్కసారి మణికట్టు వద్ద ఈ యాక్సెస్ పాయింట్‌ను ఏర్పాటు చేయించుకుంటే.. ఆ తర్వాత డయాలసిస్ చేయడం చాలా సులభతరం అవుతుంది. ప్రస్తుతం ఈ వాస్క్యులర్ సర్జరీ చేయించుకోవడానికి కిడ్నీ పేషెంట్లు కచ్చితంగా హైదరాబాద్ రావాల్సిన పరిస్థితి ఉంది. అలా కాకుండా.. రాష్ట్రానికి నలుదిక్కులా ఈ వాస్క్యులర్ యాక్సెస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ పట్టణాల్లో వీటిని అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. అలాగే హైదరాబాద్‌లో డయాలసిస్ కోసం ఏర్పాటు చేసిన మూడు హబ్ ఆస్పత్రులైన నిమ్స్, గాంధీ, ఉస్మానియాలలో వీటిని అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకోసం ఒక్క నిమ్స్ కేంద్రానికే అత్యధికంగా రూ.9.82 కోట్లు, గాంధీకి రూ.9.43 కోట్లు, ఉస్మానియాకు రూ.9.41 కోట్లు కేటాయించారు. ఏడు కేంద్రాలకూ కలిపి రూ.32.70 కోట్లు ఖర్చు అవుతుందని తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ) అంచనా వేసింది. అందుకు సంబంధించిన నివేదికను ఇప్పటికే ఆరోగ్యశ్రీ సీఈవోకు పంపింది.

అదనపు డయాలసిస్ మిషన్లు..

ఇప్పటికే ఉన్న కేంద్రాల్లో రోగులకు తాకిడి ఎక్కువగా ఉండటంతో వాటిలో అదనపు యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలా ఏర్పాటు చేస్తున్న వాటిలో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో ఒకటి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆస్పత్రి పరిధిలో పాల్వంచ, చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదు, కోరుట్ల ప్రాంతీయ ఆస్పత్రిలో ఐదు, గద్వాల జిల్లా ఆస్పత్రిలో 2, హుజురాబాద్ ఏరియా ఆస్పత్రిలో 5, సత్తుపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో 5, మహబూబాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ఒక్కోచోట ఐదేసి చొప్పున, మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో 4, నిజామాబాద్ జిల్లా ఆస్పత్రిలో 2, జహీరాబాద్ ప్రాంతీయ ఆస్పత్రిలో 5, సిద్దిపేట జీజీహెచ్‌లో 10, హుజుర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో 5, భువనగిరి జిల్లా ఆస్పత్రిలో 3, వరంగల్ జిల్లా నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో 2 అదనపు డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేస్తున్నారు.

కిడ్నీ పేషెంట్లకు ఊరట



రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలు, మిషన్ల సంఖ్యను పెంచుతున్నాం. మొత్తం కేంద్రాల సంఖ్య 102, మిషన్ల సంఖ్య 730కు చేరబోతున్నాయి. దీంతో డయాలసిస్ కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. సహాయకుల అవసరం లేకుండానే కేంద్రాలకు వెళ్లి రక్తశుద్ధి చేయించుకోవచ్చు. డయాలసిస్ కోసం వేచిచూసే సమయం కూడా బాగా తగ్గుతుంది. దీంతో వారికి భారీ ఉపశమనం కలుగుతుంది.

\- మంత్రి దామోదర

కొత్త డయాలసిస్ కేంద్రాలు..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సీహెచ్‌సీ, హైదరాబాద్‌లో యూసీహెచ్‌సీ అంబర్‌పేట, సీహెచ్‌సీ బార్కాస్, ఖమ్మం జిల్లా మధిర ప్రాంతీయ ఆస్పత్రి, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సీహెచ్‌సీ, మెదక్ జిల్లాలో తూప్రాన్ సీహెచ్‌సీ, నర్సాపూర్ ప్రాంతీయ ఆస్పత్రి, మేడ్చల్ జిల్లాలో మల్కాజ్‌గిరి, మేడ్చల్ సీహెచ్‌సీలు, నల్గొండ జిల్లా మర్రిగూడ సీహెచ్‌సీ, రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్, ఉప్పల్ సీహెచ్‌సీ, కొండాపూర్ ఏరియా ఆస్పత్రి, సంగారెడ్డి జిల్లాలో పఠాన్‌చెరు ప్రాంతీయ ఆస్పత్రి, సదాశివపేట సీహెచ్‌సీ, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సీహెచ్‌సీలో కొత్తగా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐదు నుంచి 10 పడలకతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఆ 4 వైద్య కాలేజీలకు అనుమతులివ్వండి

» నేడు ఎన్ఎంసీని కోరనున్న అధికారులు

» అనుమతులు రాకుంటే ఈ ఏడాది వైద్య సీట్ల భర్తీ లేనట్లే!

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మరో నాలుగు కొత్త మెడికల్ కాలేజీల అనుమతుల కోసం డీఎంఈ అధికారులు ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూలైలో కొత్తగా 8 మెడికల్ కాలేజీలకు ఏర్పాటు చేసింది. వీటి అనుమతుల కోసం జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేయగా.. వాటిలో దేనికి అనుమతులు రాలేదు. దాంతో లోటుపాట్లను సవరించుకున్నాక నాలుగింటికి అనుమతులొచ్చాయి. కుత్బుల్లాపూర్, మహేశ్వరం, మెదక్, యాదాద్రి భువనగిరి కళాశాలలకు ఎన్ఎంసీ నో చెప్పింది. అనుమతులు రాని కాలేజీల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరోమారు అప్పీల్ చేసుకుంది. ఆ అప్పీల్‌కు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ నెల 21న అప్పీల్‌కు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఎన్ఎంసీ నాలుగు రోజుల క్రితం హెల్త్‌సెక్రటరీకి సమాచారం పంపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. బుధవారం ఎన్ఎంసీ అధికారులతో సమావేశం కానున్నారు. అనుమతులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విన్నపం తర్వాత కూడా ఎన్ఎంసీ అనుమతులివ్వకుంటే ఇక ఈ ఏడాదికి ఆ నాలుగు కాలేజీలకు అనుమతులు రానట్లేనని అధికారులు చెబుతున్నారు.

నేడు గోదావరి బోర్డు సమావేశం

గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరుగనుంది. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డీపీఆర్‌పై చర్చించడానికి వీలుగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించి, ఈ డీపీఆర్‌ను తదుపరి ఆమోదం కోసం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని సాంకేతిక సలహా కమిటీకి పంపించనున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ వేడుకలు

» రేవంత్‌కు రాఖీలు కట్టిన సీతక్క, దీపాదాస్



గవర్నర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, మట్టా రాగమయి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బంద్రు శోభారాణి, నేరెళ్ల శారద, కాల్వ సుజాత తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టి.. ఆశీర్వాదం తీసుకున్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీతక్క, పర్ణికారెడ్డి, మట్టా రాగమయి.. రాఖీలు కట్టారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ప్రజాపతి బ్రహ్మకుమారీలు, మహిళా సిబ్బంది, మహిళా పారిశుద్ధ్య కార్మికులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, హరీశ్‌బాబు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావుతోపాటు పలువురు నాయకులకు రాఖీలు కట్టారు. బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్‌కు ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి రాఖీ కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, థ్యాంక్యూ రేవంత్ అంకుల్ అంటూ.. పలువురు చిన్నారులు ఆయనకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయితే వీరంతా వినికిడి సమస్యతో బాధపడుతూ.. ప్రభుత్వ సహాయంతో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు కావడం గమనార్హం. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత.. వినికిడి సమస్యతో కొందరు పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన సీఎం.. చిన్నారులకు వీలైనంత త్వరగా వైద్య సాయం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు కోఠిలోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలను ప్రారంభించగా.. చిన్నారులకు అవసరమైన వినికిడి యంత్రాలను సైతం ప్రభుత్వమే అందించింది. అనంతరం ఏడాదిపాటు ఆడిషన్స్ వెర్బల్ థెరపీ (ఏవీటీ)ని కూడా అందించింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న చిన్నారులు సచివాలయానికి వచ్చి.. సీఎం రేవంత్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.




కిటికీలోంచే రాఖీ!

రామకృష్ణాపూర్, ఆగస్టు 19: అక్కలతో రాఖీలు కట్టించుకోవాలని ఎంతో ఆశగా వచ్చిన చిన్నారికి గురుకుల పాఠశాల సిబ్బంది చుక్కలు చూపించారు. బాలికల గురుకులంలోకి వచ్చేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వబోమని, కుదరదంటే కుదరదని తెగేసి చెప్పారు. రాఖీలు కట్టించుకుని వచ్చేస్తామని ఆ పిల్లాడి తండ్రి మొత్తుకున్నా వాళ్లు వినిపించుకోలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తండ్రి భుజాలపై ఎక్కి కూర్చొన్న చిన్నారికి.. కిటికీలో నుంచే ఆ ఇద్దరు అక్కలు రాఖీలు కట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ గురుకులంలో దాసరి సహస్ర, అన్విక చదువుకుంటుండగా.. వారి తమ్ముడు, తండ్రికి ఈ పరిస్థితి ఎదురైంది. రక్షాబంధన్ రోజు పాఠశాలకు వచ్చిన సోదరులను సిబ్బంది అనుమతించక పోవడంపై పలువురు తల్లిదండ్రులు మండిపడ్డారు.

ప్రముఖ రచయిత కాశీభట్ల వేణుగోపాల్ కన్నుమూత

» కర్నూలు స్వగృహంలో అనారోగ్యంతో మృతి

» సోమవారమే పూర్తయిన అంత్యక్రియలు



కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: తెలుగు సాహితీ వినీలాకాశంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆధునిక సాహితీ దిగ్గజం... కవి, కథకుడు, నవలా రచయిత కాశీభట్ల వేణుగోపాల్(72) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు నగరంలోని రెవెన్యూ కాలనీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1974లో ఆంధ్రపత్రికలో 'రంగనాయకి లేచిపోయింది' అనే కథతో కాశీభట్ల తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత అనేక కవితలు రాశారు. 'నేను-చీకటి' అనే నవలతో వెలుగులోకి వచ్చారు. ఆయన రచనలు 'ఘోష', 'తపన', 'దిగంతం' 'మంచు-పువ్వు', 'తెరవని తలుపులు', 'అసత్యానికి ఆవల', 'సంగతం' వంటివి విమర్శకుల ప్రశంసలు పొందాయి. వినూత్న కథనాలు, కొత్తదనంతో కనిపించే పాత్రలు, ఆకట్టుకునే రచనా శైలి ఆయన స్వంతం. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయన రచనలు నవ్య కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిశాయి. ఆయన తన కలం ద్వారా మానవ సంబంధాలను, మనుషుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న కోణాలను, మనుషుల మధ్య ఉన్న అంతరాలను సునిశితంగా పరిశీలించి రాసేవారు. సుమారు 12కు పైగా నవలలు, వందకు పైగా కథలు రాశారు. కాశీభట్ల వేణుగోపాల్ 1952 జనవరి 2న కర్నూలులో జన్మించారు. తండ్రి ఎల్లప్ప శాస్త్రి, తల్లి హనుమాయమ్మ. కర్నూలు బీక్యాంపు బాలుర పాఠశాల్లో హైస్కూల్ విద్య, ఉస్మానియా కళాశాలలో కళాశాల విద్య పూర్తి చేశారు. 'మొదట్లో అభ్యుదయ, విప్లవ సాహిత్యాలకు ఆకర్షితుడినైనా... విశ్వసాహిత్యాన్ని చదివే క్రమంలో వాటి నుంచి బయటపడ్డాను' అని ఒక సందర్భంలో ఆయన చెప్పుకొచ్చారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయిన కాశీభట్ల... జీవితాన్వేషణలో వారణాసి, లక్నోలో కొంతకాలం ఉన్నారు. పదునైన భాషతో కూడిన కాశీభట్ల రచనా శైలి అన్ని వర్గాలను ఆకట్టుకునేది. పెద్దగా ఎవరూ స్పృశించని, సాహసించని స్త్రీ పురుష సంబంధాల్ని, పురుషుడి చీకటి ఆలోచనల్నీ, నిషేధిత సంబంధాలను తెలుగు సాహిత్యంలోకి తెచ్చి తనకంటు ఓ గుర్తింపును తెచ్చుకున్నారు. 'ఒక బహుముఖం' అనే కవితా సంపుటికి మంచి ప్రాచుర్యం లభించింది. 1996లో కర్నూలులో 'తానా' సంస్థ నుంచి పురస్కారం అందుకున్నారు. వేణుగోపాల్ మృతి విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, సాహిత్యాభిమానులు ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం కాశీభట్ల అంత్యక్రియలు నిర్వహించారు.

భుజంగరావుకు మధ్యంతర బెయిల్

గుండె సంబంధింత సమస్యలు.. వైద్యం కోసం షరతులతో 15 రోజుల బెయిల్

» జీహెచ్ఎంసీ పరిధి దాటి వెళ్లొద్దన్న కోర్టు

హైదరాబాద్, సైదాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ-3గా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న భుజంగరావు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు తనకు బెయిల్ ఇవ్వాలంటూ కోర్టును ఆశ్రయించారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. పలు షరతులతో 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో సోమవారం సాయంత్రం 5.30 సమయంలో ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. గత ప్రభుత్వ హయాంలో తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల ఫోన్లను భుజంగరావు నిబంధనలకు విరుద్ధంగా ట్యాపింగ్ చేశారని దర్యాప్తు అధికారులు అభియోగాలను మోపిన విషయం తెలిసిందే.! ఈ ఏడాది మార్చి 23న భుజంగరావును అరెస్టు చేశారు. ఆ తర్వాతి రోజు నుంచి ఆయన చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్నారు.

రెండు సార్లు గుండెపోటు.. ఒక స్టంట్

బెయిల్ పిటిషన్‌లో తన ఆరోగ్య సమస్యలకు సంబంధించిన విషయాలను భుజంగరావు కోర్టుకు వివరించారు. గతంలో తనకు రెండు సార్లు గుండె పోటు వచ్చిందని, గత ఏడాది ఆగస్టు 9న గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సర్జరీ చేసి, స్టంట్ వేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో స్టంట్ వేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. వైద్యుల సూచన మేరకు ఫిబ్రవరి 5న సాధారణ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లినట్లు.. మే 5న మరోసారి రావాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. ఈ కేసులో అరెస్టవ్వడం.. కోర్టులో బెయిల్ రాకపోవడం వల్ల వైద్యులను సంప్రదించలేకపోయానని, మే 29తో ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో జైలు అధికారులు ఉస్మానియా ఆస్పత్రిలో పరీక్షలకు పంపారని చెప్పారు. గత నెల 5న తీవ్రమైన ఛాతీ నొప్పి, గుండెలో మంటతో బాధపడ్డట్లు.. జైలులో నిపుణులైన వైద్యులు లేకపోవడంతో సరైన చికిత్స అందలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో వైద్యం కోసం నెల రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. 25 వేల వ్యక్తిగత బాండ్, ఇద్దరి ష్యూరిటీతో 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. విడుదలయ్యాక జీహెచ్ఎంసీ పరిధి దాటి వెళ్లకూడదని షరతు విధించింది. గతంలో వైద్యం చేయించుకున్న ఆస్పత్రి లేదా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్పత్రిలోనే చికిత్స చేయించుకోవాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడవద్దని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 20 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com



ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారికి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటి కన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఏబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలు చేశారు.

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాలవారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమస్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీ ఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉపకులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రప్రభుత్వం 2007లో ఉషా మెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

> సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది.

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నాయి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బతీయడం తప్ప పెద్దగా ఒనగూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువ మంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది.

ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్రప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

జాబ్ కార్నర్

సుప్రీంకోర్టులో జూనియర్ అటెండెంట్స్

ఢిల్లీలోని సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: జూనియర్ కోర్టు అటెండెంట్
ఖాళీలు: 80
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
జీతం: నెలకు రూ.46, 210
దరఖాస్తు ఫీజు: రూ.400; ఎస్సీ/ఎస్టీ/ఎక్స్ సర్వీస్‌మన్/మహిళా/దివ్యాంగ అభ్యర్థులకు రూ.200.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ప్రాక్టికల్ ట్రేడ్ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
పరీక్ష కేంద్రాలు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, ఢిల్లీ, కేరళ, అస్సాం, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్:
https://cdnbbsr.s3waas.gov.in/s3ec0490f1f4972d133619a60c30f3559e/uploads/2024/08/2024081783.pdf

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ప్రభుత్వ రంగ సంస్థ...భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: ప్రాజెక్ట్ ఇంజనీర్-1
ఖాళీలు: 11
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఐటీ/సైబర్ సెక్యూరిటీ/కంప్యూటర్ నెట్‌వర్కింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000- రూ.55,000.
వయోపరిమితి: 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
పని ప్రదేశం: ఘజియాబాద్
దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.472, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాలు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23
వెబ్‌సైట్: https://bel-india.in/

ఎన్ఎఫ్‌డీబీలో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ఎఫ్‌డీబీ)... ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 12
పోస్టుల వివరాలు
1. మానిటరింగ్ అండ్ ఇవాల్యూవేషన్ ఎక్స్‌పర్ట్
2. మానిటరింగ్ అసిస్టెంట్
3. కన్సల్టెంట్ గ్రేడ్-1, 2(టెక్నికల్/అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్)
4. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్
5. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్



అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్(సివిల్/ఐటీ/సీఎస్ఈ/ఈఈఈ/ఈసీఈ), పీహెచ్‌డీ/ఎంఎఫ్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, హైదరాబాద్; డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, మినిస్ట్రీ ఆఫ్ ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ అండ్ డెయిరీంగ్, మొదటి అంతస్తు, చందర్ లోక్ బిల్డింగ్, ఢిల్లీ.
వెబ్‌సైట్: https://nfdb.gov.in/



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.
ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.
వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.
ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.
వెబ్‌సైట్:
https://agnipathvayu.cdac.in/AV/

లిటిల్స్



చెడు సావాసం

అనగనగా అడవిలో ఒక తోడేలు ఉండేది. దానికి అడవిలో వేటాడాలంటే బద్ధకం. రాత్రులు అడవికి దగ్గర్లేఉన్న గ్రామానికి చాటుగా వెళ్లి,అక్కడి కాపరులకు తెలియకుండా మేకలను, గొర్రెలను ఎత్తుకొచ్చి, తింటూ ఉండేది. పక్కనేఉన్న చెట్టు మీద నివసించే కోతి ఒకటి తోడేలు చేసే పనులన్నీ ఆసక్తిగా గమనిస్తూ ఉండేది. ఇది తెలుసుకున్న తోడేలు ఇంకా తనెంత తెలివైనదో, ఎలా గొర్రెల కాపరుల కన్నుగప్పి, గొర్రెలను ఎత్తుకొస్తున్నదో కథలు కథలుగా వర్ణించి చెప్పేది. ఇలా కొన్నాళ్లు విన్నాక, కోతి తోడేలును ఇలా అడిగింది. 'మిత్రమా..నీ సాహసం వింటూ ఉంటే నాకు కూడా ఒక రోజు రాత్రి నీతో పాటు వచ్చి నీ సాహసాన్ని చూడాలనున్నది.నన్ను కూడా ఒక రోజు నీతో పాటు తీసుకుపోవూ?' అని అడిగింది.



ఆ మాటలు విన్న తోడేలు తన గొప్పతనానికి మురిసిపోతూ,'అయ్యో దానికేం భాగ్యం?అలాగే. రేపే నిన్ను నాతో తీసుకువెళతానులన్నది. అన్నట్టుగానే ఆ రోజు రాత్రి తోడేలు కోతిని తీసుకుని ఎప్పటిలాగే మేకలను దొంగతనం చేయడానికి వెళ్లింది. అంతకుముందు కొన్ని రోజులుగా తమ మందలలో గొర్రెలు, మేకలు ఉన్నట్టుండి మాయం అవుతుండటం గమనించుకున్న గ్రామస్తులు రాత్రివేళల్లో కాపలాగా తిరిగేటందుకుకొందరు యువకులను నియమించారు.

ఈ విషయంతెలియని తోడేలు అలవాటుగా గొర్రెల మంద దగ్గరికి వెళ్లగానే అక్కడే సిద్ధంగాఉన్న కాపలా యువకులు కర్రలతో తోడేలును కొట్టి చెట్టుకు కట్టేసారు ఆ సందడిలో కోతికి కూడా కర్రతో దెబ్బలు బాగానే పడ్డాయి.ఆ దెబ్బలు తట్టుకోలేక కోతి 'మీ గొర్రెలను ఎత్తుకెళుతోంది నేను కాదు కదా ఈ తోడేలు రోజూ మీ మందలలో మేకలు, గొర్రెలను మాయం చేస్తోంది.నన్ను ఎందుకు కొడుతున్నారు?'అని గట్టిగా కేకలు పెట్టింది.


దానికి ఆ గ్రామస్తులు 'నువ్వు దొంగతనం చేయకున్నా, చేసే తోడేలుకు సాయంగా వచ్చావు కాబట్టి, నీకు కూడా శిక్ష పడాల్సిందే'అన్నారు కాసేపటికి తోడేలును అక్కడే వదిలి, కోతి నెమ్మదిగా చెట్ల కొమ్మలలో దాగి అక్కడి నుండి తను ఉండేచోటికి వెళ్లిపోయింది. తాను తప్పు చేయకున్నా చెడు సావాసం చేయడంవలన తనకు దెబ్బలు తగిలిన విషయం గుర్తు పెట్టుకున్న కోతి ఇకపై అలాంటి పనులు చేసే వారితో స్నేహం చేయకూడదు అనుకుంది.





7 తేడాలు గుర్తించండి

సరైన నీడ కనుక్కోండి



జంతువులు ఎన్ని



డైలీ సుడోకు - 388

	2				4
			3		
5	4				1
2				4	3
		5			
1				3	

సుడోకు - 387 సమాధానం

3	2	1	6	5	4
6	5	4	3	1	2
5	4	3	2	6	1
2	1	6	5	4	3
4	3	5	1	2	6
1	6	2	4	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.